ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 95 పేజీలు: 10+4 వెల: 6.50



సింధు నదీ జలాలు ఇండియా వాక్కు 2

22 మంది న్యాయమూర్తుల ఆస్తులు వెల్లడి 5




# 'గాలి' సోదరులకు ఏడేళ్ల జైలు

ఓబుళాపురం మైనింగ్ కేసు:

**మరో ఇద్దరు, ఓ కంపెనీకి కూడా శిక్ష విధించిన సిబిఐ కోర్టు**

**నాటి గనుల మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందం నిర్దోషులుగా తీర్పు**

**ఉమ్మడి ఏపిలో తీవ్ర సంచలనం కలిగించిన మైనింగ్ మాఫియా కేసు**

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం సృష్టించిన ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో 15 ఏళ్ల సుధీర్ఘ విచారణ తరువాత నాంపల్లి సిబిఐ కోర్టు మంగళవారం నాడు సంచలన తీర్పును వెలువరించింది. ఈ కేసులో ఎ1గా వున్న గాలి శ్రీనివాస్ రెడ్డి, ఎ2గా వున్న అతని సోదరుడు కర్నాటక ఎంఎల్ఎ గాలి జనార్ధన్‌రెడ్డి, ఎ3గా ఉన్న నాటి ఎపి గనుల శాఖ డైరక్టర్ రాజగోపాల్, ఎ4గా వున్న ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి, ఎ7గా వున్న మెఫ జ్ అలీ ఖాన్‌కు సిబిఐ కోర్టు ఏడేళ్ల శిక్షను ఖరారు చేసింది. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందంలను సిబిఐ కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ఎ5గా వున్న లింగారెడ్డి మరణించగా ఎ6గా వున్న ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని కేసు నుంచి తెలంగాణ హైకోర్టు ఇదివరకే డిశ్చార్జి చేసింది. అయితే నాటి గనుల శాఖ డైరక్టర్ ఎ3 నిందితుడు రాజగోపాల్‌కు అవినీతి నిరోధక చట్టం కింద మరో నాలుగేళ్ల శిక్ష అదనంగా పడింది. ఉమ్మడి ఎపిలో ఓబుళాపురం మైనింగ్ వ్యవహారం తీవ్ర సంచలనం రేపడం తెలిసిందే. ఎపిలోని అనంతపురంలో గనులను లీజుకు తీసుకుని మరోచోట అక్రమంగా మైనింగ్ చేసినట్లు అభియోగాలు వచ్చాయి. 2007 జూన్ 18వ తేదీన ఓఎంసికి లీజులు కేటాయిస్తూ అప్పటి వైఎస్ >>2

# అంతా.. బహుపరాక్!

**యుద్ధం వస్తే ఏం చేయాలి?**

**స్వీయ రక్షణపై ప్రజలకు తర్ఫీదు**

**విమానాల నుంచి సైరన్‌లు..**

**విద్యుత్ సరఫరా నిలిపివేత**

## హైదరాబాద్‌లో నాలుగు చోట్ల నేడు మాక్ డ్రిల్

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో బుధవారం నాడు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానులతో పాటు ముఖ్య నగరాలలో మాక్ డ్రిల్ చేబట్టాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ హోం శాఖకు సమాచారం అందింది. ఇదే అంశమై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద మొహన్ అన్ని రాష్ట్రాల హోం శాఖ ముఖ్య కార్యదర్శులతో మంగళవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ (దీనిని సెక్యూరిటీ డ్రిల్ కూడా అని పిలుస్తారు) సందర్భంగా చేబట్టాల్సిన చర్యల గురించి >>2



## మొత్తం 244 జిల్లాల్లో.. మూడు కేటగిరీల్లో..

**న్యూఢిల్లీ, మే 6:** యుద్ధ సన్నద్ధతపై కేంద్ర హోంశాఖ కీలక సమీక్ష నిర్వహించింది. హోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్ నేతృత్వంలో ఈ సమీక్ష చేసింది. సుమారు 244 జిల్లాల్లో మాక్‌డ్రిల్స్‌కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమీక్షిస్తున్నారు. ఈ మేరకు సమీక్షకు సివిల్ డిఫెన్స్ డీజీ, ఎన్డీఆర్ఎఫ్ డీజీ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. బుధవారం అన్ని రాష్ట్రాల్లో సివిల్ మాక్‌డ్రిల్స్ చేయాలని >>2



మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు

## 14 మంది మావోయిస్టుల లొంగుబాటు

**కొత్తగూడెం క్రైం, మే 6 - ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14మంది సభ్యులు జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోవడం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81 బెటాలియన్, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిన్న కార్యక్రమాలు, ఆపరేసన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ పోలీస్ శాఖ కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని నక్సలిజాన్ని విడిచి పెట్టి ఇకపై తాము కూడా >>2

# వేగంగా రేడియల్ రోడ్లు



**ఓఆర్ఆర్ నుంచి ట్రిబులార్ వరకు చురుకుగా సాగుతున్న నిర్మాణం**

**హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్**

**వచ్చే 50 యేళ్ల అవసరాలకు అనుగుణంగా అలైన్‌మెంట్లు**

**రహదారులపై సమీక్షలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే6:** వచ్చే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణం, వాటికి సంబంధించి జంక్షన్లు, అనుసంధానత ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్ఆర్ఆర్ (సౌత్), రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణంపై తన నివాసంలో సీఎం మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ (సౌత్)కు సంబంధించిన అలైన్‌మెంట్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు సూచించారు. అటవీ ప్రాంతం, జల వనరులు, మండల కేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. అలైన్‌మెంట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు.. పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లకు రూపకల్పన చేయాలని సీఎం అన్నారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌వరకు రేడియల్‌రోడ్ల నిర్మాణం ప్రక్రియ వేగవంతం చేయాలని >>2

## కేంద్ర కేబినెట్ నేడు అత్యవసర భేటీ

**న్యూఢిల్లీ, మే 6:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్‌మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలోనే భారత్ భద్రతా పరమైన చర్యలకోసం బుధవారం ఉదయం 11 గంటలకు కీలక కేబినెట్ సమావేశం జరుగుతుంది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. పాకిస్థాన్‌పై సైనిక చర్య తీసుకుంటారన్న ప్రచారాలమధ్య ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటికే త్రివిధ దళాల అధిపతులు, ఎన్ఎస్ఎ అజిత్ దోవాల్‌తోప్రధానిమోడీ కీలక సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే త్రివిధ దళాల అధిపతులు, హోంశాఖ, రక్షణ మంత్రిత్వశాఖలతో వేరువేరుగా సమావేశాలునిర్వహించిన తర్వాత దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్స్ నిర్వహించాలనినిర్ణయించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులను వెంటాడి మరీ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా వారికి మద్దతిస్తున్నవారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోనని తెగేసి చెప్పారు. ఈక్రమంలో బుధవారం దేశవ్యాప్తంగా జరిగే మాక్‌డ్రిల్స్ మరోపక్క కేబినెట్ భేటీ అనేది ఇపుడు ఉత్కంఠగా మారింది.

# ఆర్టీసీ సమ్మె వాయిదా

**మంత్రి పొన్నంతో ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ కోదండరామ్, జెఎసి నేతల చర్చలు సఫలం**



మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నంతో చర్చలు జరుపుతున్న ఆర్టీసీ జెఎసి నేతలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ఆర్‌టిసి కార్మికులు నేటి నుంచి తలపెట్టిన సమ్మె వాయిదా పడింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆర్‌టిసి జేఏసీ నేతలతోపాటు సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌తో చర్చలు జరిపారు.చర్చలు సఫలం అవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు జేఏసీ నేతలు ప్రకటించారు. ఆర్‌టిసి జేఏసీ సమ్మె చేయతలపెట్టిన నేపథ్యంలో సోమవారం సచివాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టిజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ జేఏసీ, కార్మిక సంఘాల నేతలు కలిసి చర్చించారు. సంస్థ పరిరక్షణ కార్మికుల సంక్షేమం ప్రయాణికుల సౌకర్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని.. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె వాయిదా వేసుకోవాలని కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడతామని జేఏసీ నేతలకు మంత్రి హామీ ఇచ్చారు.సమస్యలపై ముఖ్యమంత్రితో మాట్లాడి కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని.. జేఏసి కార్మిక సంఘాలు తక్షణమే సమ్మెపై వెనక్కి తగ్గాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ కార్మికులు మా కుటుంబంలా భావిస్తున్నామని..తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీకి వ్యతిరేకంగా ఏ ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని.. తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీ నేతలకు చెప్పారు. చర్చల అనంతరం సమ్మె కొంతకాలం వాయిదా వేయాలని నిర్ణయించామని ఆర్‌టిసి జేఏసీ ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్‌టిసి >>2


అమెరికానుంచి వెళ్తే వెయ్యి డాలర్లు ఇస్తాం: ట్రంప్ 5




## అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంపు

**హైదరాబాద్, మే 6, ప్రభాత వార్త:** ఇచ్చిన హామీ మేరకు వారికి జీతాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ టీచర్లను అంగన్వాడీ టీచర్గా ప్రమోట్ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,989 మంది మినీ అంగన్వాడీ టీచర్లు ఇకపై అంగన్వాడీ టీచర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో ఇకపై మినీ, మెయిన్ అంగన్వాడీ అనే తేడా ఉండదు కాగా,గతంలో మినీ అంగన్వాడీలకు రూ.7800 జీతం మాత్రమే ఇస్తుండగా తాజా నిర్ణయంతో వారికి రూ. 13,650 జీతం >>2

## టీచర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ

**చైర్మన్‌గా నవీన్ మిట్టల్**

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఉద్యమ కార్యాచరణను తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని ఉద్యోగ సంఘాలతో చర్చించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు ఐఏఎస్‌లతో కమిటీని >>2

# 'సరస్వతీ' సంరంభం

**14 రాత్రి ప్రారంభం కానున్న పుష్కరాలు**

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ**



**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే అంతర్వాహిని సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి, పరిశ్రమలు, చేనేత శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల సమీక్షాసమావేశం సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి కార్యాలయంలో జరిగింది. అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ స్నానానికి లక్షలాది భక్తులు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారని తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలు బృహస్పతి మిథున రాశి ( మిథునరాశి)లోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజుల పాటు ఆచరిస్తారని, ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పుష్కరాలు తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత వచ్చాయని అన్నారు. మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతాయని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని చెప్పారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఈ పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను మంత్రులు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రారంభించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. సరస్వతీ పుష్కరాలు పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టినట్టు ఇరువురు మంత్రులు తెలిపారు. ఆర్‌టిసి బస్సులను అవసరానికి అనుగుణంగా నడపాలని ఆర్‌టిసిఅధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయశాఖకు లాభం చేకూరినట్టు మంత్రి కొండా తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నట్టు మంత్రి కొండా సురేఖ చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతినది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి కొండా తెలిపారు.పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం నుంచి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సిఎస్ రామకృష్ణరావు, డిజిపి జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్అండ్‌బి ప్రిన్స్ పల్ సెక్రటరీ వికాస్ రాజ్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.



సంధ్యా కన్వెన్షన్ మినీహాల్‌ను నేలమట్టం చేసిన దృశ్యం

## మళ్లీ పంజా విసిరిన 'హైడ్రా'

**సంధ్య కన్వెన్షన్ మినీ హాలు నేలమట్టం**

**సైబరాబాద్ ప్రతినిధి, మే 6 ప్రభాతవార్త:** గచ్చిబౌలిలో అత్యంత వివాదాస్పదమైన సంధ్యాకన్వెన్షన్‌పై హైడ్రా అధికారులు పంజా విసిరారు. లేఅవుట్‌లోని ఇతరుల ప్లాట్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను మంగళవారం నేలమట్టం చేశారు. అనుమతి లేకుండా >>2



మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లోని రాజ్‌మాతా విజయరాజే సింధియా కృషి విశ్వవిద్యాలయంలో 'మోడల్ గోశాల, సహజ వ్యవసాయ యూనిట్'ను ప్రారంభించిన అనంతరం పశువులకు మేతగా గడ్డి వేస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్. చిత్రంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సిఎం మోహన్ యాదవ్ తదితరులు

## మూడు కేటగిరీల్లో మాక్‌డ్రిల్

>> నిన్న కేంద్రం ఆదేశించింది. కాగా, తాము సన్నద్ధతను సమీక్షించామని సమావేశం అనంతరం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సభ్యులు ఒకరు చెప్పారు. ఈ నేపథ్యంలో సరిదిద్దాల్సిన అంశాలను గుర్తించామని తెలిపారు. బుధవారం మాక్‌డ్రిల్స్ నిర్వహించే ప్రాంతాలను 3 కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో ఢిల్లీ, ముంబయి, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్, చెన్నై, కల్పక్కం, నరోరా జిల్లాలు ఉన్నాయి. రెండో జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో జాబితాలో 45 జిల్లాలు ఉన్నాయి. ఇక పాకిస్థాన్‌తో సరిహద్దు ఉన్న రాష్ట్రాలు గుజరాత్, పంజాబ్, హరియాణా, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక సూచనలు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం. పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకార దాడులు చేయవచ్చనే అంచనాలు నెలకొన్న తరుణంలో కేంద్ర హోంశాఖ రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పాక్ కూడా ప్రతిదాడికి దిగితే అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తోంది. సమాచార మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, ఎయిర్‌రెయిడ్ హెచ్చరిక సైరెన్ల గురించి, ప్రతికూల పరిస్థితుల్లో పౌరులకు వారిని వారు ఎలా కాపాడుకోవాలో ట్రైనింగ్ ఇవ్వడం, బంకర్లు ట్రెంచ్‌లను శుభ్రం చేసుకునే సన్నద్ధతపై మాక్ డ్రిల్స్ ఉంటాయి. అంతేకాకుండా క్రాష్ బ్లాకౌట్స్ కీలకమైన ప్లాట్లు, ఇన్‌స్టాలేషన్ల వద్ద ముందస్తుగా శత్రువులకు దొరకకుండా జాగ్రత్త పడటం, అత్యవసర సమయంలో మనుషులను తరలించే ప్రణాళికలు గురించి ఈ డ్రిల్స్ ఉంటాయి. ఇప్పటికే పంజాబ్, హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మాక్‌డ్రిల్స్‌కు కీలక ప్రదేశాలను ఎంపికచేసాయి. మహారాష్ట్ర ప్రభుత్వం అయితే 19 చోట్ల ఈడ్రిల్స్ ఏకకాలంలో నిర్వహించేందుకు నిర్ణయించింది. అలాగే సముద్రజలాలున్న ప్రాంతాల్లోకూడా ఈ మాక్‌డ్రిల్స్‌కు ఏర్పాట్లుజరిగాయి.

## సమ్మె వాయిదా

>>సమ్మెను వాయిదా వేస్తున్నామని, సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెకు దిగుతామని వెల్లడించింది. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామని, ప్రైవేటు విద్యుత్ బస్సుల గురించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ప్రభుత్వమే విద్యుత్ బస్సులు కొని ఆర్‌టిసికి ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. కారుణ్య నియామకాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని చెప్పామని, విశ్రాంత ఉద్యోగుల బకాయిలపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. వేతన సవరణ గురించి సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనంపై సుదీర్ఘంగా చర్చించామని జేఏసీ నేతలు తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేయాలని టిజిఎస్‌ఆర్‌టిసి జేఏసీ నేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు చర్చలకు ఆహ్వానం రాకపోతే.. మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ క్రమంలోనే సోమవారం ఆర్‌టిసి కళాభవన్ నుంచి బస్ వరకు భారీ కవాతు సైతం నిర్వహించారు. సమ్మె చేయడానికి జేఏసీ ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లు, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. 2023లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను విలీనం చేస్తున్నట్లు గెజిట్ ముద్రించిందని.. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విలీనం చేస్తామని వారి మేనిఫెస్టోలో పెట్టి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.17నెలలు గడుస్తున్నా ఉద్యోగులవిలీనం జరగలేదన్నారు. 2017 వేతన సవరణ జరిపినా ఉద్యోగులకు రావలసిన బకాయిలు నేటికీ చెల్లించలేదని, వేతన సవరణ పాక్షికంగానే జరిగిందని, కొత్త అలవెన్సులు అమలులోకి రాలేదని పేర్కొన్నారు.

## మళ్లీ పంజా విసిరిన 'హైడ్రా'

>> నిర్మించిన సంధ్యాకన్వెన్షన్ మినీహాల్‌తోపాటు ప్రధాన కన్వెన్షన్‌ను ఆనుకొని నిర్మించిన వంటగదులను, పది రెస్ట్‌రూమ్‌లను హైడ్రా తొలగించింది. దీంతోపాటే ఐరన్ పిల్లర్లతో చేపట్టిన రెండంతస్తుల రెండు కట్టడాలను కూల్చివేసింది. హైడ్రా అధికారులు, బాధితులు తెలిపిన ప్రకారం ఈఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలావున్నాయి. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వేనెంబర్లు 124, 125లలో దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ పేరుతో దాదాపు 20 ఎకరాల్లో లేఅవుట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 162ప్లాట్లతో లేఅవుట్ వేయగా శ్రీధర్‌రావు అనే వ్యక్తి లేఅవుట్ పక్కనే భారీ ఎత్తున సంధ్యా కన్వెన్షన్‌ను నిర్మించుకున్నాడు. అనంతరం లేఅవుట్ ప్లాట్ల హద్దులను, రోడ్లను, పార్కులను సైతం నామరూపాలు లేకండా చేసి నిర్మాణాలు చేపట్టాడంటూ హైడ్రా ప్రజావాణిలో పలువురు ప్లాటు యజమానులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా మంగళవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తుతో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన సంధ్యాకన్వెన్షన్ మినిహాల్‌తోపాటు ప్రధాన కన్వెన్షన్‌ను ఆనుకొని నిర్మించిన వంటగదులను, పది రెస్ట్‌రూమ్‌లను తొలగించింది. దీంతోపాటే ఐరన్ పిల్లర్లతో చేపట్టిన రెండంతస్తుల రెండు కట్టడాలను కూల్చివేసింది. లేఅవుట్ చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతోపాటు సంధ్య కన్వెన్షన్ పేరొట ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను సైతం హైడ్రా అధికారులు తొలగించారు.

## టీచర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ

>> ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జీవో ఆర్‌టి నంబర్ 572ను జారీ చేశారు. కమిటీలో సీనియర్ ఐఎఎస్ నవీన్ మిట్టల్ ఛైర్‌పర్సన్‌గా పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ సభ్యులుగా కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ గుర్తింపు పొందిన అసోసియేషన్లతో సమావేశాలను నిర్వహించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని సూచించింది. పెండింగ్ సమస్యలను తెలుసుకొని వాటికి సంబంధించి ఆచరణీయమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించింది. ప్రతిపాదనలను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని సూచించింది. కమిటీ ఏర్పడిన నేపథ్యంలో నేడు(బుధవారం) సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో కమిటీ సభ్యులు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం కానుంది.

## లొంగుబాటు

>> కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 14 మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏసీఎంలు, పార్టీ మెంబర్లు 4 మంది, మిలీషియా మెంబర్లు 3, కేఏఎంఎస్ మెంబర్లు 1, వీసీఎంఎలు 4వీరిలో ముగ్గురు మహిళా సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం, పోలీస్‌శాఖ లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు అందిస్తున్న పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై వివిధ క్యాడర్లలో ఉన్న వారు తమ ఆయుధాలను విడిచిపెట్టి పోలీసుల ఎదుట లొంగిపోవడం జరుగుతుంది. లొంగిపోయిన అనంతరం వారికి చెందాల్సిన ప్రతిఫలాలను కూడా తక్షణమే అందేలా తెలంగాణ పభ్రుత్వం తరపున పోలీస్‌శాఖ కషి చేస్తున్న వియాన్ని గ్రహించి ఇక్కడ లొంగిపోవడం జరుగుతుందన్నారు., తెలంగాణ ప్రభుత్వం అందించే సౌకర్యాలను పొందుతూ తమ కుటుంబ సభ్యులతో కలిసి లొంగిపోయిన వారు పశ్రాంత జీవనాన్ని గడుపుతున్నారు. ఈ సంవత్సరం జనవరి 2025 నుంచి ఇప్పటి వరకు నిషేదిత మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్లలో పనిచేసిన 227 మంది మావోయిస్టు సభ్యులు వివిధ హోదాల్లో కొత్తగూడెం పోలీసుల ఎదుట లొంగిపోవడం జరిగింది. లొంగిపోయిన వారిలో ఎహారాష్ట్ర బీజాపూర్ రాష్ట్రానికి చెందిన సోడి బుద్రా అలియాస్ దులా, వాజేడు వెంకటాపురం ఏరియా కమిటీకి చెందిన కమల ఇడిమే అలియాస్ రాధిక, బీజాపూర్ జిల్లాకు చెందిన పదం నాందే, బీజాపూర్ జిల్లాకు చెందిన మడివి జోగా, బీజాపూర్ మంగల్‌తూర్ గ్రామానికి చెందిన కుంజం కోసా, గంగ్లూర్ పీఎస్ దుదితుమినార్ గ్రామానికి చెందిన లీకం సుక్రాం, బీజాపూర్ జిల్లా పెద్దచండా గ్రామానికి చెందిన పోడియం హిడమ, అదే గ్రామానికి చెందిన మడివి మంగ, కడితి నందే, కుర్సంనమ్మయ్య, భీమవరం గ్రామానికి చెందిన మడివి కోమ, రాంపురం గ్రామానికి చెందిన నుపో లక్మా, కస్తూరిపాడు గ్రామానికి చెందిన పోడియం జోగా, భీమవరం గ్రామానికి చెందిన మడివి సహదేవ్‌లు ఉన్నారు.

## టీచర్ల వేతనాలు పెంపు

>> అందనుంది. పెంచిన వేతనం ఏప్రిల్ నెల నుంచి అకౌంట్లలో జమ కానుంది. అయితే, జీతాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,989 అంగన్వాడీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తమకు ప్రమోషన్ ఇవ్వడంతో పాటు జీతం పెంచినందుకు మంత్రి సీతక్కతోపాటు సర్కారు రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 07-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
దశమి ఉ.10.21
పూర్వఫల్గుణి సా.6.19
వర్జ్యం రా.2.22-తె.4.09
దు.ఉ.11.40-మ.12.31
శుభసమయం:ఉ.9.15-9.50
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** విలువైన విషయాలు తెలుసుకుంటారు. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తుంది. వాహనసౌఖ్యం.

**వృషభం :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వస్తు సేకరణ.

**కర్కాటకం:** ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా సాగుతారు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు.

**సింహం:** ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. పనులలో జాప్యం జరిగినా విదానంగా పూర్తి చేస్తారు.

**కన్య :** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ఆలయ దర్శనాలు.

**వృశ్చికం:** ప్రయాణాలలో మార్పులు వుంటాయి. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వృత్తివ్యాపారాలలో స్వల్ప లాభాలు.

**కుంభం:** ఉద్యోగాలలో ఒత్తిడులు పెరిగినా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మీనం :** కొత్త పనులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'గాలి' సోదరులకు ఏడేళ్ల జైలు

>> సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో క్యాప్టివ్ అనే పదాన్ని తొలగించారంటూ వచ్చిన ఆరోపణలపై 2009 డిసెంబర్ ఏడవ తేదీన సిబిఐ కేసు నమోదు చేసింది. ఓబుళాపురం మైనింగ్ వ్యవహారంలో సిబిఐ అధికారులు ఐపిసి 120 (బి), రెడ్‌విత్ 420, 409, 468, 471లతో పాటు సెక్షన్ 13 (2), రెడ్‌విత్ 13 (1)డి కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసును నాటి సిబిఐ జాయింట్ డైరక్టర్ వివి లక్ష్మీనారాయణ విచారించారు. ఆయన నేతృత్వంలోని సిబిఐ బృందం హైదరాబాద్ నుంచి బళ్లారికి వెళ్లి రెండు రోజుల పాటు కాపుకాసి గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నిందితులను అరెస్టు చేయడం, వీరందరిని భారీ బందోబస్తు మధ్య రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు తీసుకురావడం అప్పట్లో సంచలనం రేపింది. అనంతరం వీరిని చంచల్‌గూడ జైల్లో నిర్బంధించారు. చంచల్‌గూడ జైల్లో గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నిందితులు ఏడాదిన్నరకు పైగా వున్నారు. కాగా ఇదే కేసులో గాలి జనార్ధన్ రెడ్డికి నాటి సిబిఐ కోర్టు న్యాయమూర్తి పట్టాభి రామారావు అక్రమంగా బెయిల్ ఇచ్చినందుకు అరెస్టయి జైలు పాలవడం మరో సంచలనం రేపింది.. ఈ కేసులో పట్టాభి రామారావుకు గాలి జనార్ధన్ రెడ్డి వంద కోట్ల రూపాయల లంచం ఇచ్చినట్లు అభియోగాలు వచ్చాయి. ఇలా ఓబుళాపురం కేసులో మొదటి నుంచి అన్ని అంశాలు సంచలనం రేపాయి. ఈ కేసులో తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, డివిజన్ బెంచ్ దీనిని ఎత్తేయడం, పలురకాల పిటిషన్ల కారణంగా దాదాపు 15 ఏళ్ల పాట విచారణ సాగింది. ఈ క్రమంలోనే కేసు విచారణకు ఐదేళ్ల సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు ఓబుళాపురం మైనింగ్ కేసులో సిబిఐ నాలుగు ఛార్జిషీట్లను దాఖలు చేసింది. ఇందులో 2011లో మొదటి చార్జిషీట్ దాఖలు చేయగా 2014లో చివరి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 219 మంది సాక్షులను విచారించగా ప్రత్యక్షంగా పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సిబిఐ సేకరించి కోర్టుకు సమర్పించింది. ఓబుళాపురం గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సిబిఐ ఆధారాలను సేకరించింది. అక్రమంగా తవ్వకాలు చేయడం, రవాణా, ఎగుమతులు, విక్రయాలలో భారీగా అవకతవకలు జరిగినట్లు సిబిఐ గుర్తించింది. ఎపి, కర్నాటకలో పెద్ద ఎత్తున అక్రమంగా ఇనుప ఖనిజం తవ్వకాలు చేసినట్లు సిబిఐ గుర్తించింది. ఓబుళాపురం గనుల నుంచి విదేశాలకు అక్రమంగా 60 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఎగుమతి అయి నట్లు సిబిఐ గుర్తించింది, ఇదంతా అక్రమ, బినామీ లావాదేవీల వల్ల జరిగాయని సిబిఐ విచారణలో తేలింది. ఈ కేసు విచారణలో భాగంగా 3337 డాక్యుమెం ట్లను సిబిఐ అధికారులు పరిశీలించారు. ఓబుళాపురం గనుల తవ్వకాలలో సర్కారు కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా ఇతరచోట్ల భారీగా అక్రమంగా మైని ంగ్ చేసినట్లు సిబిఐ గుర్తించింది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు 844 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొన్న సిబిఐ ఇదే అంశాన్ని ఛార్జిషీట్‌లో పొం దుపరిచింది. ఈ కేసు విచారణలో భాగంగా 219 సాక్షులను న్యాయస్థానం ఎదుట సిబిఐ హాజరు పరిచి వారి వాంగ్మూలాన్ని కోర్టులో పొందు పరిచింది. దీని ఆధారంగా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో నాటి గనుల శాఖ మంత్రిగా వున్న సబిత ఇంద్రారెడ్డి మినహా మిగతా నిందితులంతా అరెస్ట యి జైలుకు వెళ్లారు. ఈ కేసులో తన పాత్ర లేదని సబిత ఇంద్రారెడ్డి డిశ్చార్జి పిటిషన్ వేసినా కోర్టు దానిని పరిగణలోకి తీసుకోలేదు. ఈ కేసు విచారణ సుధీర్ఘ ంగా సాగింది. దీనిపై మంగళవారం తుది తీర్పు రానుందని ముందుగానే తెలియడంతో నాంపల్లి కోర్టుల ప్రాంగణం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చే శారు. తీర్పు నేపథ్యంలో గాలి జనార్ధన్ రెడ్డి, సబిత రెడ్డి సహా పలువురు కోర్టుకు హాజరయ్యారు. చివరకు దీనిపై సిబిఐ కోర్టు తుది తీర్పులో ఎ1 గా వున్న గాలి శ్రీనివాస్ రెడ్డి, ఎ2గా వున్న గాలి జనార్ధన్ రెడ్డి, ఎ3గా వున్న విడి రాజగోపాల్, ఎ4గా వున్న ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి, ఎ7గా వున్న అలీ ఖాన్‌తో పాటు ఓఎంసి కంపెనీకి సిబిఐ కోర్టు ఏడేళ్ల శిక్షను. పది వేల రూపాయల జరిమానాను విధించింది. కోర్టు తీర్పు వెలు వరించే సమయంలో కోర్టు హాల్‌లోనే వు న్న గాలి జనార్ధన్ రెడ్డి తనకు శిక్షను తగ్గించాలని వేడుకున్నారు. తాను ఇప్పటికే నాలుగేళ్ల పాటు జైల్లో వున్నానని, ప్రస్తుతం ఎంఎల్‌ఎగా వున్నానని, ప్రజా జీవితంలో వుండాల్సి వుండడంతో శిక్షను తగ్గించాలని కోరగా దీనికి న్యాయమూర్తి మండిపడ్డారు. మీరు యావజ్జీవ శిక్షకు అర్హులని తెలిపారు.

మీకు పదేళ శిక్ష ఎందుకు విధించ కూడదని ప్రశ్నించారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదు ర్కొన్న నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందంలను సిబిఐ కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది. వీరిద్దరిపై ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. కాగా ఈ కేసులో నాటి గనుల శాఖ డైరక్టర్ విడి రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్ల జైలు శిక్షను సిబిఐ కోర్టు విధించింది. అప్పట్లో ఆయన భూగర్భ గనుల శాఖ డైరక్టర్‌గా వున్న ఒదున అవినీతి నిరో ధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను కోర్టు విధించింది. ప్రభుత్వ అధికారిగా వుంటే అక్రమాలకు పాల్పడినందుకు రాజగోపాల్‌కు మొ త్తం మీద 11 ఏళ్ల జైలు శిక్ష పడింది.

# సింధు నదీ జలాలు ఇండియా హక్కు

### అవి దేశప్రయోజనాలకే వినియోగం: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 6:** భారత్‌కు చెందిన నీళ్లు దేశ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించబడతాయని ప్రధానినరేంద్రమోడీ నొక్కిచెప్పారు. భారత జలాలు ఇప్పటివరకూ బయటకు వెళ్లాయని, ఇకనుంచి అలా ఉండదన్నారు. మననీళ్లు మనహక్కు అని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. పాకిస్తాన్‌కు సింధుజలాల నిలిపివేత అంశంపై స్పందించినమోడీ మన నీళ్లు ఇకనుంచి మన అవసరాలకు మాత్రమే వినియోగిస్తామన్నారు. భారత్‌కు ఉద్దేశించిన జలాలు ఇక్కడే ఉంటాయని, వాటిని భారత దేశప్రయోజనాలకు మాత్రమే వినియోగిస్తామన్నారు. గతంలో భారత్‌కు దక్కాల్సిన నీటివాటాకూడా బయటకు వెళ్లిపోయేది. కానీ ఇపుడు భారత జలాలు ఇక్కడే ప్రవహిస్తాయన్నారు. ఇక్కడే నిలుస్తాయన్నారు. ఇక్కడిప్రయోజనాలు తీరుస్తాయని మనదేశ జలాలు మన హక్కు అని ఆయన ఘంటాపథంగాచెప్పారు. చీనాబ్‌నదిపై ఉన్న బాగ్లిహార్ ఆనకట్టనుంచి పాకిస్తాన్‌కు నీటిప్రవాహాన్ని నిలిపివేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో జీలం నదిపై ఉన్న కిషన్‌గంగా ప్రాజెక్టునుంచి ప్రవాహాలను తగ్గించేసన్నాహకాల తరుణంలో మోడీ వ్యాఖ్యలుప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఉగ్రవాదుల్ని, వారి మద్దతుదారుల అంతుచూస్తామని మూడురోజులక్రితంమరోసారి హెచ్చరించిన మోడీ ఇపుడు నదీజలాలను సంపూర్ణంగా వినియోగించుకుంటామని చెప్పారు. ఉగ్రవాదాన్ని అంతంచేయడమే లక్ష్యంగాపనిచేస్తామన్నారు. ఉగ్రదాడి తర్వాతమోడీ మాట్లాడుతూ పహల్గామ్‌పై ఘటనకు బాధ్యులైనవారిని ఏ ఒక్కరినీ వదిలిపెట్టేప్రసక్తిలేదన్నారు. వారిని మట్టిలో కలిపేస్తామంటూ మోడీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తాజాగా ఉగ్రచర్యలకు సంబంధించి హెచ్చరికలుజారీచేసారు.

## పాల్కన్ కంపెనీ ఎండి అమర్ దీప్‌ను అరెస్టు చేసిన సిఐడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే6:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన పాల్కన్ కంపెనీ గోల్‌మాల్ కేసులో ఆ సంస్థ ఎండీ అమర్ దీప్‌ను సిఐడి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రూ.4వేల కోట్లకు సంబందించిన ఈ స్కామ్‌కు కంపెనీ సీఈఓగా ఉన్న ఆయనను బాధ్యుడిగా గుర్తించారు.



శ్రీనగర్‌లోని దాల్ లేక్‌లో మంగళవారం నిర్వహించిన మాక్ డ్రిల్ దృశ్యం

## వేగంగా రేడియల్ రోడ్లు

>> సూచించారు. హైదరాబాద్ నుంచి వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్‌ఆర్‌ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో తగు రీతిలో ట్రంపెట్స్ నిర్మించాలని.. ఎటువంటి గందరగోళానికి తావులేకుండా, ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా దాటేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్.. నూతన అలైన్‌మెంట్‌కు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించాలన్నారు. ఈ నూతన రహదారులకు సంబంధించి జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం అదనపు సీఈవో ఇ.వి.నరసింహారెడ్డి, ఎన్‌హెచ్ ప్రాంతీయ అధికారి శివశంకర్‌పాల్గొన్నారు.

## హైదరాబాదీ బిర్యానీ అమోఘం

### మిస్ ఇండియా నందిని గుప్తా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే6:** హైదరాబాదీలు ఆప్యాయతను పంచుతారని మిస్ ఇండియా నందిని గుప్తా అన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే అందాల భామలు కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోటీల నిర్వహణపై హైటెక్ సిటీలో ప్రభుత్వం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మిస్ ఇండియా నందిని గుప్తా మాట్లాడుతూ తెలంగాణ గురించి ప్రస్తావించిన ప్రతిసారీ తనకు గొప్ప అనుభూతి కలుగుతుందని చెప్పారు. ఈ ప్రాంత సంస్కృతి, అభివృద్ధి అద్భుతంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌శరవేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఇక్కడి ప్రజలు ఎంతో ఆప్యాయతను పంచుతారన్నారు.హైదరాబాదీ బిర్యానీ నుంచి ఇరానీ చాయ్ వరకు స్థానిక వంటకాలు అమోఘమని.. అవి తనను కట్టిపడేశాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ప్రతియువతి ఒక ఉన్నతలక్ష్యంతో ముందుకు సాగుతున్నారని నందిని గుప్తా అభిప్రాయం వ్యక్తం చేశారు. పోచంపల్లి చేనేత మగ్గాలు తనకు ఎంతో నచ్చాయని తెలిపారు. యంగెస్ట్ స్టేట్ అయినా కూడా ఇక్కడ హాస్పటాలిటీ బాగుందని కితాబిచ్చారు. నందిని గుప్తా ఇప్పటికే తెలంగాణలోని పలు చారిత్రక కట్టడాలు, ఆలయాలు, పర్యాటక స్థలాలను సందర్శించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను గురించి హర్షం వ్యక్తం చేశారు.

# అంతా.. బహుపరాక్!

>> ప్రజలకు క్షుణ్ణంగా వివరించా లని ఆదేశించారు. రక్షణ రంగ సంస్థలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యుత్ ప్రాజెక్టులు, కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ ప్రాజెక్టుల వద్ద చేబట్టాల్సిన భద్రత గురించి ఆయన వివరించారు. రాష్ట్రంలో మాక్ డ్రిల్ నిర్వహణకు అగ్నిమాపక, విపత్తుల విభాగం డిజి నాగిరెడ్డిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. మాక్ డ్రిల్ పై నాగిరెడ్డి ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ బుధవారం నాటి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయసాగారు.

ఇక బుధవారం నాడు జరిగే సెక్యూరిటీ డ్రిల్ గురించి ఓసారి పరిశీలిద్దాం. సంక్షోభ సమయంలో ప్రజలు తమను తాము ఎలా కాపాడుకోవాలనే దానిపై ముం దుగా తర్ఫీదునిచ్చేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. ఇంతకు ముందు పలు సందర్భాలలో మాక్ డ్రిల్ ఆయా నగరాలలో జరిగిన ఉదంతాలున్నాయి. కార్గిల్ యుద్ధ సమయంలో జమ్మూ కాశ్మీర్‌తో పాటు పంజాబ్‌లోని సరిహద్దు ప్రాంతాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అయితే దేశ వ్యాప్తంగా ఏక కాలంలో జరగడం 1971 భారత్, పాక్ యుద్ధం తరువాత ఇదే తొలిసారిగా నిపుణులు చెబుతున్నారు. 1971 భారత్, పాక్ యుద్ధ సమయంలో ఈ మాక్ డ్రిల్ దేశ వ్యాప్తంగా ని ర్వహించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక రాష్ట్రం వరకు వస్తే ఇంతకు ముందు అగ్నిమాపక శాఖ, పోలీసు విభాగం బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ప్రజలు ఎక్కువగా ఉండే మాల్స్, పార్కుల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించిన సందర్భాలు వున్నాయి, అగ్ని ప్రమాదాల నుంచి ఎలా రక్షణ పొందాలి...? ప్రమాదాలు జరిగితే ఎలా తప్పించుకోవాలి...? ఇతరులను ఎలా కాపాడాలి ...? గాయపడ్డ వారికి వెంటనే ప్రథమ చికిత్స ఎలా అందించాలి...? వారిని వెంటనే ఎలా ఆసుపత్రు లకు తరలించాలి... ? మంటలు ఇతర ప్రాంతాలకు వ్యా పించకుండా ఎలా వ్యవహరించాలి...? అనే దానిపై అగ్నిమాపక శాఖ అనేకసార్లు మాక్ డ్రిల్ నిర్వ హించి ప్రజలను చైతన్య పరిచింది. ఇక పోలీసు శాఖ వరకు వస్తే దేశంలో వరుస ఉగ్రదాడులు జరిగిన సందర్భాలలో మాక్ డ్రిల్ నిర్వహించింది. ఉగ్రవాదులు ఉన్నపళంగా బాంబులు వేస్తే ఎలా తప్పించుకోవాలి ...? తుపాకులతో కాల్పులు జరిపితే ఎలా ప్రాణాలను కాపాడుకోవాలి...? ఆకాశం నుంచి బాంబులు ప డితే ఎలా తప్పించుకోవాలి...? ఆత్మరక్షణ కోసం నిరాయు ధులుగా వున్న వారు ఆయుధాలతో వున్న ఉగ్రవాదులతో ఎలా ఎదురుదాడి చేయాలి...? వీలు కుది రితో ఉగ్రవాదులను ఎలా బంధించాలి...? బాంబులతో పాటు పేలుడు పదార్ధాలు వుంటే వాటికి దూరంగా ఎలా వుండాలి...? పోలీసులు రావడం ఆలస్యమైతే అవి పేలకుండా ఎలా వ్యవహరించాలి...? ఉగ్రదాడుల్లో ఎవరైనా గాయపడితే వారికి ఎలా వైద్య సేవలందించి, ఆసుపత్రులకు తరలించాలి...? అనే అంశాలపై పోలీసులు అనేకమార్లు మాక్ డ్రిల్ ద్వారా ఆయా ప్రాం తాల ప్రజలకు వివరించారు. ఈ నెల ఏడవ తేదీన రాష్ట్రంలో జరగనున్న మాక్ డ్రిల్ సంర్భంగా పోలీ సు, అగ్నిమాపక విభాగాలతో పాటు రక్షణ శాఖ యుద్ధం వస్తే స్వీయ రక్షణ గురించి ప్రజలకు మరోమారు వివరించనున్నాయి.

మాక్ డ్రిల్ కోసం గ్రేటర్ పరిధి లో మంగళవారం నాడు సన్నాహాలు పూర్తి చేశారు. మాక్ డ్రిల్ సందర్భంగా ఆకస్మికంగా వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాల ద్వారా సైరన్‌లు మోగుతా యి. ఈ సైరన్‌లు వినపడగానే ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి. ఇదే సమయంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ కొంత సేపు పనిచేయవు. వున్నట్లుండి ట్రాఫిక్ డైవర్షన్స్ చేబడతారు. రాత్రి వేళ అయితే విద్యుత్ సరఫరా కొన్ని గంటల పాటు ఆపేస్తారు. నగరాలను శతృవులు గుర్తించకుండా వుండేందుకు ఇలా చే స్తారు. దీంతో పాటు హైరిస్క్ జోన్లలో వున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. మాక్ డ్రిల్‌లో భాగంగా పలుచోట్ల పోలీసు శాఖ డమ్మి బాంబులను ప్ర యోగించి ప్రజలు ఎలా తప్పించుకోవాదలనే దానిపై విరించే వీలుంది. దీంతో పాటు పాటశాలలు, కాలేజీలు, కార్యాలయాలు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్, అండ్ గైడ్స్, కమ్యూనిటీ సెంటర్లలో యుద్ధం గురించి శిక్షణ ఇచ్చేందుకు పోలీసు, అగ్నిమాపక శాఖ, రక్షణ శాఖలు నిర్ణయించాయి. సైన్యానికి చెందిన అధికారు లు కూడా ఇందులో పాల్గొంటారు. యుద్ధం సంభవిస్తే ఎలా వ్యవహరించాలి...? సురక్షిత ప్రాంతాలను ఎలా గుర్తించి, అక్కడకు ఎలా చేరుకోవాలి, ఆందోళన పడకుండా ఎలా వుండాలి...? అనే అంశాలపై పౌరులకు శిక్షణ ఇస్తారు.

కాగా మాక్ డ్రిల్ గురించి నోడల్ ఆఫీసర్ నాగిరెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం హైదరాబాద్‌లో నాలుగు చోట్ల మాత్రమే జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర చోట్ల లేదని ఆయన వెల్లడించారు. ఈ సందర్వంగా ప్రజలు పోలీసులతో పాటు ఇతర అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

**హైదరాబాద్‌లో నేడు నాలుగుచోట్ల ఆపరేషన్ అభ్యాస్ పేరిట మాక్ డ్రిల్**

మాక్ డ్రిల్‌లో భాగంగా గ్రేటర్ పరిధిలోని నాలుగుచోట్ల ఆపరేషన్ అభ్యాస్ పేరిట మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్, డిఆర్‌డిఓ, మౌలాలిలోని ఎన్ఎఫ్‌సిలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ మాక్ డ్రిల్‌లో పోలీసులతో పాటు అగ్ని మాపక సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, రక్షణ శాఖ అధికారులు ఆయా ప్రాంతాలకు చేరుకుంటారు. సంక్షోభ సమయంలో ఎలా మసలు కోవాలనే దా ని గురించి అధికారులు ప్రజలకు వివరిస్తారు. ఈ మాక్ డ్రిల్‌లో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసులు కూడా పాల్గొంటాయి. ఇందులో మొదట ఎయిర్ డ్రిల్ నిర్వహి స్తారు. ఇందులో భాగంగా నగర వ్యాప్తంగా నాలుగు గంటలకు సైరన్లు మోగిస్తారు. ఈ సైరన్లు విమానాల ద్వారా, భూతలం ద్వారా మోగిస్తారు. అన్ని ముఖ్య కూడళ్లలో రెండు నిమిషాల పాటు సైరన్‌లు మోగుతాయి. సైరన్‌లు మోగగానే అందరు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి. భవనాలలో వున్న వారు ఎలక్ట్రికల్ పరికరాలు, విద్యుత్ దీపాలు, గ్యాస్ స్టవ్‌లు ఆపివేయాల్సి వుంటుంది. సాయంత్రం నాలుగున్నర గంటలకు తిరిగి సైరన్లు మోగగానే అందరు తిరిగి యధావిధి గా తమ రోజువారి కార్యకలాపాలను కొనసాగించవచ్చు. జంట నగరాలలో ఇంతకు ముందు అగ్నిమాపక శాఖ, పోలీసు విభాగం మాక్ డ్రిల్ నిర్వహించినా రక్ష ణ శాఖ కూడా పాల్గొం టున్న మొదటి మాక్ డ్రిల్ ఇదే. ఈ మాక్ డ్రిల్‌లో ప్రజలు నేరుగా పాల్గొనడం, అధికారుల సూచనలను పాటించడం గమనార్హం.

### లండన్‌లో జారి పడ్డ సుజనా చౌదరి

# బేగంపేట ఆసుపత్రిలో సర్జరీ



**హైదరాబాద్(బేగంపేట), మే6,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మాజీ ఎంపీ, బీజేపీ ఎమ్మెల్యే వై. సుజనాచౌదరి లండన్‌లో జారి కింద పడిపోవడంతో కుడిచేయి షోల్డర్ హ్యూమరస్ ఫ్రాక్చర్ అయింది. దీంతో ఆయనను హుటాహుటిన నగరంలోని బేగం పేట కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ,ఛీఫ్ రొబోటిక్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డా.ఏ.వి.గురవారెడ్డి నేతృత్వంలోని నలుగురు సర్జన్ల బృందం నాలుగు గంటల పాటు శ్రమించి సర్జరీని విజయవంతం చేసినట్లు కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డా.ఎ.వి.గురవారెడ్డి తెలియజేసారు. సుజనా చౌదరి కుడిచేయి షోల్డర్ హ్యూమరస్ నాలుగు ముక్కలైందని,దాన్ని నాలుగు గంటల పాటు శ్రమించి స్క్రూలు,ప్లేట్లు అమర్చి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశా మన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన కోలుకుంటున్నారని, నెల నుంచి రెండు నెలల పాటు ఫిజి యోథెరపీ అవసరమని డా.గురవారెడ్డి తెలియజేసారు.

## కర్రెగుట్టపై ఎన్‌కౌంటర్: మహిళా నక్సలైట్ మృతి

**చర్ల, ప్రభాతవార్త :** ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కర్రె గుట్టలో గత 14రోజులుగా జరుగుతున్న డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా, ఎస్టీఎఫ్ భద్రతా బలగాలు మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతిచెందింది. ఘటన స్థలం నుంచి 303 రైఫిల్ ఆయుధాలు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జరిగిన ఘటనను బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ధృవీకరించారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని సరస్వతి పుష్కరాలకు ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే6:** ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానం అందించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కలిసి జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రికి ఆహ్వానం అందజేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రి కొండా సురేఖ ఆహ్వానం అందించారు. 15 నుంచి 26వ తేదీ వరకు 12 రోజుల పాటు జరిగే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్న ఏర్పాట్ల గురించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే6:** స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్విట్జర్లాండ్–తెలంగాణ మధ్య స్నేహపూర్వక భాగస్వామ్యం, పారిశ్రామిక సహకారం, పెట్టుబడి అవకాశాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి.

## హైదరాబాద్ పోలీసు విభాగానికి మరో ప్రతిష్టాత్మక అవార్డు

### హెచ్‌ఎన్‌ఈడబ్ల్యుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

### 15వ తేదీన దుబాయ్‌లో అందుకోనున్న కొత్వాల్ ఆనంద్

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరిసింది. ఇప్పటికే అనేక అవార్డులు అందుకున్న సిటీ పోలీసు విభాగం డ్రగ్స్ కట్టడికి ఏర్పాటు చేసిన హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్ మెంట్ వింగ్ (హెచ్‌ఎన్‌ఈడబ్ల్యు) అంతర్జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపి కయ్యింది. ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దుబాయ్‌లో జరగనున్న వరల్డ్ పోలీసు సమ్మిట్‌లో 138 దేశాల పోలీసు విభాగాలు పాల్గొననున్నాయి. ఇందులో చివరి రోజైన 15వ తేదీన జరిగే అవార్డుల ఫంక్షన్‌లో దుబాయ్ రాజు చేతుల మీదుగా సిటీ కొత్వాల్ ఆనంద్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకుం టారు. ప్రపంచ పోలీసు సమ్మిట్‌కు ముందు 138 దేశాలకు చెందిన పోలీసు విభాగాలు తమ తమ పనితీరు గురించి నివేదికలను ముందుగానే అందజేయగా ఇ ందులో హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం తరపున వున్న హెచ్‌ఎన్‌ఈడబ్ల్యు మొదటి స్థానం దక్కించుకుంది. భారత్ తరపున ఆయా రాష్ట్రాల పోలీసు విభాగా లతో పాటు కేంద్ర పోలీసు విభాగాలు తమ పనితీరుకు సంబంధించిన నివేదికలను పంపాయి. ఇందులో అమెరికా, బ్రిటన్, జర్మని సహా అనేక దేశాలకు చెందిన ప్రముఖ పోలీసు విభాగాలు వున్నాయి. అయితే తీవ్రమైన పోటీవున్న ఈ అవార్డుల ఎంపికలో హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటైన హెచ్ ఎన్‌ఈడబ్ల్యు అగ్రభాగాన నిలిచింది. దీనికి సంబంధించిన సమాచారం సిటీ పోలీసు విభాగానికి మంగళవారం అందింది. ఈ అవార్డును ఈ నెల 15వ తేదీన దుబాయ్‌లో ఆ దేశ రాజు సిటీ కొత్వాల్ ఆనంద్‌కు అందజేస్తారు. వాస్తవానికి హెచ్‌ఎన్‌ఈడబ్ల్యు విభాగం నాలుగేళ్ల క్రితమే దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకోవ డం తెలిసిందే. ఆనంద్ నాలుగేళ్ల క్రితం సిటీ కొత్వాల్‌గా పనిచేసిన సమయంలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం ఏర్పాటయ్యాక జంట నగరాలలో బడా డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టడంతో పాటు గోవాలో డ్రగ్స్ డాన్‌ల డెన్‌లను కుప్ప కూల్చారు. జంట నగరాలకు మత్తు పదార్థాలను సరఫరా చేసే అంతర్జాతీ య స్మగ్లర్లు దొరికిపోయారు. ఈ క్రమంలోనే హెచ్‌ఎన్‌ఈడబ్ల్యుకు తాజాగా అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది.

## 9న జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం

### ప్రెస్‌అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 6, ప్రభాత వార్త :** వర్కింగ్ జర్నలిసుల సంక్షేమ నిధి నుండి చనిపోయిన జర్నలిసు కుటుంబాలకు,అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పని చేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిసులకు ఆర్థిక సహాయాన్ని మే 9 వ తేదీన మీడియా అకాడమీ ఆడిటోరియంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను అందచేస్తారని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేశారు.ఇటీవల కాటీవల మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదు సంవత్సరాల వరకు ప్రతి కుటుంబానికి నెలకు రూ 3000 రూలను పెన్షన్‌గా, అదేవిధంగా ఎల్‌కేజి నుండి పదవ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ.2.000 ట్యూషన్ ఫీజును జర్నలిసుల సంక్షేమ నిధి నుండి మంజూరు చేసినట్లు ఆకాడమీ ఛైర్మన్ వెల్లడించారు. ఇతర వ్యాధులకు గురైన వారికి 1 లక్ష రూపాయల చొప్పున మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

# సరిహద్దుల్లో నేడు యుద్ధ విన్యాసాలు



**న్యూఢిల్లీ, మే 6:** కాశ్మీర్‌లో జరిగిన పహల్గాం తీవ్రవాద దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ సర్వసన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా తమ పౌరుల్ని యుద్ధం వస్తే ఎలా స్పందించాలన్న దానిపై రేపు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. అదే సమయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం రేపు పాకిస్తాన్ సరిహద్దుల్లో యుద్ధ విమానాలు భారీ ఎత్తున విన్యాసాలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. రేపు పాకిస్తాన్‌కు సమీపంలోని రాజస్థాన్ సరిహద్దుల్లో భారత వాయుసేన విమానాలు సైనిక విన్యాసాలు చేపట్టబోతున్నాయి. రేపు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సైనిక విన్యాసాలు ఐదున్నర గంటల పాటు భారీ ఎత్తున సాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రేపు సరిహద్దులకు సమీపంలోని ఎయిర్ పోర్టులకు విమానాల రాకపోకల్ని కూడా నిలిపివేస్తున్నారు. అలాగే ఎయిర్ మెన్లకు కూడా రేపు విన్యాసాలకు హాజరు కావాలని ఆదేశాలు వెళ్లాయి. ఇవాళ ప్రధాని నరేంద్ర మోడీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశమయ్యారు. గత 48 గంటల్లో వీరిద్దరు భేటీ కావడం ఇది రెండోసారి. ఇవాళ జరిగిన భేటీ తర్వాత పాకిస్తాన్ పై యుద్ధ సన్నాహాల్ని భారత్ ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇలా వాయుసేన యుద్ధ విమానాలతో విన్యాసాలు నిర్వహించేందుకు సిద్ధమైంది. అదే సమయంలో రేపు దేశవ్యాప్తంగా దాదాపు 300 ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించేందుకు బలగాలు సిద్ధమయ్యాయి. పాకిస్తాన్ పై భారత్ సైనిక దాడి తప్పదన్న అంచనాలు దీంతో మరింత బలపడుతున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్ కు చెందిన పలువురు రాజకీయ నేతలు, అధికారులు తమకు భారత్ దాడి చేస్తుందన్న పక్కా నిఘా సమాచారం ఉందని చెప్తున్నారు. అలాగే భారత్ వైపు నుంచి దాడి జరిగితే ఏం చేయాలన్న దానిపై పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి పౌరుల వరకూ అందరూ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. భారత వైమానికదళం రాజస్థాన్‌లోని పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహిస్తుందని ఎయిర్ మెన్‌కు నోటీసులు జారీచేసినట్లు తేలింది. ఈ కసరత్తులు బుధవారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభం అయి సుమారు ఐదున్నర గంటల పాటు కొనసాగుతాయి. ఈనేపథ్యంలోనే సరిహ ద్దుకు దగ్గరగా ఉన్న విమానాశ్రయంలో విమా నాల రాకపోకలు నిలిపివేస్తున్నారు. గతనెలలో కూడా అంటే ఏప్రిల్ 25న భారత్ తన ఫ్రంట్‌లైన్ ఫైటర్‌జెట్‌లు, ఎలైట్ పైలట్‌లతోపెద్ద ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. నేవీ తన పోరాట సంసిద్ధతను ప్రదర్శించింది. భారత వైమానిక దళం అధునాతన రాఫెల్‌జెట్‌లు అగ్రశ్రేణి పైలట్‌లను ఈ విన్యాసాలకు నియమించింది. ఇందుకు ఆక్రమన్ అని సముచితపేరును పెట్టారు. పైలట్లు పర్వతప్రాంతాలతోపాటు ఇతర భూభాగాల్లో అధిక తీవ్రత గల గ్రౌండ్‌స్ట్రైక్ సిమ్యులేషన్లను నిర్వహించారు.

## పునరుత్పాదక ఇంధన బలోపేతానికి సహాయం చేయండి

### కేంద్ర మంత్రితో డిప్యూటీ సీఎం విక్రమార్క భేటీ

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** తెలంగాణలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు గాను పటిష్ట కార్యాచరణను అమలుచేస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో భేటీ అయిన ఆయన వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే అత్యంత వేగంగా పురోగమిస్తూ, అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న తెలంగాణకు తగు రీతిలో కేంద్రం సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పిఎం కుసుం కంపోనెంట్ ఎ కింద 500 కిలోవాట్ల నుండి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4 వేల మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను రాష్ట్రానికి కేటాయించాలని సూచించారు. ఎంఎన్‌ఆర్‌ఈ ఈఓఐ కేటాయింపులను 4 వేల నుండి వెయ్యి మెగా వాట్లకు తగ్గించనున్నట్లు తెలుస్తోందని, ఇందువల్ల తాము నిర్ధారించుకున్న లక్ష్యాలపై ప్రభావం చూపనుందని ఆందోళన వ్యక్తం చేశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రం సాధిస్తున్న ఫలితాలను దృష్టిలో వుంచుకుని కేటాయింపులు చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని వ్యవసాయరంగానికి సాగునీటికి శాశ్వత పరిష్కారంగా సౌర పంప్‌సెట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో పిఎం కుసుం కంపోనెంట్ బి కింద లక్ష సౌర పంపు సెట్లను కేటాయించాలని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్‌ను కేంద్రానికి సమర్పించామన్నారు. ఇందుకు రాష్ట్ర వాటా నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా గిరిజనుల సాగు భూముల్లో విద్యుత్ లైన్ల స్థాపనకు అటవీ చట్టాలు ఆటంకంగా వున్నందున ఈ దిశగా కేంద్రం సహృదయంతో సహకరించాలన్నారు. ఇక పిఎం కుసుం కంపోనెంట్ సి కింద తెలంగాణకు 2 లక్షల పంపు సెట్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ సాగునీటి అవసరాల కోసం లక్షల పంపు సెట్లు వినియోగంలో వున్నందున సాంప్రదాయ విద్యుత్‌పై భారాన్ని తగ్గించేందుకు వీటి అవసరం ఉందని చెప్పారు. దేశంలోనే తెలంగాణ అత్యుత్తమ వార్షిక పురోగతి రేటును సాధించడంతో పాటు, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించిందన్నారు. రైతు భరోసా వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తూ, వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిబద్ధతతో పనిచేస్తున్న రాష్ట్రానికి కేంద్ర సహకారం అందితే మరిన్ని అద్భుతాలు చేసేందుకు వీలవుతుందని కేంద్ర మంత్రికి విక్రమార్క తెలిపారు.

## కల్తీ కల్లు, డ్రగ్స్ కట్టడికి టి.నాబ్ చైతన్య కార్యక్రమాలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ కల్లు నిర్మూలనకు, డ్రగ్స్ కట్టడికి తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) వినూత్నంగా ప్రచారం చేబట్టింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన కల్తీ కల్లు మరణాల నేపథ్యంలో టి.నాబ్ మంగళవారం విస్తృత సమావేశం నిర్వహించింది. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్‌లో గల టి.నాబ్ కార్యాలయ ంలో జరిగిన ఈ సమావేశానికి డైరక్టర్ సందీప్ శాండిల్యా అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల యాంటి నార్కోటిక్ విభాగాల సిబ్బంది పాల్గొన్న ఈ సమావేశంలో సందీప్ శాండిల్యా మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడితో పాటు కల్తీ కల్లును పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం వుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాలని, ఆయా ప్రాంతాలలో యువతకు దీని గురించి తెలియపరచాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాం తాల లో ప్రజలు ఈ మహమ్మారి బారిన పడకుండా చూడాలని ఆయన కోరారు. దీనికి సంబంధించి టి.నాబ్ రూపొందించిన కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. డ్రగ్స్ కట్టడికి, కల్తీ కల్లు నిర్మూలను ప్రజలు తమ వంతుగా సహాయం అందించాలని, పోలీసులకు సమాచారం చెప్పాలని ఆయన కోరారు.



కల్తీ కల్లు నిర్మూలనకు, డ్రగ్స్ కట్టడికి టి.నాబ్ రూపొందించిన చైతన్య కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన డైరక్టర్ సందీప్ శాండిల్యా

## పరువు పోయిందని పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య

### పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త :** రెండు రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా పెళ్లి కూతురు ప్రియుడితో వెళ్లి పోవడంతో తమ పరువు పోయిందని మదన పడిన పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కాంజి గోవిందరావు కుమారుడు అభిషేక్‌కు జ్యాని విజయ్ కుమార్ కూతురు శ్వేతతో పెళ్ళి నిశ్చయం అయింది. 4 నెలల క్రితం అంగరంగ వైభవంగా ఎంగేజ్ మెంట్ కార్యక్రమం జరిపారు. ఈ నెల 9న పెళ్లి ముహూర్తం నిశ్చయించి పెళ్లి పత్రికలు ముద్రించి బంధు మిత్రులకు పంచిపెట్టి పెళ్లికి ఆహ్వానించారు. అంతేకాకుండా పెళ్లి ఏర్పాట్లు లక్షలు ఖర్చు చేసి పూర్తి చేశారు. అయితే మంగళవారం పెళ్లి కుమారుడిని చేయాల్సి ఉండగా ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పెళ్లి కూతురు ప్రియుడు వెంకటేష్‌తో వెళ్లి పోయింది. దాంతో తన కొడుకు పెళ్లి ఆగిపోవడంతో పాటు తమ పరువు పోయిందని మదనపడి పెళ్లి కొడుకు తండ్రి కాంజీ గోవిందరావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే పెళ్లి కూతురు ఇంట్లో కూతురి ప్రేమ వ్యవహారం తెలిసిన కప్పిపుచ్చి పెళ్లికి సిద్ధమై పరువు తీశారని దాంతో గోవిందరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా పెళ్లి కూతురిని మామ వరుసకు చెందిన షోలాపూర్ కిషోర్,సంజీవ్ మరికొందరు ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో కేంచి గోపాల్ ఇంటి దగ్గరకు ప్రేమికులు ఇద్దరినీ కారులో ఎక్కించి పంపారని సిసి పుటేజీలను సైతం పోలీసులకు అప్పగించామని తెలిపారు. తన తమ్ముడు చావుకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని మృతుని సోదరుడు కాశ్మి నారాయణ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కాంజి గోవిందరావు (ఫైల్)

# తెలంగాణలో భిన్న వాతావరణం

### ఓ వైపు ఎండలు.. మరో వైపు వర్షాలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** తెలంగాణలో గత రెండు మూడు రోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో ఉదయం నుంచి ఎండలు దంచికొడుతుంటే, సాయంత్రం అవ్వగానే చిరుజల్లులతో వాతావరణం చల్లగా మారిపోతుంది. ఒవైపు ఎండల వేడి ఉక్కపోతలలో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతుంటే, మరోవైపు వడగండ్లతో కూడి వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. అయితే గడచిన 24 గంటల్లో నిజామాబాద్, మహబూబ్ నగర్, మెదక్, ఆదిలాబాద్, ఖమ్మంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్ అత్యధికంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మెదక్ లో 40.9 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 40.3 డిగ్రీలు, ఖమ్మంలో 40 డిగ్రీలు, నల్లగొండలో 39 డిగ్రీలు, హనుమకొండలో 35.5 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35.2 డిగ్రీలు, భద్రాచలంలో 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే నిజామాబాద్‌లో 42.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు, భద్రాచలంలో 37.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ వాఖ వెల్లడించింది. అయితే హైదరాబాద్ సహా కొన్న జిల్లాల్లో వాతావరణం ఉన్నట్టుండి ఒక్కసారిగా మారిపోతోంది. ఉదయం నుంచి మూడు పగలే రేలితో ఎండలు దంచి కొట్టగా, సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. మరో రోజు ఇలాంటి పరిస్థితులే నెలకొనే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది. కాగా తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ లోని 7 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగతా 10 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భూపాలపల్లి, ములుగు, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలో రాగల మూడు రోజులల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుండి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

# తెలంగాణ దివాళా తీసిన రాష్ట్రమా?

### హామీలను నెరవేర్చలేమని సిఎం ఎలా చెప్తారు?:ఎంపి ఈటల రాజేందర్



**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎన్నో ప్రగల్భాలు పలికి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు నెరవేర్చలేమని చేతులు ఎత్తేసిందని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చులేమని చెప్పి సిఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాకపోతే ముక్కు నేలకు రాసి తప్పుకోవాలని అన్నారు. చేతనైన వారు వస్తారు చేస్తారు. లేదంటే అలానే కొనసాగుతా అంటే సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కర్రకాల్చి వాత పెడతారన్నారు. నిన్ను గెలిపించిన ఖర్మానికి అప్పటి వరకు భరిస్తారన్నారు. నీ మాటలవల్ల తెలంగాణ సమాజం తలదించుకుంటుందని అన్నారు. దేశంలో మన పరువుపోయిందన్నారు. తెలంగాణ ప్రజలు, ఉద్యోగులు భయపడేవారు కాదు. ప్రేమకు లొంగుతారు బెది రింపులకు కాదు. మాయచేసుడు మత్తరిం చుడు తెలంగాణ ప్రజల రక్తంలో ఉండదు బిడ్డా ఎస్మా ప్రయో గించిన వారి గతమేయ్యిందో తెలుసుకదా అన్నారు. దసరా పండుగే వద్దు తెలంగాణ కావాలని కొట్లాడిన గొప్పవారు ఆర్‌టిసి కార్మికులు అన్నారు. 2014లో 30 వేల కోట్ల ఓన్ టాక్స్ రెవెన్యూ ఉన్న రాష్ట్రం 11 ఏళ్లలో లక్ష 30 వేల కోట్ల ఆదాయంకు చేరుకుంది అంటే ఇది దివాలా రాష్ట్రమా? లక్షకోట్ల బడ్జెట్ మూడు లక్షల కోట్లకు పెరగడం దివాలానా? నిన్ను సిఎం చేసిన ఖర్మానికి నువ్వు ధ్వంసం చేస్తున్నది తెలంగాణ సమాజాన్ని, తెలంగాణ రాష్ట్ర గొప్పతనాన్ని అన్నారు.



# మానవాభివృద్ధి సూచిలో మెరుగుపడిన భారత్

### సగటు జీవితకాలం 72యేళ్లకు పెరుగుదల

**న్యూఢిల్లీ, మే 6:** ప్రపంచ 'మానవాభివృద్ధి సూచీ హెచ్‌డిఐలో భారత్ పురోగతి సాధించింది. 2023 ఏడాదికి సంబంధించి మొత్తం 193 దేశాల్లో భారత్‌కు 130వ స్థానం దక్కింది. అంతకుముందు ఏడాది అంటే 2022తో పోల్చుకుంటే మూడు స్థానాలు మెరుగుపడింది. 2022 ఏడాదికి సంబంధించిన మానవాభివృద్ధి సూచీలో భారత్ 133వ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఏడాది మూడు స్థానాలు పురోగతి చెందింది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం కి సంబంధించిన మానవాభివృద్ధి సూచీ2025 నివేదిక మంగళవారం విడుదలైంది. ఈ నివేదికలో 2023 ఏడాదికి సంబంధించిన డేటాను ప్రకటించారు. అదేవిధంగా లింగ అసమానత సూచీలో కూడా భారత్ వృద్ధిని నమోదు చేసింది. 2023లో మొత్తం 193 దేశాల్లో భారత్ 102వ స్థానంలో నిలిచింది. అంతకుముందు ఏడాది అంటే 2022లో 166 దేశాల్లో భారత్ 108వ స్థానం దక్కించుకుంది. అంటే ఈ ఏడాది ఆరు స్థానాలు మెరుగుపడింది.హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ - 2025 ప్రకారం భారతీయుల జీవిత కాలం కూడా మెరుగుపడింది. 2023లో భారత పౌరుడి సగటు జీవితకాలం 72 ఏళ్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది అంటే 2022లో భారత పౌరుడి సగటు జీవితకాలం 71.7 ఏళ్లుగా ఉంది. ఇప్పటికే వరకు ఇచ్చిన నివేదికల్లో ఇదే అత్యధిక సగటు జీవితకాలమని యూఎన్‌డీపీ తెలిపింది. 1990లో భారత పౌరుడి సగటు జీవితకాలం అతితక్కువగా 58.6 ఏళ్లు ఉందని వెల్లడించింది.

## అక్రమార్కులకు శిక్షపడితేనే మిగతా వారికి భయం: లక్ష్మీనారాయణ

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి హయాంలో సంచలనం రేపిన ఓబుళాపురం గనుల వ్యవహారంలో నాంపల్లి సిబిఐ కోర్టు వెల్లడించిన తీర్పుపై నాటి సిబిఐ జాయింట్ డైరక్టర్ లక్ష్మీ నారాయణ స్పందించారు. మం గళవారం ఆయన తనను కలిసిన మీడియాతో మా ట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వారికి శిక్షలు పడితేనే మిగతా వారికి భయం వుంటుందని తెలిపారు. ఈ తరహా ఘటనల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అప్పట్లో ఓబుళాపురం గనుల వ్యవహారంలో తనకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. మైనింగ్ లీజు ఇవ్వడానికి అనేక పద్దతులు వుంటాయని, అయితే ఈ కేసు లో మొదటి నుంచి పక్షపాతంగా వుందని తన విచారణలో తేలిందని ఆయన తెలిపారు. ఈ కేసులో అక్రమాలను నిరూపించేందుకు తాము శ్యాటిలైట్ చిత్రాలను సేకరించామని, ఎన్‌ఆర్‌ఎస్‌సి, సింగరేణి సంస్థల సహాయం తీసుకున్నామని లక్ష్మీ నారాయణ తెలిపారు. అక్రమాలను నిరూపించేందుకు చాలా ఇబ్బందులు పడ్డామని, ఆధారాలు సంపాదించేందుకు అనేక ఇక్కట్లకు గురయ్యామని ఆయన తె లిపారు. గాలి జనార్ధన్ రెడ్డి అరెస్టు విషయంలో అంతా రహస్యంగా వ్యవహరించామని, చివరకు ఐటి అధికారుల వేషంలో వెళ్లి అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

**ఓఎంసి కేసును కేస్ స్టడీగా చూడవచ్చు:** కాగా త కేసు విచారణ త్వరలో ఈడీ దర్యాప్తు చేసే వీలుందని ఆయన తెలిపారు. సిబిఐ కోర్టు తీర్పుపై కొందరు హైకోర్టుకు వెళ్లవచ్చని, ఇలాంటి కేసుల్లో ప్రత్యేక కోర్టులుండాల్సి న అవస రం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. విచారణ సుధీర్ఘంగా సాగితే అనేక మార్పులు వస్తాయి, ఇలాంటి సందర్భాలలో సాక్షులు మాటమార్చవచ్చని, చట్టాన్ని ఉపయోగించి జాప్యం చేసే వీలుందని ఆయన తెలిపారు. ఓఎంసి కేసును ఆర్థిక నేరాల విషయంలో కేస్ స్టడీగా చూడవచ్చని ఆయన తెలిపారు. ఈ తరహా కేసుల విచారణలో విచారణాధికారులు వేరే చోట వుండడం వల్ల వారు కోర్టులకు హాజరవడం ఇబ్బందులతో కూడుకున్నదని, త్వరగా పూర్తయితే న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.

**నేను ముమ్మాటికి నిర్దోషినే: సబితా ఇంద్రా రెడ్డి వెల్లడి**

కాగా ఓబుళాపురం కేసులో తనను నిర్దోషిగా తీర్పు చెప్పడంపై మాజీ మంత్రి మహేశ్వరం ఎంఎల్ఏ సబితా ఇంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసులో తన తప్పు లేదని ఆనాటి నుంచి చెబుతూనే వున్నానని, అయితే సిబిఐ అధికారులు తన వాదనలు వినకుం డా ఏకపక్షంగా వ్యవహరించారని ఆమె తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడు తూ న్యాయ వ్యవస్థపై తనకు సంపూర్ణంగా నమ్మకం వుందని, ఇంతకాలం తరువాత తనకు ఓబుళాపురం గనుల కే సులో విముక్తి లభించిందని తెలిపారు.

## మిస్‌వరల్డ్ పోటీలతో ప్రపంచం దృష్టి తెలంగాణ వైపే

### పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మే 6 ప్రభాత వార్త :** హైదరబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచంలోని అన్ని దేశాల దృష్టి తెలంగాణ మీద పడుతుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం హైటెక్ సిటిలోని మెరిడియట్ హోటల్లో జరిగిన మీడియా ప్రతినిధులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మిస్‌వర్ల్డ్ పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు దేశంలోని అనేక రాష్ట్రాలు పోటీ పడ్డాయని సీఎం రేవంత్ రెడ్డి చొరవతో వీటిని ఇక్కడ నిర్వహించేంకు నిర్వహకులు అంగీకరించినట్లు తెలిపారు. బుధవారం నుంచి మే 31వ తేదీ వరకు ఈ ప్రతిష్ఠాత్మకమైన అందాల పోటీలు జరగుతాయని, ఈ ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 140 దేశాలకు చెందిన సుందరీమణులు తరలివస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే ఈ పోటీల్లో పాల్గొనే కంటెస్టులు నగరానికి చేరుకున్నట్లు తెలిపారు.అంతకు ముందు తెలంగాణ సంప్రదాయానికి సంబంధించి ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో టూరిజండవల్‌మెంట్ కార్పొరేషన్ ఎండి పటేల్ రెడ్డి, పర్యటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మాజీ మిస్ వరల్డ్ నందిని గుప్తా , మిస్ వరల్డ్ లిమిటెడ్ సిఈవో జూలే మోర్లే,ప్రముఖ నటుడు సోనూసూద్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం కార్యాలయం, తెల్లాపూర్, సంగారెడ్డి జిల్లా
నోటీసు నెం.ఇ1/4/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ & కొటేషన్ నోటీస్ తేది: 05.05.2025
1) తెల్లాపూర్ మునిసిపాలిటీ, సంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ సం.ఇ1/04/2025-26, తేది: 05.05.2025, రూ.20.85 Cr (19) పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ కింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్‌దారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 14.05.2025, మ.3.30 గం. వరకు. 2) తెల్లాపూర్ మునిసిపాలిటీ, సంగారెడ్డి జిల్లా కొటేషన్ నోటీస్ సం.ఇ1/4/2025-26, తేది: 05.05.2025, ద్వారా తెల్లాపూర్ పురపాలక సంఘంలోని మునిసిపల్ ఆఫీసులోని 250 ఫీట్ పోల్ మరియు అంతకన్నా ఎక్కువ ఎత్తు పోల్ ఫ్లాగ్‌పోల్ మెయింటెనెన్స్ చేయుట కొరకు కొటేషన్ కోరబడుతున్నవి. కొటేషన్ స్వీకరణకు చివరి తేది: 08.05.2025, మ.3.30 గం.వరకు. అదే విధముగా పూర్తి వివరములకు కమిషనర్ తెల్లాపూర్ 9440019940ను సంప్రదించగలరు.
సం/- మునిసిపల్ కమిషనర్, తెల్లాపూర్ మునిసిపాలిటీ
DIPR.No.1398-PP/CL/Advt/1/2025-26, తేది: 06.05.2025



తెలంగాణ ప్రభుత్వం
నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్
(రాష్ట్ర చట్టం క్రింద స్థాపితమైన విశ్వవిద్యాలయం)
NIMS యొక్క టెండర్‌ల సెక్షన్ ఎలక్ట్రికల్, సర్జికల్ స్టోర్స్ మరియు ప్లానింగ్ కొరకు NIMS వెబ్‌సైట్ (www.nims.edu.in) మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం (www.eprocurement.telangana.gov.in) పై బిడ్స్ కోరుతోంది.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
Rc.No.Plng II/20/2024/TCU/న్యూస్ పేపర్స్ తేది: .5.2025
NIMS వద్ద క్రింది టెండర్ ప్రకటనలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (www.eprocurement.telangana.gov.in) మరియు నిమ్స్ వెబ్‌సైట్ (www.nims.edu.in) ద్వారా బిడ్స్ కోరబడుతున్నవి. (క్ర.సం. 1, రీఏజెంట్ అద్దె ప్రాతిపదికన HbA1C ఎనలైజర్ మరియు కో-అగ్యులేషన్ ఎనలైజర్ యొక్క సేకరణ. 2) CSSDకు కొత్త ఎక్విప్‌మెంట్ సేకరణ. వెబ్‌సైట్ రెండింటికీ ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://tender.telangana.gov.in. 3) (ప్లాస్టిక్ మరియు ఐరన్) కలిపి లెడ్ యొక్క విక్రయం కొరకు రీటెండర్. 4) NIMS వద్ద హరితహారం దగ్గర పడివున్న స్క్రాప్ యొక్క ఎత్తివేత కొరకు రీటెండర్: వెబ్‌సైట్ రెండింటికీ www.nims.edu.in. బిడ్డర్లు పూర్తి టెండర్ ప్రకటనలు, సవరింపులు, సవరణలు, ప్రీ-క్వాలిఫికేషన్ ప్రమాణం, గడువు తేదీలు, రెగ్యులర్ అప్‌డేట్స్ మరియు పాల్గొనటానికి పై వెబ్‌సైట్‌ను వీక్షించవలసినదిగా కోరడమైనది.
DIPR.No.1417-PP/CL/Advt/1/2025-26, తేది: 06.05.2025 సం/- ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్

వార్త

మానవుడి కష్టాలన్నింటికి కారణం అతని అజ్ఞానం, క్రమశిక్షణారాహిత్యం.

-కౌటిల్యుడు

# ప్రకృతి కన్నెర్ర!


ఏటా వర్షాకాలంలోనూ అడపా దడపా విన వచ్చే పిడుగులు, మెరుపుల శబ్దాలు, ఇప్పుడు తరచూ వినవస్తున్నాయి. వడగళ్ల వాన పరిస్థితీ అంతే. గతంలో కొన్ని ప్రాంతాల్లో కొన్నిసార్లే వడగళ్లు పడతాయని ప్రతీతి. ఇప్పుడలా కాదు. రోజూ ఎక్కడో అక్కడ వడగళ్ళు పడ్డాయని, భారీ వడగళ్లవానలు కురుస్తున్నాయనీ, వింటున్నాం. ముందు వడగళ్ల వానలు, వెను వెంబడి తీక్షణ ఉష్ణోగ్రతలు. మళ్ళీ వానలు ...ఇలా వరుసబెట్టి ఎడా పెడా ప్రకృతి కన్నెర్ర చేస్తూ రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ విధంగానూ ఉపశమనం దక్కే పరిస్థితి లేక ఆవేదనతో రైతాంగం కుమిలిపోతున్నారు. అకాల వర్ష బీభత్సాలు రైతన్నకు అపార నష్టాలు తెచ్చి పెడుతున్నాయి. వాన రాకడ, పోకడ ఎవరికీ తెలియదు. కానీ వాతావరణ శాఖ తనకున్న సాంకేతిక నైపుణ్యంతో వానలు, ఎండలు వంటి అంశాలపై ఎన్నో ముందస్తు జాగ్రత్తలు అందిస్తోంది. ఆ మేరకు రైతన్న ఎంతో కొంత మేలు పొందుతూనే ఉన్నా పరిస్థితులు కలిసిరావడం లేదు. వర్షాలు అధికమని తెలిసినా పనల మీద ఉన్న పంటను ఇంటికి తెచ్చుకోవడానికి సాధ్యంకావడం లేదు. మొన్నటి వరకు ఎండకు ఎండిన ధాన్యం ఇప్పుడు వర్షానికి తడుస్తోంది. అలా తడిసిన ధాన్యం కొనుగోలుకు వెళ్తే ఐదు కిలోల తరుగు రాస్తున్నారనీ రైతాంగ ఆవేదన. చేతికి అంది వచ్చిన కూడు నోటికి అందని పరిస్థితులున్నాయి. ఇలా రైతాంగాన్ని ప్రకృతి పరీక్షిస్తోంది. గాలి వాన బీభత్సానికి చేతికందిన పంట నీటిపాల వుతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కలిపి లక్షఎకరాల కన్నా పైనే పంటలు నష్టపోయాయి. ఈదురు గాలులు, వడగండ్లతో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో పంటలే కాకుండావాణిజ్య పంటలు మామిడి, బొప్పాయి, అరటి తోటలకు ఎక్కువగా నష్టం జరిగింది. తెలంగాణాలో పిడుగులు కారణంగా గొర్రెలు చనిపోయాయి. పిడుగుపాటుకు దాదాపు 15 మంది చనిపోయారు. ఎండలు, అకాల వర్షాల దాగుడు మూతలు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. మొదటి విడత వానలకు పొలాల్లో ఉన్న పంట నష్టమైతే ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కల్లాలు, మార్కెట్ యార్డుల్లో ధాన్యం నీటగలిసి పోతున్నది. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటమే అందుకు కారణం. రక రకాల కొర్రీలతో కొనుగోళ్ల జాప్యం అవుతుండటంతో ధాన్యం వర్షార్పణం అవుతోంది. తీరా మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆకస్మికంగా వర్షం వస్తె ఆరుబయట ధాన్యం బస్తాల మీద కప్పుకునేందుకు టార్పాలిన్‌లు కానీ ధాన్యం ఎత్తుకునే గొనె సంచులు కానీ అందుబాటులో లేవని రైతులు గగ్గోలు పెట్టినా తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు వాటిని సమకూర్చలేదు. దీంతో రైతులు నిస్సహాయంగా చూస్తుండాల్సిన పరిస్థితి. ప్రకృతి ప్రకోపానికి రైతు బలికాకుండా వారి అవసరాలను తీర్చాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలి. తాజాగా దేశంలోని 26 రాష్ట్రాల్లో భారీ వర్షాలు, పిడుగులు, వడగళ్లుపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. మే 8 వరకు ఈ భారీ వర్షాల మోతే. ఇప్పటికే పశ్చిమ రాజస్థాన్లోని కొన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్, తూర్పు రాజస్థాన్‌కు యెల్లో అలర్ట్ జారీ చేసింది. ఇలా దేశంలో దాదాపు అన్ని ప్రాంతాలకూ వర్ష సూచనలున్నాయి. ఒకప్పటిలాగా కాక వాతావరణ శాఖ పసికట్టిన సమయానికి వర్షాలు కురుస్తుండటం విశేషం. ఏయే రాష్ట్రాల్లో ఎలాంటి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయో ముందస్తు హెచ్చరికలు కూడా చేసింది. రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక, కేరళ మహారాష్ట్రలలో భారీ వర్షం, ఈదురు గాలులు, వడగళ్ల వానలకు అవకాశం ఉంది. మహారాష్ట్ర, గుజరాత్, ఈశాన్య రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు, మరోవైపు ఒడిశాలో భారీ వర్షాలు, వడగళ్లు పడే అవకాశం. ఉరుములు, మెరుపులతో పాటు గాలులు వీచే అవకాశం. బెంగాల్, బిహార్ నుంచి అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన వర్షం. ఇలా ప్రకృతి ఎన్ని విధాలుగా కన్నెర్ర చేయగలదో అన్ని విధాలుగా మనతో ఆడుకుంటోందని, కొన్ని ప్రాంతాల్లో హిమపాతం కూడా సంభవించే ప్రమాదం ఉందని తెలిపింది. ఈ క్రమంలోనే అలాంటి ప్రాంతాల పర్యాటకాన్ని వాయిదా వేసుకోవాలి. కొన్ని కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడడం, వరదలు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున బహిరంగప్రదేశాల్లో తిరగకూడదు. గాలులు, వడగళ్ల నుంచి తప్పించుకోవడానికి ఇంట్లోనే ఉండాలి. రైతులు సైతం పంట రక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చింది. ఎన్డీఆర్ఎఫ్ఎ పాటు వివత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండి ఆదేశించింది. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, తెలంగాణ, కోస్తాంధ్రకు కూడా మళ్లీమళ్లీ వర్ష ప్రభావ హెచ్చరిక. ఇంత స్పష్టంగా వాతావరణ విశ్లేషణలున్నా రైతాంగానికి మేలు చేకూరలేని, చేకూర్చలేని పరిస్థితులు కనపడుతున్నాయి. మరో ప్రకృతి బీభత్సం ప్రకంపనలు కూడా ఈప్రాంతాన్ని వదిలిపెట్టలేదు. ఉత్తర తెలంగాణలో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.8గా నమోదైంది. ఎక్కడా ప్రాణ, ఆస్తులు నష్టం కలిగించకపోవడం విశేషం. ప్రకృతిని ఎదురించలేం. ఏమీ చేయలేం. కాగా ఈదశలో రైతు పంట నష్టాలను నిజాయతీగా, స్పష్టమైన విధానాలతో గణించి అంచనా వేసి పరిహారాన్ని అందివ్వడమొక్కటే ప్రభుత్వాల మీదున్న బాధ్యత. విపత్తుల నిర్వహణలో రాష్ట్రాలన్నీ ముందస్తు ప్రణాళికతో అప్రమత్తమవ్వాల్సిన అవసరముంది.

చెడ్డవారి దురాగతాల కంటే మంచివారి మౌనమే అత్యంత విషాదకరం.



మార్టిన్ లూథర్ కింగ్

నీ తప్పును, నీ తెలివితక్కువ పనులను నీ ముందు నివేదించువాడే నిజమైన నీ స్నేహితుడు.



షేక్స్‌పియర్

# ప్రజావాక్కు



## ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు

రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను నాటడం జరిగింది. అన్ని రకాలమొక్కలు, పండ్ల మొక్కలు నాటి వాని రక్షణ గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ప్రస్తుతం అనేక గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు నీరు పోసేవారు లేకఎండిపోయి మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గతంలో గ్రామంలో వున్న యువత, వృద్దులు స్వచ్ఛమయిన గాలి కోసం పల్లె ప్రకృతి వనాలుకు వెళ్ళేవారు. అంతటఎండి కళా విహీనంగా మారాయి. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తేవాలని, ప్రతీ రోజూ వానికి నీరు పోసి ఏపుగా మొక్కలు ఎదిగేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్. సతీష్, వరంగల్ జిల్లా

## ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

ఇరవైమూడు మార్చి 2000సంవత్సరం రోజున ప్రారంభమైన కరోనావైరస్ కన్నముందు నడిచిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునఃప్రారంభించాలి. రైలు కొన్ని రోజులు నిలుపుదల చేసి తిరిగిప్రారంభించడం జరిగింది. కానీఎక్కువగా ప్యాసింజర్ రైళ్ల అప్పటిలాగా తిరిగి ప్రారంభించలేదు. కొన్ని ఎక్స్‌ప్రెస్‌రైలు కూడా ప్రతి రైల్వే స్టేషన్లలో వచ్చేటప్పుడు పోయేటప్పుడు తప్పనిసరిగా ఆగాలి. గతంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని రైళ్ల నడవకపోవడంతో పేద ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కరోనా వైరస్ కన్నా ముందు గతంలో ప్రతి రైల్వే స్టేషన్లలో ఆగిన ప్రతి రైలు ఇప్పుడు కూడా నడిచే విధంగా రైల్వే ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## ఎర్రకోట సరిపోతుందా!

ఎర్రకోటను తనకు అప్పగించాలని మొఘల్ చక్రవర్తుల వారసురాలు సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులోను, సుప్రీం కోర్టులోను పిటిషన్ వేసినట్టు, కోర్టులు కొట్టివేసినట్టు, ఎర్రకోట ఒక్కటే ఎందుకు? ఫతేపూర్ సిక్రీ, తాజ్‌మహల్ ను ఎందుకు కోరటం లేదని ప్రశ్నించినట్టు వార్తా పత్రికల ద్వారా తెలుస్తున్నది. మొఘల్ చక్రవర్తులు చేసిన దురాగతాల బాధ్యతను కూడా ఆమె వహిస్తుందేమో కనుక్కొని ఆమెకు ముందు తగిన శిక్షణు విధించాలి.

-రాచమడుగు శ్రీనివాసులు, అనంతపురం

## లిఫ్ట్ ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి

కాలానుగుణ పరిస్థితులకు తోడ్పాటుగా రోడ్డు రవాణా రద్దీని నివారించుటకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతోమెట్రో రైలు అందుబాటులోనికి తీసుకొని రాబడినది. దీనివలన కాలుష్య రహిత వేగవంతమైన మెరుగైన రవాణా సౌకర్యాలు కలుగుచున్నవి. హైదరాబాద్ మెట్రో రైల్వే జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్ నుండి జేబిఎస్ వెళ్లుటకు మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్న విధంగా సరాసరి వెళ్లుటకు లిఫ్టు ఎస్కలేటర్ సౌకర్యాలు కల్పించబడలేదు. ఫలితంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి జేబిఎస్‌ద్వారా మెట్రోరైలులో ప్రయాణించుటకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్‌స్టేషన్ నుండి మహారాష్ట్ర ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతేకాక పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో ఎస్కలేటర్ లిఫ్ట్ సౌకర్యాలు కల్పించబడలేదు. కావున ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ స్టేషన్ లో కూడా లిఫ్టు ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి.

- దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## అకాల వర్షాలతో అన్నదాత ఆగ మాగం

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో అన్న దాతలు ఆగం అవుతూ వున్నారు బహుళ సమస్యలతో సతమతం అవుతున్న రైతన్నలను చెడ గొట్టు వానలు నిండా ముంచుతూ వున్నాయి వారం రోజులనుండి వివిధజిల్లాలలో గాలివాన అలజడి చేస్తుంది ఈదురు గాలులు వడ గండ్ల తో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో పంటలేకాక తోటలకు నష్టం కలుగుతూవుంది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మామిడి, మునగ బొప్పాయి తోటలు నష్టం కలుగుతూ వుంది. పిడుగు పాటుకు జీవాలు మరణిస్తూ వున్నాయి. అకాల వర్షాలవల్ల నష్ట పోయిన వారిని ఆదుకోవాలి. సర్వేచేసి వారికి పంట నష్టం అందచేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## పెన్షన్ ఫండ్ చెల్లించాలి

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదులక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్‌ఫండ్‌కు జమచేస్తున్నారు. పదవి విరమణ తర్వాత వారి బేసిక్, మారేడు కరువు భత్యంపై ఇరవై శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు. పెన్షన్ ఫండ్‌కు వచ్చిన మొత్తం కంటే తక్కువ జమ కావడంతో చెల్లింపుల మధ్య ఆంతర్యం పెరుగుతుంది.

-ఎన్.నాగరాజు, నల్గొండజిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విలువల పెంపులో విఫలమవుతున్న విద్య

*సాధ్యమైనంతవరకు మొబైల్‌కు దూరంగా ఉంచి మంచి పుస్తకాలకు వారిని దగ్గర చేయాలి. పాఠ్యాంశాలు నిజ జీవితాన్ని ప్రతిబింబించాలి. వాస్తవికతకు దగ్గరలో ఉండాలి. నీతి నిజాయితీలకు, మానవ విలువలకు అద్దం పట్టాలి. భాషపట్ల గౌరవం సాహిత్యాభిలాషి పట్లఆసక్తి పెంపొందే పాఠ్యాంశాలు ఎంపిక చేయాలి. వీటన్నింటినీ పరీక్షలలో భాగం చేయాలి అంటే విద్యార్థి ఆడే ఆటలు పాల్గొనే సాంస్కృతికపరమైన కార్యక్రమాలు చదివే పుస్తకాలు (సిలబసితర) అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి కాబట్టి ఇవన్నీ అతడి ఉత్తీర్ణతలో లేదా ఫలితాల్లో కీలకపాత్ర పోషించాలి. లేదంటే విద్యార్థి ఉత్తీర్ణుడవుతాడు. విద్య అతడిని మనిషిగా తీర్చిదిద్దటంలో విఫలమవుతుంది. పుస్తక రచయితలు ఈ దిశగా ఆలోచించి మరింత ప్రభావవంతమైన పాఠ్యాంశాలు ఎంపికచేసి విద్యార్థుల వ్యక్తిత్వాన్నివిలువలను పెంపొందించే దిశలో ఆ పుస్తకాలు తయారు చేయాలి.*

**శ్రీ శ్రీ కుమార్**

పుట్టిన ప్రతి మానవజీవికి అవసరమైనది విద్య. మానవుడు జన్మించినది మొదలు ఏదో ఒకటి ప్రయత్న పూర్వకంగా లేదా అప్రయత్నంగా కానీ నేర్చుకుంటూనే ఉంటాడు. కొన్నింటిని పొరపాట్ల ద్వారా కూడా నేర్చుకుంటాడు అంటే అనుభవం ద్వారా నేర్చుకోవడం జరుగుతుంది. అనుకరణ ద్వారానే ఇతరులను చూడటం ద్వారానే కొన్ని కొత్త విషయాలు నేర్చుకుంటాడు. తల్లిదండ్రులు ప్రథమ గురువులు, వారి నుండి పిల్లవాడు నేర్చుకునేది జీవితంలో చాలాకాలం నిలిచి ఉంటుంది. ఉపయోగపడుతుంది, సమకాలీకుల నుండి నేర్చుకోవడం కూడా ప్రభావవంతమైనది. సమాజం నుండి అనుక్షణం కొన్ని విషయాలు తెలుసుకుంటూ జీవనం సాగిస్తాడు. పరిపూర్ణ మానవుడిగాపరిణమించే క్రమంలో పాఠశాల విద్య అతన్ని బాగా తీర్చిదిద్దుతుంది. అది సంస్కారాన్ని నేర్పుతుంది. పాఠశాల స్థాయిలో బోధించిన గురువులే విద్యార్థులకు క్రమశిక్షణ, నీతి నియమాలు, నడవడిక, ప్రవర్తన, కర్తవ్యబోధన, ఇంకా దేశభక్తి నేర్పుతారు. భాషా బోధకులకు ఈ బాధ్యత ఒకింత ఎక్కువ ఉంటుంది. ఈ లక్షణాలు పసి మనసులపై ముద్ర వేస్తాయి. ఆ స్థాయిలో బోధించే గురువులు కూడా ఉత్తమ గుణగణాలు, సమయపాలన, మంచి అలవాట్లతో విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. వారే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయడంలో కీలకమైన పాత్ర పోషిస్తారు. పాఠశాల స్థాయికి మించి అంటే కళాశాల స్థాయిలో చెప్పే గురువులు కేవలం కొద్ది మంది మాత్రమే విద్యార్థుల మనసులపై తమ దైనశైలితో విషయపరిజ్ఞానంతో ఆకట్టుకుని వారి జీవితాలకు ఒక గమ్యం చూపెట్టే వారుంటారు. విద్యార్థులు పెరుగుతున్న దశలో వారిలో చాలా గుణాత్మకమైన మార్పులు మనం చూడవచ్చు. పాఠశాల స్థాయిలో వారిలో ఉన్న మానసిక వికాసానికి కేవలం వారి గురువులను చూసి నేర్చుకున్నదే కాక వారికి నిర్దేశించిన పాఠ్యాంశాలు కూడా కారణమవుతాయి. భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం తన చిన్న నాటి గురువులను గురించి తన పుస్తకం 'ఇగ్నైటెడ్ మైండ్స్'లో ఎంతో గొప్పగా వర్ణిస్తారు. కళలు సాహిత్యం వంటివి వారి అభిరుచిని బట్టి వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. అదే కళాశాలస్థాయిలో విద్యార్థి స్వతహాగా పెంపొందించుకోవాల్సిందే కానీ పాఠ్యాంశాల్లోనూ తరగతి గదుల్లోనూ వారు నేర్చుకునే విలువలు చాలాతక్కువ. గురు శిష్యబంధంకూడా అంత బాగా దృఢంగా ఉండదని చెప్పవచ్చు. అది క్రమంగా బలహీనపడుతుంది. తద్వారా విద్యార్థి అనైతికతకు క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడే అవకాశాలు మెండు. మనఅధికారులు కూడా నైతిక విలువల పెంపుపై ఏవిధమైన కృషి చేయక పోగా అలాంటి విద్యఅమలులో దాన్ని మరింత అపహాస్యం చేశారు. ఇంటర్మీడియట్ విద్యలో ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ అనే ఒక పేపర్ ప్రథమ సంవత్సరంలో తప్పని పరిస్థితుల్లో ప్రవేశ పెట్టింది మన బోర్డు. ఆ పేపర్‌కు కేటాయించిన మార్కులు విద్యార్థి ఉత్తీర్ణతను నిర్ణయించలేవు. అంటే కేవలం పరీక్షకు హాజరైతే సరిపోతుంది. ఆ పరీక్షను ఎంత మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు అనేది దీన్ని బట్టి తెలుస్తుంది. అంటే విలువలు పెంచాలనే ప్రయత్నంలో ఏమాత్రం చిత్తశుద్ధిలేదు అనడంలో సందేహం లేదు. మానవీయ విలువల పట్ల అధికారులు ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారనేది ఇక్కడ స్పష్టంగా తెలుస్తుంది. అలాంటి విద్యార్థి రేపుభవిష్యత్తులో సమాజంలో ఇతరుల పట్ల, పెద్దల పట్ల మానవీయంగా ప్రవర్తించాలనుకోవడం అత్యాశ అవుతుంది. విద్యవిజ్ఞాన సంపాదన మాత్రమేకాదు. అది వినయం వివేకం విజ్ఞానం విలువల సమ్మేళనం. సంస్కారం తో మాత్రమే విద్యగుబాళిస్తుంది రాణిస్తుంది. అది నేటి విద్యార్థి లోకంలో మృగ్యమైంది. సమాజంలోనే కాదు. తల్లిదండ్రుల



పట్ల సోదరుల పట్ల కూడా నేటితరం ప్రవర్తన బాధ్యతారహితంగానే కాదు అభ్యంతరకరంగానూ ఉంది. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు మనప్రభుత్వాలు ద్వారాలు తెరిచినప్పటి నుండి అది వెర్రితలలు వేయడం ప్రారంభించింది. కేవలం మార్కుల సంపాదన విద్యను విద్యార్థిస్థాయిని నిర్ణయించడం మొదలైంది. గుణముల (మార్కులు) సంపాదనతో విద్యార్థి గుణగణాలు నిర్ణయించడం సముచితం కాదు. మార్కుల వేటలో ముందు నిలిచినవాడే ఉత్తమ విద్యార్థిగా నిర్ణయించడం సరికాదు. కర్తవ్యపాలన సమయపాలన క్రమశిక్షణ విధి నిర్వహణ సామాజిక బాధ్యతలు కూడా విద్యలో భాగమై అవి కూడా అతడి శ్రేణిని ఉత్తీర్ణతను నిర్ణయించాలి. మంచి మార్కులతో పాసై ఉన్నత చదువులు చదువుతూ గంజాయి స్మగ్లింగ్ మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్న వ్యక్తులను మనం పేపర్లలో చదువుతున్నాం. అమెరికాలో లాగా మనదేశంలోనూ 'తుపాకీ సంస్కృతి' నెమ్మదిగా మొదలై అది విషసంస్కృతిగా పరిణమించే ప్రమాదముంది. ఇక ఇంజనీరింగ్ కళాశాలలో దమ్ముకొట్టని విద్యార్థులను భూతద్దంలో వెతకాలి. అలాంటివారు విద్యలో రాణిస్తున్నారు. మార్కుల ప్రకారం ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. కానీ జీవితంలో ఫెయిల్ అవుతున్నారు. స్త్రీలపట్ల గౌరవం మర్యాద లేకుండా ప్రవర్తించడం వయసు, వావివరసలు లేకుండా ఇష్టం వచ్చినరీతిలో సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకునేలాగా ప్రవర్తించడం మామూలు అయిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు కూడా ఇంతనీచంగా ప్రవర్తించడం లేదు. అంటే విద్య అవివేకులను కుసంస్కారులను తయారు చేస్తుందా అనేది నిజంగా చర్చనీయాంశమే. 'విద్య లేనివాడు వింత పశువు' అన్న నానుడిని అబద్ధం చేస్తున్న రోజులివి. విద్య ఉన్నవాడు కూడా వింత పశువులాగా ప్రవర్తించడం శోచనీయం. ఈ మధ్య విజయనగరం జిల్లాలో జరిగిన ఒక సంఘటన మన సమాజం తీరుతెన్నులను ప్రశ్నిస్తోంది. అధ్యాపకురాలు వారించినప్పటికీ విద్యార్థిని మొబైల్ వాడుతుండగా సదరు అధ్యాపకురాలు ఆ విద్యార్థిని చేతినుండి మొబైల్ లాక్కున్నది. అందుకు అవమానంగా భావించిన ఆ విద్యార్థిని కోపోద్రిక్తురాలై అధ్యాపకురాలిని చెప్పుతో కొట్టడం నిజంగా సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే సంఘటన. మొబైల్ వాడవద్దు అనడం లేదా గుంజుకోవడమే ఆధ్యాపకురాలు నేరమా? అందుకు విద్యార్థినికి అధ్యాపకురాలిని శిక్షించే అర్హత ఉన్నదా? విచక్షణ మరిచి అవివేకంతో గురువును చెప్పుతో కొట్టడం ఏ రకమైన సంస్కారం అవుతుంది? ఇదే ధోరణి అందరి లోనూ ప్రబలితే ఇక చదువులకు పరీక్షలకు స్వస్తిచెప్పడమే పరిష్కారం. ఇంటిలోనూ, విద్యాసంస్థలోనూ బయట సమాజంలోనూ విద్యార్థుల నడవడికపై కన్నేయాలి. కనిపెట్టిఉండాలి. వారి కదలికలపై దృష్టిసారించాలి. వారి పెడధోరణిని మార్చకపోతే భవిష్యత్తులో సంఘవ్యతిరేకశక్తులు గానూలేదా దౌర్జన్యకారులుగాను మారే ప్రమాదంఉంది. విద్య మాత్రమే మనిషిని సరియైన దారిలో నడిపిస్తుంది. వివేకవంతుడిని చేస్తుంది. అందుకు మన పాఠ్యాంశాలు మాత్రమే సరిపోవు, ఉపాధ్యాయుల తల్లిదండ్రుల నడవడిక విద్యార్థులను ఒక క్రమపద్ధతిలో తీర్చిదిద్దుతుంది. కౌమార దశవరకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులే విద్యార్థికి ఆదర్శం. మహానేతల జీవిత చరిత్రలు సిలబస్లో భాగం కావాలి. వారికంటూ ఒక ఆదర్శ పురుషుడు ఆదర్శ నేతను ఎంచుకొని ఆ మార్గంలో నడిచే విధంగా పాఠశాల ఇల్లు లాంటి వాతావరణం కల్పించాలి. సాధ్యమైనంతవరకు మొబైల్‌కు దూరంగా ఉంచి మంచి పుస్తకాలకు వారిని దగ్గర చేయాలి. పాఠ్యాంశాలు నిజ జీవితాన్ని ప్రతిబింబించాలి. వాస్తవికతకు దగ్గరలో ఉండాలి. నీతినిజాయితీలకు, మానవ విలువలకు అద్దం పట్టాలి. భాషపట్ల గౌరవం సాహిత్యాభిలాషి పట్లఆసక్తి పెంపొందే పాఠ్యాంశాలు ఎంపిక చేయాలి. వీటన్నింటినీ పరీక్షలలో భాగం చేయాలి అంటే విద్యార్థి ఆడే ఆటలు పాల్గొనే సాంస్కృతికపరమైన కార్యక్రమాలు చదివే పుస్తకాలు (సిలబసితర) అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి కాబట్టి ఇవన్నీ అతడిఉత్తీర్ణతలో లేదా ఫలితాల్లో కీలకపాత్ర పోషించాలి. లేదంటే విద్యార్థి ఉత్తీర్ణుడవుతాడు. విద్య అతడిని మనిషిగా తీర్చిదిద్దటంలో విఫలమవుతుంది. పుస్తక రచయితలు ఈ దిశగా ఆలోచించి మరింతప్రభావవంతమైన పాఠ్యాంశాలు ఎంపికచేసి విద్యార్థుల వ్యక్తిత్వాన్నివిలువలను పెంపొందించే దిశలో ఆ పుస్తకాలు తయారు చేయాలి. ●

# అథ్లెటిక్స్‌తో అనంత ప్రయోజనాలు!

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

జ్ఞామెదడు చురుకుగా పని చేయడానికి శారీరక ఆరోగ్యమే పునాది. శారీరక ఆరోగ్య సిద్ధికి ఏకైక మార్గం మైదాన క్రీడలు లేదా అథ్లెటిక్స్ క్రీడలు మాత్రమే అని తెలుసుకోవాలి. అందువల్లనే 'సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ' అనే నినాదం వింటున్నాం. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యార్థినీ విద్యార్థులు, యువత దృష్టిని క్రీడల వైపు ఆకర్షించడంతో పాటు అత్యున్నత ప్రతిభ కనబర్చిన అథ్లెట్లను సన్మానించడం, అథ్లెటిక్ పోటీలు నిర్వహించడం, అవగాహన పర్చడం లాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఏటా 07మే రోజున ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 1996లో ఇంటర్నేషనల్ అమాచూర్ అథ్లెటిక్ ఫెడరేషన్ ప్రారంభించిన ప్రపంచ అథ్లెటిక్స్ దినం వేదికగా పిల్లలు, యువతను క్రీడామైదానాల వైపు ఆకర్షించడమే ప్రధాన ధ్యేయంగా నేటికీ కొనసాగుతున్నది. చురుకైన మెదడుతో విద్యలో ఉన్నతి, మైదాన క్రీడలతో శారీరక ఆరోగ్యం కలుగుతుందని తెలుసుకొని నేటి పిల్లలు, యువత విద్య, అథ్లెటిక్స్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన రేపటి పౌరులుగా నిలబడతారు. అథ్లెటిక్స్ క్రీడల్లో పరుగు, నడక, ఎగరడం, దూకడం, విసరడం, ఈదడం ఆధారిత పలు క్రీడలు వస్తాయి. అథ్లెటిక్స్‌లో పాల్గొనే పిల్లలు, యువ క్రీడాకారులకు దేహదారుఢ్యం, శారీరక చురుకుదనం, శరీర అవయవాల సమన్వయం, జట్టు స్ఫూర్తి, టీమ్ స్పిరిట్, గెలుపోటములను సమానంగా తీసుకునే తత్వం, సోదరభావం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక గుర్తింపు, సోషల్ స్కిల్స్, ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆత్మవిశ్వాసంపెరగడం, ధైర్యంగా జీవితాన్ని విజయం వైపు నడవడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. క్రీడలకు దేశ సరిహద్దులు, భాషాబేధాలు, జాతి, మత, లింగ వివక్షలు లాంటివి



ఉండవు. అథ్లెటిక్స్ ఓ విశ్వభాష. ఇవి సరిహద్దులను చెరిపేస్తాయి. అందరినీ ఏకంచేస్తాయి. ప్రపంచ శాంతికి ఊతం ఇస్తాయి. పోటీతత్వాన్ని పెంచుతాయి. నిజాయితీగా ప్రవర్తించడం, ఓటమిని నవ్వుతూ ఒప్పుకోవడం, రేపటి గెలుపుకు పట్టుదల పెంచుకోవడం క్రీడాకారులకే సొంతం. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, విపరీత పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం లాంటి అతి ముఖ్యమైన వ్యక్తిగత ఎదుగుదలకు సంబంధించిన ప్రయోజనాలు కలుగుతాయని తల్లి తండ్రులు గమనించాలి. 2025 ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవ శుభవేళ తల్లితండ్రులు, విద్యాలయ యాజమాన్యాలు కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకొని అమలుకు నడుం బిగించాలి. నేటి అత్యాధునిక డిజిటల్ ఏఐ యుగపు పిల్లలు, యువత అంతా కలిసి ఐక్యతతో మార్కులు, ర్యాంకులు, వీడియో గేమ్స్, స్మార్ట్‌ఫోన్ మాధ్యమాల వెంట పరుగెత్తుతూనే ఉన్నారు. అమ్మనాన్నలతోనే మాట్లాడే కాసింత సమయం దొరకనంత బిజీగా ఉన్న పిల్లలకు మైదానక్రీడలగూర్చి ఆలోచించే క్షణం తీరిక దొరకడం లేదు. ప్రేమగా అయ్యవ్వ వడ్డించిన భోజనాన్ని కడుపు నిండా తినడం, ఫ్యాన్ల కింద కాలం గడపడం, శారీరక కదలికలకు ఆస్కారం ఇవ్వకపోవడం, స్థూలకాయులుగా కుటుంబాలకు, దేశానికి భారం కావడం జరుగుతోంది. మన పిల్లలు మైదాన క్రీడల్లో పాల్గొనే విధంగా వారిని ప్రోత్సహించాలి. విద్యాలయాల్లో క్రీడా మైదానాలు పిల్లలతో కలకలలాడాలి. సరైన మైదానాలు లేని పాఠశాలలకు అనుమతులు ఇవ్వకూడదు. పాఠ్యప్రణాళికలో క్రీడలకు ప్రాధాన్యం పెంచాలి. తూతూ మంత్రంగా కొన్ని యాజమాన్యాలు పిఈటిలను నియమించి చేతులు దులుపుకుంటూ, వారిని ఇతర విధులకు వాడుకోవడంఆక్షేపణీయం. ప్రపంచ అథ్లెటిక్స్ దినం వేదికగా క్రీడా పోటీలు, అథ్లెట్లను సన్మానించడం, మారథాన్స్, ర్యాలీలు, ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు, అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. శరీర కదలికలే రేపటి ఆరోగ్య గుళికలు. క్రీడలకు దూరమైంతే బరువెక్కి దేశానికే భారం అవుతాం. ●

# పాక్‌పై భారత్ వ్యూహాత్మక ముందడుగులు

**యేచన్ చంద్ర శేఖర్**

కాశ్మీర్ అందాలను తిలకించడానికి, పర్వతాలను సందర్శించడానికి దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులు వస్తుంటారు. దురదృష్టవశాత్తూ 22 ఏప్రిల్ 2025న అమాయకుల ప్రాణాలే లక్ష్యంగా రెచ్చిపోయిన ముష్కరులు అత్యంత హేయమైన రీతిలో 28 మంది పర్యాటకులను, ప్రత్యేకించి పురుషులను వెతికి, మతంపేరు అడిగి, ముస్లిమేతరులని నిర్ధారణ చేసుకుని కాల్పులు జరిపి పొట్టనబెట్టుకున్నారు. ఈ అమానవీయ ఘటనలో పలువురు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ హింసోన్మాద చర్య మన దేశంతో పాటు ప్రపంచ దేశాలను నివ్వెరపోయేలా చేశాయి. ఈ ఘటనానంతరం, ఇటీవలి ఒకఇంటర్వ్యూలో, స్వయంగా పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తన దేశం దశాబ్దాలుగా ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని అంగీకరించిన విషయాన్ని ఉటంకిస్తూ ఐక్యరాజ్యసమితికి భారతదేశ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి ఒక కఠినమైన ప్రకటనలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని పాకిస్థాన్‌ను ఒక మోసపూరిత దేశంగా అభివర్ణించారు. ఈ కిరాతక చర్య పట్ల స్పందిస్తూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ, 28మంది అమాయక పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడికి బాధ్యులను ప్రపంచంలోని ఏ మూలాన దాక్కున్నా, గుర్తించి, వారు కనీసం ఊహించలేని రీతిలో కఠినాతికఠినంగా శిక్షిస్తామని ఆగ్రహాన్ని వ్యక్తంచేసారు. అందుకు కొనసాగింపుగానే చర్యలకు ఉపక్రమించారు. ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా, భారతదేశం ఇప్పటికే సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం, దేశంలో ఉన్న పాకిస్థాన్ రాయబార సిబ్బందిని, అక్రమ వలసదారులను, వైద్యావసరాలను మినహాయించి స్వల్పకాలిక వీసాదారులను తక్షణమే దేశం వదిలి వెళ్లాలని పలు కీలక ఆదేశాలు జారీచేయడంతోపాటు వివిధరాష్ట్రాలలో ఉన్న పాకిస్థానీలను గుర్తించి వారు దేశం వదిలి వెళ్ళేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. పాకిస్థాన్ తన గగనతలాన్ని భారతీయ విమానయాన సంస్థలకు మూసివేయాలని తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో భారతదేశం కూడా పాకిస్థాన్‌లో నమోదు చేసుకున్నా లేదా పాకిస్థాన్ సంస్థలు నిర్వహించే పౌర, సైనిక విమానాలకు తన గగనతలాన్ని ఏప్రిల్ 30, 2025 నుండి మే23, 2025వరకు మూసివేసింది. పాకిస్థాన్ ఈ నిర్ణయంతో ఇంధన ఖర్చులు ప్రయాణ సమయం పెరగడంతోపాటు భారతీయ విమానయాన సంస్థలకు ప్రతి



నెలా రూ.307కోట్లు నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. ఈ చర్య భారతదేశాన్ని ఇబ్బందిపెట్టడానికి ఉద్దేశించినప్పటికీ, దీనివల్ల వాస్తవానికి పాకిస్థాన్ గణనీయంగా ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. భారతదేశం నుండి పశ్చిమ దిశగా ప్రయాణించే ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి భారతీయ విమానయాన సంస్థలు పాకిస్థాన్‌కు భారీ రుసుమును చెల్లిస్తాయి. ఈ చర్యతో పాకిస్థాన్ తన ఓవర్‌ఫ్లైట్ ఆదాయాన్ని భారీగా కోల్పోనుంది. గతంలో పుల్వామా ఉగ్రవాదదాడి తర్వాత తన గగనతలాన్ని మూసివేసిన సందర్భంలో దాదాపు 100 మిలియన్ డాలర్లు నష్టపోయిందని హిందూస్తాన్ టైమ్స్ నివేదించింది. పాకిస్థాన్ గగనతలం గుండా ప్రయాణించేబోయింగ్ 737 విమానాలు దాదాపు 580 డాలర్లు, పెద్ద విమానాలు ఇంకా ఎక్కువ ఓవర్‌ఫ్లైట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కాగా, గగనతలం మూసివేత నిర్ణయంతో పాకిస్తాన్ ప్రతిరోజూ దాదాపు 232,000 డాలర్లతో పాటు ల్యాండింగ్, పార్కింగ్ వంటి ఇతర ఛార్జీలను కలిపి రోజువారీ నష్టందాదాపు 300,000డాలర్లుఉంటుందనిఅంచనా. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని భారత్ తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా పాకిస్థాన్ దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగమైనవ్యవసాయ రంగంపై గణనీయమైన ఆర్థిక పరిణామాలతో పాటు ఇది పంట దిగుబడి ఆహార భద్రతను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈనిర్ణయం కారణంగా ఆనకట్టలు బ్యారేజీల నుండి నీటి విడుదలకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని భారతదేశం ఆపివేస్తే అది పాకిస్థాన్ వ్యవసాయ ప్రణాళిక నీటి నిర్వహణకు అనిశ్చితిని సృష్టించవచ్చు. మౌలిక సదుపాయాల పరిమితుల కారణంగా పాకిస్థాన్‌కు నీటి ప్రవాహాన్ని గణనీయంగా నియంత్రించే అవకాశం భారతదేశానికి తక్షణమే లేనప్పటికీ, ఈ నిలిపివేత అనిశ్చితికి భవిష్యత్తులో సంభావ్య ప్రభావాలకు దారితీయవచ్చు. భారత్ ఈనిర్ణయం కారణంగా ఏర్పడే ఆర్థిక ప్రభావం వ్యవసాయం విద్యుత్ రంగాలకు మాత్రమేకాకుండా ఇతర రంగాలతో పాటు పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థ మొత్తం స్థిరత్వాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రవాద ఘటనానంతరం భారత్ పాక్ సరిహద్దు రేఖవెంట పాకిస్థాన్ కొనసాగిస్తున్న కవ్వింపు చర్యల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం జాతీయ భద్రత సలహా బోర్డును ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడినేపథ్యంలో ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని భారతదేశ సరిహద్దులను రక్షణ నిఘాకోసం ప్రత్యేక గూఢచార ఉపగ్రహ ప్రయోగాన్ని భారత అంతరిక్ష సంస్థ వేగవంతం చేస్తోంది. ఉగ్రవాదుల ఏరివేతకు భారత్ మున్నెన్నడూ లేనివిధంగా ప్రతిస్పందిస్తూ వారు కనీవినీ ఎరుగని రీతిలో చర్యలు చేపట్టనున్నట్లు ప్రతినబూనడంతో ప్రపంచదేశాలన్నీ ఊపిరి బిగపట్టి ఇరు దేశాల చర్యలను నిశితంగా గమనిస్తున్నాయి. ●

# 22 మంది న్యాయమూర్తుల ఆస్తులు ఇవీ..



## సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా బ్యాంక్ ఖాతాలో రూ. 55.75 లక్షల ఎఫ్‌డిలు, పిపిఎఫ్ ఖాతాలో రూ. 1.06 కోట్లు, మూడు ఫ్లాట్లు

**న్యూఢిల్లీ, మే 6:** న్యాయ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో తమ ఆస్తులను బహిర్గతం చేయడానికి సుప్రీంకోర్టుకు చెందిన 30 మంది సిట్టింగ్ న్యాయమూర్తులు అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జడ్జిలు తమ ఆస్తుల వివరాలను తాజాగా స్వచ్ఛందంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా 22 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను కోర్టు అధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా తన బ్యాంకు ఖాతాలో రూ. 55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు వెల్లడించారు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పిపిఎఫ్) ఖాతాలో రూ. 1.06 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే, సౌత్ ఢిల్లీలో ఒక త్రీబెడ్‌రూమ్ డిడిఎ ఫ్లాట్ ఉన్నట్లు తెలిపారు. దాన్ని ఆయన తన సోదరుడితో కలిసి కొనుగోలు చేసినట్లు చెప్పారు. తర్వాత 2,000లో దాన్ని ఫ్రీహోల్డ్‌గా మార్చారు. ఇక కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో రెండు పార్కింగ్ స్థలాలతో కూడిన ఫోర్‌బెడ్ రూమ్ ఫ్లాట్ ఉంది. ఈ ఫ్లాట్‌ను 2004లో తన తండ్రి నుంచి వారసత్వంగా పొందిన ఇంటి అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయంతో 2019లో కొనుగోలు చేసినట్లు వివరించారు. వీటితోపాటు గురుగ్రామ్‌లోని సెక్టార్ 49లోని సిస్పాల్ విహార్‌లో కుమార్తెతో కలిసి కొనుగోలు చేసిన మరో ఫోర్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ ఉంది. ఇందులో జస్టిస్ సంజీవ్ ఖన్నా వాటా 56 శాతం కాగా.. మిగిలింది 44 శాతం ఆయన కుమార్తెది. ఇక త్వరలో సిజెఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ సైతం తన ఆస్తుల వివరాలను బహిర్గతం చేశారు. తన బ్యాంకు ఖాతాలో రూ. 19.63 లక్షలు, పిపిఎఫ్ ఖాతాలో రూ. 6.59 లక్షలు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్రలోని అమరావతి, నాగ్‌పూర్‌లలోవారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములు, ముంబై, ఢిల్లీలో నివాస అపార్ట్‌మెంట్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరితో పాటు పలువురు న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జీ జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవలే భారీ స్థాయిలో నోట్ల కట్టలు బయటపడిన అంశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత సుప్రీం న్యాయమూర్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ వ్యక్తిగత ఆస్తుల వివరాలను వెల్లడించేందుకు నిర్ణయించారు. పారదర్శకతతో పాటు ప్రజల్లో న్యాయ వ్యవస్థపట్ల విశ్వాసాన్ని నింపేందుకు ఈ చర్యకు పూనుకున్నారు. డిక్లరేషన్ ద్వారా ఆస్తులు వివరాలను వెల్లడించేందుకు న్యాయమూర్తులు ఏకగ్రీవంగా అంగీకరించారు.

ఏప్రిల్ ఒకటో తేదీన జరిగిన ఫుల్ కోర్టు మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తికి తమ ఆస్తులు వివరాలను వెల్లడించేందుకు జడ్జీలు నిర్ణయించారు. తమ ఆస్తులను సుప్రీంకోర్టు అధికారిక వెబ్ సైట్‌లో ప్రచురించేందుకు ప్రధాన న్యాయమూర్తితోసహా న్యాయమూర్తులందరూ ఆమోదం తెలిపారు. తమ ఆస్తులను బహిర్గతం చేయడానికి సుప్రీంకోర్టుకు చెందిన 30మంది సిట్టింగ్ న్యాయమూర్తులు అంగీకరించారు. ప్రస్తుతం 22 మంది జడ్జిలు తమ ఆస్తుల వివరాలను వెబ్ సైట్‌లో పొందుపరిచారు. కాగా, గత సంప్రదాయాలకు పూర్తి భిన్నంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది భవిష్యత్తు న్యాయమూర్తులకు కూడా వర్తిస్తుంది. ఇక ప్రతి సంవత్సరం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

గతంలో న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)కి తమ ఆస్తుల వివరాలు అందచేసేవారు. అది కూడా తప్పనిసరి కాదు. న్యాయమూర్తులు స్వచ్ఛం దంగా తమ ఆస్తులను బహిర్గతం చేసేవారు. కాగా, తాజా నిర్ణయానికి సంబంధించిన తీర్మానం ఇంకా కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కాలేదు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో మంటలు చెలరేగి కాలిపోయిన కరెన్సీ కట్టలు కనిపించటం తీవ్ర కలకలం రేపింది.



# అమెరికా నుంచి వెళ్తే 1000 డాలర్లు ఇస్తాం

## అక్రమ వలసదారులకు ట్రంప్ సర్కార్ కొత్త ఆఫర్

**వాషింగ్టన్, మే 6:** ఎలాంటి పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న వలసదారులకు ట్రంప్ సర్కార్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. స్వచ్ఛందంగా యూఎస్ నుంచి వెళ్లాలని అనుకునే వలసదారులకు 1000 డాలర్లు ఇస్తామని పేర్కొంది.ప్రయాణ ఖర్చులు కూడా చెల్లిస్తామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకటించింది. స్వచ్ఛందంగా అమెరికా నుంచి వెళ్లాలని అనుకునే వారి ప్రయాణ ఖర్చులు కూడా తామే భరిస్తామని తెలిపింది. ఎవరైతే స్వచ్ఛందంగా వెళ్లాలని అనుకుంటారో, వారు సిబిపి హోమ్ యాప్ ద్వారా అధికారులకు ఆ విషయం తెలపాలని సూచించింది. ఇలా స్వచ్ఛందంగా వెళ్లేవారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించడం, బహిష్కరించడం లాంటివి చేయరని పేర్కొంది.

మీరు అమెరికాలో చట్టవిరు ద్ధంగా ఉంటే, స్వచ్ఛందంగా తిరిగి మీ స్వదేశానికి వెళ్లడం మంచిది. అప్పుడే మీరు అరెస్ట్ నుంచి తప్పించుకోగలుగుతారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వాళ్లు ఇప్పుడు సిబిపి హోమ్ యాప్ ద్వారా అక్రమ వలసదారు లకు ఆర్థిక సాయం చేస్తోంది. ముఖ్యంగా వలసదారులు తమ స్వదేశానికి వెళ్లడానికి స్టైఫండ్ అందిస్తుందని డిహెచ్ఎస్ సెక్రటరీ క్రిస్టి నోయెమ్ ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలోనే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ దేశ చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ ప్రారంభించారు. అయితే ఈ ప్రక్రియ చాలా క్లిష్టమైనది, అత్యంత ఖరీదైనది కూడా.

అందుకే రిపబ్లికన్ ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం నిధులు పెంచాలని కాంగ్రెస్‌ను కోరు తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 388 మంది భారతీయ పౌరులను అమెరికా బహిష్కరించింది. వారిలో 333 మందిని ఫిబ్రవరిలో మూడు వేర్వేరు విమా నాల్లో అమెరికా నుంచి భారత్‌కు పంపించింది. మిగిలిన 55 మంది భారతీయ పౌరులను వాణిజ్య విమానాల్లో పనామా ద్వారా పంపించారు అని భారత విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు.

# చిన్మయ కృష్ణదాస్ మళ్లీ అరెస్టు

## బంగ్లాలో వెల్లువెత్తిన హిందూ మైనార్టీల నిరసనలు

**ఢాకా, మే 6:** బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రబోధకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను మరోసారి అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. మైనారిటీలను రక్షించాలని ఆందోళనలు చేపట్టి దేశ ద్రోహం కేసులో అరెస్టయిన చిన్మోయ్ కృష్ణదాస్‌కు ఇటీవలే బెయిల్ లభించింది. ఈ నేపథ్యంలో ఆయన్ను మళ్లీ పోలీసులు మరో కేసులో అరెస్ట్ చేసినట్లు సమాచారం. గతేడాది నవంబర్ 7న కోర్టు ప్రాంగణంలో న్యాయవాది సైఫుల్ ఇస్లాం అలీఫ్‌పై నిరసనకారులు దాడిచేసి, హత్య చేసిన కేసులో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే చిన్మోయ్ కృష్ణదాస్‌కు బెయిల్ మంజూరు చేయాలన్న హైకోర్టు ఉత్తర్వుపై అక్కడి సుప్రీం కోర్టు స్టే విధించినట్లు సమాచారం. కృష్ణదాస్‌పై నమోదైన కేసులపై వర్చువల్ విచారణ తర్వాత సోమవారం ఆయనను అరెస్ట్ చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. మిగిలిన కేసులపై మంగళవారం విచారణ జరగనుంది. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో చిట్టగాంగ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు అభియోగాలు వచ్చాయి. దీంతో నవంబరు 25న ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ న్యాయవాది ప్రయత్నించగా, ఆయనపై ఆందోళనకారులు దాడి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కేసును టేకప్ చేయగా, ఆయనపైనా కూడా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిన్మయ్ కేసును వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఆయనకు ఊరట లభించింది. ఇటీవల కృష్ణదాస్‌కు బంగ్లాదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా, తాజాగా మరోకేసులో అరెస్ట్ చేయడం జరిగింది. కాగా, షేక్ హాసీనా ప్రభుత్వం కూలిపోయిన దగ్గరి నుంచి భారత్‌బంగ్లా మధ్య సంబంధాలు ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు కూడా అందుకు ఓ కారణమైంది.

# యుఎన్ కౌన్సిల్‌లో పాక్‌పై ప్రశ్నల వర్షం



**న్యూయార్క్, మే 6:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో అంతర్గత చర్చ జరిగింది. అయితే ఇందులో పాక్‌కు సభ్యదేశాలు కఠిన ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. పహల్గాం ఉగ్రదాడిని దృష్టి మళ్లించేందుకు పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా భారత్ గట్టిగా బదులిచ్చింది. సభ్యదేశాలు కూడా పహల్గాం ఉగ్ర దాడిని ముక్తకంఠంతో ఖండించాయి. ఉగ్రదాడికి బాధ్యత ఎవరు వహిస్తారని సభ్య దేశాలు పాక్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే ఉద్రిక్తతలు పెరిగేలా పాకిస్థాన్ వరుసగా క్షిపణి పరీక్షలు నిర్వహించడంపైనా నిలదీసినట్లు సమాచారం.ఐరాస సెక్యూరిటీ కౌన్సిల్‌లోని 15 సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. ఆ దేశం అభ్యర్థన పైనే ఈ సమావేశం జరిగింది. తన సభ్యత్వాన్ని అడ్డంపెట్టుకొని భారత్ వ్యతిరేక తీర్మానం చేయాలని తొలుత భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టి దానికే ఎదురు క్లాస్ తీసుకొన్నాయి. దాదాపు గంటన్నర జరిగిన ఈసమావేశం ఎలాంటి నిర్ణయం, తీర్మానాలు లేకుండానే ముగిసింది. ఐక్యరాజ్యసమితి కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరుదేశాలు చర్చల ద్వారా శాంతియుత పరి ష్కారం తీసుకురావాలని భద్రతా మండలి సభ్య దేశాలు పిలుపునిచ్చాయని ఐరాస ప్రతినిధి మహమ్మది ఖిలారీ వెల్లడించారు. బహిరంగంగా అణు బెదిరింపులకు దిగుతున్న పాకిస్థాన్‌పైచాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటీవల పాకిస్థాన్ క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని కూడా ప్రశ్నించాయి. అది ఉద్రిక్తతలు పెంచి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. అదే సమయంలో భారత్ కుట్రపన్ని పహల్గాం తనకు తానే దాడి చేసుకొని ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్ పాక్‌పై నిందలు మోపుతోందన్న వాదనలను కూడా సభ్యదేశాలు తోసిపుచ్చాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలంటూ తేల్చి చెప్పాయి.

పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను కూడా ఐరాస భద్రత మండలి సభ్య దేశాలు ప్రశ్నించాయి. అంతేకాకుండా ఉగ్రవాదులు మతం ఆధారంగా అమాయ ప్రజలను చంపడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పాకిస్థాన్ ఈ అంశాన్ని అంతర్జాతీయం చేద్దామనుకొంది. అయినా ఏ దేశమూ దానితో చేయి కలపలేదు. దీంతో ఏ తీర్మానం లేకుండానే సమావేశం ముగిసింది. చివరికి చైనా కూడా భేటీ అనంతరం ప్రెస్ స్టేట్‌మెంట్‌లో పాలుపంచుకోలేదు. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పాక్‌కు చాలా దేశాలు సలహా ఇచ్చాయి. పాక్ తరఫున ఐరాస శాశ్వత ప్రతినిధి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్ హాజరయ్యారు. భద్రతా మండలి సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదుర్కొన్న పాకిస్థాన్ ప్రతినిధి ఇఫ్తికార్ మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. సమావేశంలో తమ లక్ష్యాలు నెరవేరాయని చెప్పారు.


# గుజరాత్ భారీ వర్షాలకు 14 మంది మృతి

## 16 మందికి గాయాలు, మరో తుపాను ఉందని హెచ్చరిక

**అహ్మదాబాద్, మే 6:** ఉరుములు మెరుపులతో కూడిన అకాలవర్షాలు గుజరాత్‌ను అతలాకుతలం చేసాయి. ఇప్పటివరకూ 14 మంది చనిపోగా 16 మంది గాయాలపాలయ్యారు. 26 పశువులు కూడా చనిపోయినట్లు తేలింది. ఏడు ఇళ్లు ధ్వంసం అయ్యాయని అధికారులు వెల్లడించారు. ఐఎండి మరింతగా సంక్షోభం ఉంటుందని, ఉరుములు మెరుపులు పిడుగులతో కూడిన వర్షాలు తప్పవని హెచ్చరించింది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మరికొన్ని రోజులపాటు ఇదే వాతావరణం ఉంటుందని చెప్పారు. గడచిన 24 గంటల్లో మరింత తీవ్రస్థాయిలో విజృంభించింది. మొత్తం 253 తాలూకాల్లో 168 తాలూకాలు ఈ అకాలవర్షాలకు దెబ్బతిన్నాయి. ఖేడా, గాంధీనగర్, మెహసానా, వదోదర జిల్లాల్లో 25 నుంచి 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దుమ్ము తుపానుకొన్ని చోట్ల ఇసుక దుమారం మరికొన్నిచోట్ల ఎక్కువగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసాయి. మౌలికవసరులు భారీగా దెబ్బతిన్నట్లు తేలింది. భారీహోర్డింగ్‌లు కూలిపోయాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. దహోద్‌లోని లింఖేడాలో మరింతగా నష్టంజరిగింది. చెట్లుకూలి మీదపడటంతో నలుగురుచనిపోయారు. హోర్డింగ్‌లు పడటం వల్ల వాటికింద ఇద్దరు నలిగిపోయి మృతిచెందారు. మరో ముగ్గురు పిడుగుపాటుకు చనిపోయారు. మరో ఇద్దరు విద్యుదాఘాతంవల్ల చనిపోయినట్లు తేలింది.తమ ఇళ్లల్లో కొంత భాగం దెబ్బతినడం వల్ల ముగ్గురు చనిపోయారు. ఖేడా, వదోదర, అహ్మదాబాద్, దహోద్, ఆరవల్లి, ఆనంద్‌జిల్లాల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయి. ఒక్క ఖేడా జిల్లాలోనే నలుగురుచనిపోయారు. ప్రతిపక్షనాయకుడు అమిత్ చావ్‌డా బిజెపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ప్రకృతి వైపరీత్యాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని తేలింది. మృతుల కుటుంబాలకు 10 లక్షలచొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేసారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వడంతోపాటు వారికి బీమా కల్పించాలని అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు తెరవాలని డిమాండ్‌చేసారు. మరింతగా తుపాను వచ్చే ప్రమాదం ఉన్నందున రాష్ట్రంలోని రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని రైతు నాయకుడు సాగర్ రాబారి హెచ్చరించారు.

# నిఘా హెచ్చరికలున్నా పహల్గాంకు అదనపు బలగాలు ఎందుకు పంపలేదు?

## ప్రధాని మోడీపై ఎఐసిసి చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే విమర్శలు



**రాంచి, మే 6:** పహల్గాం ఉగ్రదాడిపై మూడు రోజుల ముందే కేంద్రానికి ఇంటిలిజెన్స్ రిపోర్ట్ అందిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. ఉగ్రదాడి జరుగుతుందని ఇంటిలిజెన్స్ వర్గాలు హెచ్చరికల వల్లే ప్రధాని మోదీ తన పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. ఇంటిలిజెన్స్ వర్గాలు ముందే హెచ్చరించినా పహల్గాంలో అదనపు బలగాలను ఎందుకుమోహరించలేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలుచేశారు. పహల్గాం ఉగ్రదాడికి మూడు రోజుల ముందే ప్రధాని మోదీకి ఇంటిలిజెన్స్ రిపోర్ట్ అందిందని నాకు తెలిసింది. ఈ రిపోర్ట్ వల్లే ఆయన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. మీరు అక్కడికి వెళ్లడం మంచిది కాదని ఇంటిలిజెన్స్ ముందే హెచ్చరిస్తే అక్కడ ఉన్న పర్యాటకులు, పౌరులు జాగ్రత్తల కోసం ఎందుకు సరైన చర్యలు తీసుకోలేదు. ఒకవేళ మీకు ముందు సమాచారం ఉంటే అదనపు బలగాను అక్కడికి ఎందుకు పంపించలేదు. ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్‌పార్టీ మద్దతు పార్టీలకన్నా దేశమే ముఖ్యమన్నఖర్గే, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని చెప్పారు. ఇందిరా గాంధీ, మహాత్మా గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని, సోనియా గాంధీ దేశం కోసం ఎంతో చేశారని గుర్తు చేశారు. సోనియా గాంధీ రెండు సార్లు ప్రధానమంత్రి పదవిని వదులుకున్నారని అన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడమే మోడీ ప్రభుత్వ పాలసీ అని ఆరోపించారు. ఎస్‌సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాల నుంచి ఉద్యోగాలను లాగేసుకుంటుందని విమర్శించారు. రిజర్వేషన్లపై ఉన్న 50శాతం కోటాను తొలగించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన నాయకులను బెదిరించే చర్యలను మోడీ పాల్పడకూడదని తెలిపారు. తాము పేద ప్రజలు, గిరిజనుల అభివృద్ధి కోసం పోరాడుతున్నామని అన్నారు.

# బయటిశక్తులే ముర్షిదాబాద్ అల్లర్లకు మూలం

## ప్రలోభాలకు లొంగవద్దన్న మమతా బెనర్జీ

**ముర్షిదాబాద్(బెంగాల్), మే 6:** అల్లర్లు, ఉద్రిక్తతలు, హింస చెలరేగిన ముర్షిదాబాద్‌ప్రాంతాల్లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యటించారు. బయటినుంచి వచ్చిన శక్తులే ఈ అల్లర్లను రెచ్చగొట్టారని ఆరోపించారు. ఎవరైతే ఈ అల్లర్లకు కుట్రలు పన్నారో వారందరినీ చట్టంముందుకు తెస్తామని మమతా హెచ్చరించారు. రాష్ట్రప్రజలు చీలికలకు పోకుండా సమైక్యంగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. బిజెపి మత ఛాందసవాదంలో ఎవ్వరూ పడిపోవద్దని ఆమె పిలుపునిచ్చారు. ఆందోళనకారులు, కుట్రదారులు బెంగాల్‌కు చెందినవారు కాదని, వారంతా బయటినుంచి వచ్చారని, బిజెపిమాటవిని మీకుమీరే వేరుగా చీలిపోవద్దని ఆమె విజ్ఞప్తిచేసారు. బయటివ్యక్తుల మాటలు వినవద్దని ఆమె ముర్షిదాబాద్ పర్యటనలో పిలుపునిచ్చారు. బాబ్రి మసీదు కూల్చివేత సమయంలో కూడా ముర్షిదాబాద్‌లో ఎలాంటి అల్లర్లు జరగలేదన్నారు. వక్ఫ్‌సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఎవ్వరూ హింసాత్మక నిరసనలకు పోవద్దని ఆమె సూచించారు. బెంగాల్‌లో ఈ చట్టాన్ని అమలుచేసే ప్రశ్నేలేదన్నారు. రెండు రోజులపాటు అల్లర్లు జరిగిన ముర్షిదాబాద్ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. తాను శాంతిని కోరుకుంటానని, పశ్చిమబెంగాల్ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అందుకు తాము నిరంతరం కట్టుబడిపనిచేస్తామన్నారు. ప్రజల్లో మతవిద్వేషాలను ఎందుకు భారీగా చొప్పిస్తున్నారని ఆమె బిజెపి నాయకులను విమర్శించారు. దేశరక్షణకోసం కాకుండా మతపరమైన ఉద్రిక్తతలను కేంద్రం కూడా ప్రోత్సహిస్తోందని ఆమె మండిపడ్డారు.

ముందు మన సరిహద్దులను పరి రక్షించాలని మన మాతృభూమి పరిరక్షణకు ఎంతకైనా తెగించాల్సిందేనని ఆమె అన్నారు. పహల్గాం దాడుల్లో చనిపోయినవారి కుటుంబాలను ఆదుకోవాలని ఎలాంటి మురికిరాజకీయా లకు తావీయకుండా ఈదాడికి ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని ఆమె అన్నారు. అలాగే ముర్షిదాబాద్ నిరసనకారులపై బిఎస్‌ఎఫ్ కాల్పులుజరపడాన్ని కూడా ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు.

# 'మిసైల్ వార్'లో ఎవరి బలం ఎంత?

## భారత్‌తో పోలిస్తే దాయాది దేశం క్షిపణులు దిగదుడుపేనంటున్న నిపుణులు




**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు రోజురోజుకు పెరిగి పోతుండడం తెలిసిందే. ఈ క్రమంలో భారత్ సైన్యాన్ని సర్వసన్నద్ధం చేస్తుండగా పాక్ ఒక అడుగు ముందుకేసి ఏకంగా క్షిపణులను ప్రయోగిస్తూ కవ్వింపులకు దిగుతోంది. ఈ నేపథ్యంలో మిస్సైల్ వార్‌లో భారత్, పాక్‌లలో ఏ దేశం సామర్థ్యం ఎంత అనే దానిపై పరిశీలించిన అంతర్జాతీయ రక్షణ రంగ నిపుణులు భారత్‌తో పోలిస్తే దాయాది దేశం క్షిపణులు దిగదుడుపేనని తేల్చేశారు. పాకిస్తాన్ మూడు రోజుల క్రితం అబ్దాలీ అనే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. సాయుధ దళాల యుద్ధ సన్నద్ధతను పరిశీలించే నిమిత్తం ఈ పరీక్ష నిర్వహించినట్లు పాక్ చెప్పుకుంది. భారత్‌ను ఈ క్షిపణి ద్వారా టార్గెట్ చేయగలమని పాక్ సైన్యాధికారులు తెలిపారు. పాక్ పరిశీలించిన అబ్దాలీ క్షిపణిని హత్ఫ్ 2 అని కూడా పిలుస్తారు. దీనిని పాక్ స్పేస్ రీసర్స్ కమిషన్ తయారు చేసింది. భూమిపై నుంచి ప్రయోగించే ఈ బాలిస్టిక్ క్షిపణి 450 కిలోమీటర్ల దూరంలోని ఉపరితల లక్ష్యాలను చేధిస్తుంది. ఇందులో అత్యాధునిత నావిగేషన్ వ్యవస్థ వున్నప్పటికీ అణువార్ హెడ్‌లను మోయగలిగే సామర్థ్యం దీనికి లేదు. దీంతో పాటు పాక్ వద్ద గల బాబర్ క్షిపణి 700 కిలోమీటర్లు, ఘజ్నవీ 300 కిలోమీటర్లు, షాహీన్ 2750 కిలోమీటర్ల దురం వరకు లక్ష్యాలను చేధించగలవు. అయితే ఈ క్షిపణులు భారత నావిగేషన్, రాడార్ వ్యవస్థలను దాటుకుని భారత్‌లోకి రావడం అంత సులభం కాదని నిపుణులు అంటున్నారు. ఇక భారత్ వరకు వస్తే బ్రహ్మోస్, అగ్ని 5, ప్రళయ్, పృథ్వీ 2 క్షిపణులు పాక్‌లోని అన్ని నగరాలను నిమిషాల వ్యవధిలో తాకగలిగే సామర్థ్యం కలిగి వున్నాయి. ఇందులో అగ్ని 5 క్షిపణి ఎనిమిది వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలోనే చేధించగలదు. ఈ క్షిపణి టన్ను బరువు కలిగిన వార్ హెడ్‌లను మోసుకెళ్ల కలదు. భారత్ వద్ద వున్న అత్యంత శక్తివంతమైన ధీర్ఘశ్రేణి క్షిపణిగా దీనికి పేరుంది. ఇక సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించకలిగే కే 4 ఎస్‌ఎల్‌బీఎం 3500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా సులభంగా చేధించగలదు. ఈ క్షిపణితో అణుబాంబులను కూడా ప్రయోగించ వచ్చు. పాక్‌లో రక్షణ వ్యవస్థలు ఎక్కువగా వున్న రావల్పిండి, ఇస్లామాబాద్ నగరాలను ఈ క్షిపణి ఐదు నిమిషాల వ్యవధిలో ధ్వంసం చేయగలదు. దీని తరువా త సూపర్ సానిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ధ్వనికి మూడు రెట్లు సమానమైన వేగంతో ప్రయాణించి శత్రుదేశ లక్ష్యాలను కచ్చితత్వంతో నాశనం చేయగలదు. దీంతో పాటు వెయ్యి కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను చేధించగల నిర్భయ్ శత్రుదేశాల రక్షణ వ్యవస్థల నుంచి తప్పించుకుని, ఆ దేశ రాడార్ వ్యవస్థల కళ్లుగప్పి లక్ష్యాలను తుత్తినీయలు చేయగలదు. ఇక ఉపరితల లక్ష్యాలను చేధించడల ప్రళయ్ పరిధి 150 కిలోమీటర్లు. ఇది శత్రు దేశ లక్ష్యాలను కచ్చితత్వంతో కూల్చగలదు. ఇక వైమానిక శక్తిలో భారత్ ముందు పాక్ దిగదుడుపే. భారత వైమానిక దళంలో విమానాల సంఖ్య 2229 వీటిలో యుద్ధ విమానాలు 513. ఇక పాక్ వద్ద వున్న యుద్ధ విమానాల సంఖ్య 328. భారత్ వద్ద రఫేల్, సుఖోయ్, మిగ్ విమానాలు వుంటే పాక్ వద్ద జె 17, ఎఫ్ 16 రకం యుద్ధ విమానాలు వున్నాయి.

# జర్మనీ ఛాన్సలర్‌పదవికి ఫ్రెడ్రిక్ మెర్జ్ విఫల యత్నం

## ఆరు ఓట్ల తేడాతో ఓటమి



**బెర్లిన్, మే 6:** రెండోప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో జరిగిన ఓటింగ్‌లో కన్సర్వేటివ్‌నాయకుడు ఫ్రెడ్రిక్ మెర్జ్ పదో ఛాన్సలర్‌గా ఎన్నికయ్యేందుకు విఫల యత్నంచేసారు. కేవలం ఆరుఓట్ల తేడాతో మంగళవారం ఆయన ఓటమి చవిచూసారు. వాస్తవానికి ఆయన అత్యంత సునాయాసంగా గెలుస్తారన్న అంచనాలున్నాయి. దేశం మొత్తం కూడా ఇదే అంచనాతో ఉన్నారు. ఛాన్సలర్ పదవికి పోటీలో ఉన్న వ్యక్తి ఇప్పటివరకూ చరిత్రలో మొదటి బ్యాలట్‌లో ఎప్పుడూ ఓటమి చెందలేదు. రెండోప్రపంచ యుద్ధకాలంనుంచి కూడా అదే జరుగుతోంది. ఈ ఓటమితో స్టాక్ మార్కెట్లకు కూడా విఘాతం కలిగింది. జర్మనీ డాక్స్ 1.8శాతం క్షీణించింది. మెర్జ్‌కు 630 ఓట్లలో 316 ఓట్లు రావాల్సి ఉంది. అయితే ఆయన కేవలం 310 ఓట్లు మాత్రమే రాబట్టుకోగలిగారు. తన సంకీర్ణం పరిధిలో ఉన్న 328 ఓట్లను కూడా ఆయన రాబట్టుకోలేకపోయారు. ఓటింగ్‌మొత్తం రహస్య బ్యాలెట్ పద్ధతిలోజరిగింది. మెర్జ్ శిబిరం నుంచి ఎంతమంది ఎంపిలు ఫిరాయించారన్నది కూడా స్పష్టత రావడంలేదు. మెర్జ్ సంకీర్ణ కూటమి తన వామపక్ష నరకిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్, బవేరియన్ సిస్టర్‌పార్టీ క్రిస్టియన్ సోషల్ యూనియన్‌ల ఆధ్వర్యంలోనే నడుస్తోంది. వీరితోపాటు సోషల్ డెమొక్రాట్లుకూడా కలిసారు. ప్రస్తుతం పదవినుంచి దిగిపోతున్న ఓలాఫ్ షోల్జ్‌పార్టీ సోషల్ డెమొక్రాట్లు కూడా ఈ సంకీర్ణ కూటమికి మద్దతునిచ్చారు. ఆరుఓట్లతో ఓటమితో ఇపుడు కూటమిలోని అన్ని పార్టీలు కూడా భేటీ అయి భవిష్యత్తుకార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు.

మరోపక్క యూరోపియన్ యూనియన్ 27 దేశాల కూటమికి అధినేతగా కూడా మెర్జ్ కృషిచేస్తున్నారు. షోల్జ్ ప్రభుత్వం ఇందుకోసం విఫలయత్నం చేసింది. కొత్తప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకూ ఇపుడు షోల్జ్ కేర్‌టేకర్ ప్రభుత్వ పెద్దగా కొనసాగుతారు. ప్రపంచం మొత్తం సంక్షోభంలోకి పోతోందని, యూరోపియన్ కూటమికి పటిష్ఠమైన శక్తివంతమైన జర్మనీ అవసరం ఉందని మెర్జ్ ఈసందర్భంగా వెల్లడించారు.



మంగళవారం ప్రజావాణీలో దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న డా.చిన్నారెడ్డి

# ప్రజావాణిలో 252 దరఖాస్తులు

**హైదరాబాద్(బేగంపేట), మే 6,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 252దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి 56,విద్యుత్‌శాఖకుసంబంధించి 32, రెవెన్యూ శాఖకు సంబంధించి 50,ప్రవాసీ ప్రజావాణీకి 01, ఇందిరమ్మ ఇండ్లకోసం 44 దరఖాస్తులు వచ్చాయి.

ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణీ ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు విడుదల

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త :** తెలంగాణ లోని ఉపాధి హామీ సిబ్బందికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలల బకాయి వేతనాలు విడుదల చేసింది. రాష్ట్రంలో ఈ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు మొత్తం 3,200 మందికి చెందిన రూ.62 కోట్ల వేతన బకాయిలు మంగళవారం విడుదల అయ్యాయి. అయితే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే తమ జీతాలు విడుదల చేయాలని గత కొద్ది రోజులుగా వీరంతా నిరసనకు దిగారు. దీనిపై స్పందించిన సర్కార్ నేడు ఆ పెండింగ్ బకాయిలను విడుదల చేసింది.



మంగళవారం విద్యార్థుల సమస్యలను చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు దృష్టికి తీసుకెళ్లుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

# హాస్టళ్ళు మూసివేస్తున్నా మెస్ బిల్లు చెల్లించరా!

## చీఫ్ సెక్రటరీతో బిసి నాయకుల చర్చలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** 'ఏడు నెలలుగా బీసీ కాలేజీ హాస్టల్లో మెసి బిల్లులు బకాయిలు చెల్లించడం లేదు. దీనితో హాస్టళ్ల మూసివేస్తామని అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా ప్రభుత్వం ఇంకా బడ్జెట్ ఇవ్వలేదు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల పరిధిలో 500 డిగ్రీ కాలేజీలలో చదివేల మంది విద్యార్థుల పరీక్షలు బహిష్కరిస్తుంటే ఫీజుల బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో మంగళవారం సచివాలయంలో చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావుతో చర్చలు జరిపారు. నాలుగు శాఖలలో కలిపి 4వేల కోట్ల బకాయిలు పేరుకు పోయాయి. గత మూడేళ్లుగా కాలేజీ కోర్సులు చదివే విద్యార్థుల 4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించడం లేదు. దీనితో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తున్నదని దుయ్యబట్టారు. ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు సిఎం, మంత్రులు వ్యవహరించడం సిగ్గుచేటు' అని అన్నారు. అందకు స్పందించిన చీఫ్ సెక్రటరీ బిసి హాస్టల్ మెస్ బిల్లులు రెండు రోజుల్లో క్లియర్ చేస్తామని, ఆ తర్వాత దశలవారీగా ఫీజులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామూర్తిగౌడ్, బిసి సంఘాల నాయకులు గోరేగే మల్లేశ్‌యాదవ్, నీల వెంకటేష్, జిల్లాపల్లి అంజి, సి.రాజేందర్, పగిళ్ళ సతీష్, మోదీ రాందేవ్ యాదవ్, ఎస్.రవికుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్‌కు మంత్రి సురేఖ అభినందనలు

## రాష్ట్ర పురోగతికి మీ అపార అనుభవం అవసరమని వ్యాఖ్య

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ నూతన సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ రామకృష్ణరావుని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. ఆయన సిఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంత్రి సురేఖను సచివాలయంలో ఆమె ఛాంబర్‌లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయన్ను సన్మానించారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన విభాగంలో, తెలంగాణ ఆర్థిక కార్యకలాపాల్లో సిఎస్ రామకృష్ణరావుకి ఉన్న అపార అనుభవం ప్రస్తుతం రాష్ట్ర పురోగతి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్రంలోని అన్ని విభాగాలు ముందుకు వెళ్తాయన్న ధీమాను మంత్రి వ్యక్తం చేశారు. త్వరలో తమ ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కాళేశ్వరం సరస్వతినది పుష్కరాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు రామకృష్ణరావు కృషి చేయాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకి రామకృష్ణరావు ధన్యవాదాలు తెలిపారు.

# నేటితో ముగియనున్న ఎప్‌సెట్ కీపై అభ్యంతరాలు

## 12న ఫలితాల విడుదలకి సన్నాహాలు

**హైదరాబాద్, మే6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్(ఈఏపి) సెట్-2025 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మస పరీక్షలు జరగగా మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరిగాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 4న మధ్యాహ్నం అందుబాటులోకి తీసుకురాగా ఇంజనీరింగ్ ప్రాథమిక కీని 4న సాయంత్రం 5 గంటల తరువాత నుంచి అందుబాటులో ఉంచారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీపై అభ్యంతరాలు మంగళవారంతో ముగిశాయి. నేట(బుధవారం)తో ఇంజనీరింగ్ పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించడానికి తుది గడువు. ఇంజనీరింగ్ ప్రాథమిక కీపై అభ్యంతరాలు పూర్తయిన తరువాత ఎప్ సెట్-2025 తుది ఫలితాలను విడుదల చేయనున్నారు. ఎప్ సెట్ ఫలితాలను ఈ నెల 12న విడుదల చేసేందుకు ఎప్ సెట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈఏపీ సెట్-2025కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 89వేల మంది దరఖాస్తు చేసుకు న్నారు. వారి కోసం 112 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే

## బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రం దివాళా తీసిందని పదేపదే చెప్పడం వెనుక అసలైన ఉద్దేశ్యం ఏమిటని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర దివాళా తీసిందని చెప్పడం చూస్తుంటే ఇది ఓ పకడ్బందీ స్కెచ్‌లా కనిపిస్తుందన్నారు. ఒకవైపు ప్రజలను ప్రిపేర్ చేస్తున్నట్టు, మరోవైపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల మీదకు ప్రజలను ఉసిగొల్పుతున్నట్లుగా పకడ్బందీ ప్లాన్ చేసినట్లు కనబడుతుందన్నారు. ఇచ్చిన హామీలను తప్పించుకునే కుతంత్రంగా, ఒకవైపు ఉద్యోగులను భయపెడుతూ, బ్లాక్ మెయిల్ చేస్తూ మరోవైపు ప్రజలలో ఆర్థిక సంక్షోభ భయం రేకెత్తించి సంక్షేమాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పిసిసి నాయకులుగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు ఉత్తమ్, భట్టి విక్రమార్కలు రాష్ట్రంలో రూ.5.29 లక్షల కోట్ల అప్పులున్నాయని చెప్పారు. ఇప్పుడు మాత్రం అప్పు తక్కువగా చూపడం అనుమానాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజానీకానికి భరోసా కల్పించాల్సిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో అప్పులు పుట్టడం లేదని, అప్పుకోసం వెళ్తే దొంగలను చూసినట్లు చూస్తున్నారంటూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాడన్నారు. ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందన్నారు.

# తొలి ఒడి అమ్మ ఒడి..మలిఒడి అంగన్వాడీ బడి

## చిన్నపిల్లల భవిష్యత్తు అంగన్వాడీ టీచర్లపై ఆధారపడి ఉంది

### ఎడ్యుకేషన్ వాలంటరీ కార్యక్రమంలో టెక్ ఎఫ్ఎంసి ఇంటర్నేషనల్ ఆయిల్ అండ్ మైనింగ్ కంపెనీ సేవలు అభినందనీయం: మంత్రి సీతక్క

**మనోహరాబాద్,మే 6,ప్రభాతవార్త:** చిన్నపిల్లలకు క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యా బోధన అంగన్వాడి సెంటర్స్ తోనే సాధ్యపడుతుందని పంచా యతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), తెలిపారు. మనోరాబాద్ మండలం శుభం ఫంక్షన్ హాల్ లో అంగన్వాడి ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ సభలో మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అంతకు ముందు అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాలు, చార్టర్లను పరిశీలించారు. అనంతరం టెక్నిప్ ఎఫ్ఎంసీ ఇండియా సంస్థ స్పాన్సర్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లను, మెమెంటోలను మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్స్ ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ గా మార్చుకొని అంగన్వాడీలను మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ అందరికీ స్పాన్సర్షిప్‌తో ముందుకు వచ్చిన టెక్ ఎఫ్ఎంసి (ఆయిల్ అండ్ మైనింగ్ కంపెనీ) అభినందనలు తెలిపారు. పిల్లల సృజనాత్మకత, వెలికి తీసి వారి ప్రతిభా పాట వాళ్లకు పదును బెట్టి తయారుచేసిన ఎగ్జిబిషన్ చూపరులను ఆకట్టుకుంది మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలలో 57 రకాల ఆట వస్తువులను, గర్భిణీ స్త్రీల కోసం బెంచీలు,అవసరమైన పోషకాహారాన్ని అంది స్తున్నామన్నారు. అంతే కాకుండా చిన్నారులకు అవసరమైన పోషకాహారం కోసం సైంటిస్ట్ల చేత బాలంమృతం తయారు చేయిస్తున్నాం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్స్ లలో పోషకాహారం గుణాత్మక విద్య , ఫ్రీ ప్రైమరీ యాక్టివిటీ సమర్థవంతంగా అమలు అవ్వాలని అంగన్వాడి సెంటర్స్ లలో మంచి టీచింగ్ చిన్న పిల్లలకు టేబుల్స్ లెర్నింగ్ నెంబర్స్ ఆల్ఫాబెట్స్ ఇవన్నీ విజయవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. అంగన్వాడీ టీచర్స్ కు ఒక మంచి కార్యక్రమాన్ని వారికి ఇస్తున్నామని టెన్త్ పాస్ అయిన పిల్లలను ఇంటర్మీడియట్లో జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకునేటట్లు చూడాలన్నారు .పోషకాహార రహిత అంగన్వాడి సెంటర్లగా రూపుదిద్దుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందున అంగన్వాడీ టీచర్స్ కు ఎఫ్ఎంసీ టెక్ వాలంటీర్ సంస్థకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు ,మాజీ ఎమ్మెల్యే నర్సా రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, డిడబ్ల్యుఓ హైమావతి, ఎలక్షన్ రెడ్డి జెడి విశా లాక్షి, సంబంధిత ఐసిడిఎస్ సిడిపివోలు,అంగన్వాడి టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్రం ఏం చేసిందో రాష్ట్ర బిజెపి నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. తేదీ, సమయం చెప్తే బిజెపికి ఆఫీసుకి వస్తానని అన్నారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ హాఫ్ బిజెపి, హాఫ్ బిఆర్ఎస్ అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సిఎం నిజాయితీగా వివరించారన్నారు. హరీష్, కెటిఆర్, ఈటల, బండిసంజయ్ బుద్ధితో మాట్లాడాలన్నారు. కెసిఆర్ చేసిన అప్పుకి కాంగ్రెస్ ప్రభుత్వం కడుతున్న వడ్డీనెలకి 7వేల కోట్లు అన్నారు. రెడ్డి ముఖ్యమంత్రి బిసి కులగణన చేసారన్నారు. రేవంత్‌కి మంచి పేరు వస్తుందన్న సమయంలో సన్నాసులు బయటకి వస్తున్నారన్నారు. రైతు భరోసాపై బండి సంజయ్ దారుణంగా మాట్లాడుతున్నాడని, ఏపిలోని కేంద్ర మంత్రులను చూస్తే సంతోషం అవుతుందన్నారు. బకాసురుడు బయటకి వచ్చి బస్సులు వద్దని కోట్లాడుతున్నట్లు చెప్తున్నాడు అన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న దొంగలు బిఆర్ఎస్ నాయకులని, ఉద్యమం చేస్తున్నట్లు నటించి పార్టీని నిర్మించుకున్నారని అన్నారు. ఉద్యోగసంఘాల నాయకుల మాటలు ఉద్యోగులు వినకండి, కెసిఆర్‌కి కాలు విరిగినా గుణం మారలేదన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసిన కెసిఆర్‌ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రేవంత్‌ను తట్టుకొనే దమ్ము ధైర్యం ఎవరికీ లేదన్నారు.

# వదలని వర్షాలు

## నీటిపాలైన ధాన్యం

### పలు జిల్లాల్లో పంట నష్టం

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రైతన్నలను అకాల వర్షాలు వదలడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మరోసారి కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు అపార నష్టాన్ని కలిగించాయి. రాష్ట్రంలోని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో సోమవారం రాత్రి, మంగళవారం ఈదురుగాలులతో కూడిన వాన కండగండ్లే మిగిల్చింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని అన్ని గ్రామాలతోపాటు రామడుగు మండలం వెలిచాల, వెదిర, దేశరాజ్‌పల్లి, షానగర్, పందికుంటపల్లి, కిష్టాపూర్, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లో గంటపాటు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తెచ్చి ఆరబోసిన ధాన్యం తడిసి పోయింది. తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. మానకొండూర్ మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు జగ్గయ్యపల్లి, లక్ష్మీ పూర్, ఈదులగట్టెపల్లి, రంగపేట, వెల్ది, వేగురుపల్లి గ్రామాల్లోని మామిడికాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిజామాబాద్ నగరంతోపాటు డిచ్‌పల్లి, మాక్లూర్, కోటగిరి, భీమ్‌గల్, రుద్రూర్, ఆలూరు, చందూరు, ఆర్మూర్ తదితర మండలాల్లోని మార్కెట్ యార్డుల్లో వడ్లు, మక్కలు తడిసిపోయాయి. భీమ్‌గల్‌ఆర్మూర్ మధ్య రహదారిలో పదుల సంఖ్యలో చెట్లు నేలకూల డంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు చోట్ల వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కొను గోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోగా, రైతులు కన్నీటి పర్యాంతమయ్యారు. అప్పారావుపేటలో ధాన్యం రాశులపై కవర్లు లేచి పోగా, కొంత ధాన్యం కొట్టుకుపోయింది. కాగా సిద్దిపేట జిల్లాలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో 9,368ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు సోమవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 89గ్రామాల్లో 3869 మంది రైతులకు సంబంధించి వరి, మామిడి, కూరగాయలు, నిమ్మ, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

# కాల్పులు విరమించి కేంద్రం, మావోయిస్టు పార్టీ చర్చలకు రావాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 6 ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని శాంతి చర్చల కమిటి విజ్ఞప్తి చేసింది. మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని, అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని, పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఈ మేరకు పత్రికా ముఖంగా ప్రకటన చేశారని, అనంతరం మరో మూడు సార్లు చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రం మొండిగా వ్యవహరించిందని కమిటీ పేర్కొంది. కర్రెగుట్ట ఆపరేషన్‌ను వేలాదిగా బలగాలతో కొనసాగించడం ప్రజాస్వామ్య విధానం కాదని శాంతి చర్చల కమిటి తెలిపింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ బి .చంద్రకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరెడ్డి, సి.హెచ్.బాలకిషన్‌రావు, అత్రం భుజంగరావు, పాత్రికేయులు ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సోమ రామమూర్తి, అజయ్, హరిప్రిత్, న్యాయవాదులు వెంకన్న, బండి దుర్గా ప్రసాద్ హాజరై పలు తీర్మానాలు అమోదించారు. శాంతి చర్చల కమిటీ దేశంలో అనేక ప్రాంత్రాలలో ప్రజలు, వివిధ ప్రజాసంఘాలు, పార్టీలు, సామాజిక సాముహాలు స్పందించి శాంతి చర్యలకు ముందుకు రావాలని ఉద్యమిస్తామని, కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ ఏలాంటి షరుతులు లేకుండా చర్చలకు రావాలని కమిటీ తీర్మానించింది. అనంతరం కమిటీ అధ్యక్షుడు నూతన కమిటీని ప్రకటించారు.



సమావేశంలో పాల్గొన్న శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు

# మిస్ వరల్డ్ పోటీలకు ముస్తాబైన గచ్చిబౌలి

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి

**సైబరాబాద్ ప్రతినిధి, మే 6 ప్రభాతవార్త:** నగరంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న మిస్‌వరల్డ్ అందాల పోటీలకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ముస్తాబైంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే మంగళవారం సాయంత్రం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గచ్చిబౌలిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయాశాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి పలు సూచనలు చేశారు. మిస్‌వరల్డ్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీమణిద్వీప ఆర్ట్స్ అకాడమీ విద్యార్థునులు ప్రదర్శించే పేరిణి స్వాగత నృత్యాన్ని అప్పటికే ఇండోర్ స్టేడియంలో అభ్యసి స్తుండగా వారిని ప్రశంసించారు.

**తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టాలి:మంత్రి:** మిస్‌వరల్డ్ పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, ముఖ్యంగా వంద దేశాలకు పైగా ఈపోటీల్లో పాల్గొంటున్న నేపథ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా పరిసరాలను తీర్చిదిద్దాలని నిర్వాహకులకు సూచించారు. షోబోట్ ఈవెంట్స్ వారు ఏర్పాటుచేస్తున్న స్వాగత తోరణాలపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధం లేకుండా ఇష్టానుసారంగా అలంకరణలు చెయ్యొద్దని సూచించారు. పోటీలకు సమయం దగ్గరపడ్డా ఇంకా అనుకున్న స్థాయిలో పనులు పూర్తికావడంలేదని భాషా సాంస్కతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణపై అసహనం వ్యక్తం చేశారు. భరతనాట్యం, కథక్, పేరిణి నృత్యాలు, సన్నాయి మేళం, భజంత్రీలు, తెలంగాణకళలు, హ్యాండీక్రాఫ్ట్ వంటిసాంప్రదాయాలకుపెద్దపీట వెయ్యాలన్నారు.

**శంషాబాద్‌లోనూ ఘనంగా ఏర్పాట్లు**

మిస్‌వరల్డ్ పోటీల సందర్భంగా గచ్చిబౌలితోపాటు శంషాబాద్ కూడా సర్వాంగసుందర ంగా ముస్తాబవుతోందని మంత్రి తెలిపారు. నగరంలో నిర్వహిస్తున్న అందాల పోటీల కారణంగా ప్రపంచం చూపు మన హైదరాబాద్‌పైనే ఉందని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మన సంస్కృతి సాంప్రదాయలు ఉట్టిపడేలా స్వాగత తోరణాలు, అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల పదవ తేదీవరకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తూ మిస్‌వరల్డ్ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.



గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# యువ వికాసానికి సిబిల్ స్కోర్: లబ్దిదారులకు ఇదే ప్రధాన అర్హత

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో లోన్ పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నా, గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. లోన్ అప్లికేషన్‌కు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా బ్యాంకులు పరిశీలించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది, సిబిల్ స్కోరును గుర్తించేందుకు అవసరమైన ఫీజును కూడా లబ్దిదారుల నుండి వసూలు చేయనున్నాయి. ప్రతి అప్లికేషన్‌కి రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. కాగా సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మాత్రమే మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. సిబిల్ స్కోరు గుర్తించేందుకు అవసరమైన ఫీజు విషయమై ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. ఈ విషయంపై స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులువచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666,ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదా రులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మొదటివిడతలో సుమారు 5 లక్షల మందికి అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# కట్టడాలను తప్పనిసరిగా ఇంజినీర్లు పర్యవేక్షించాలి

## ఎస్కి డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** సిమెంట్, స్టీల్‌తో నిర్మించే గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్‌లు కనీసం 30 నుండి 40 సంవత్సరాల వరకు ఉండే విధంగా డిజైన్ చేస్తారని, ఇక ఎయిర్ పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు ఓడ రేవులు, రైల్వే నిర్మాణాలు పెద్ద పెద్ద వంతెనలు వందేండ్లకు పైగా వుండే విధంగా డిజైన్ చేస్తారని, మధ్యలో వీటి నిర్వహణ కోసం మాత్రమే కొంత ఖర్చు చేస్తే అవి శాశ్వతంగా వుంటాయని ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. ఎఫెక్ట్స్ అఫ్ కరోజన్ ఆన్‌టిఎంటి బార్స్ అండ్ బిల్డింగ్ స్ట్రక్చర్స్ విషయమై గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో మంగళవారం జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎస్కి సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం ఏర్పాటు ఈ సెమినార్‌లో నగరంలోని వివిధ కన్‌స్ట్రక్షన్స్ కంపనీలలో పనిచేస్తున్న సుమారు 54 మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవిశ్రీ ఇస్పాత్ లిమిటెడ్ చీఫ్ రాజీవ్ బిష్ట్ మాట్లాడుతూ సిమెంట్‌తో నిర్మించే ప్రతి కట్టడం కూడా నమ్మకంగా దృఢంగా ఉంటేగానీ ఎక్కువకాలం పనిచేస్తుంటుందని, ఆయా నిర్మాణాల్లో వాడుతుండే మెటీరియల్‌ని ఇంజనీర్లు స్వయంగా పరిశీలించాలని, లేదంటే జరిగే నష్టానికి వారే బాధ్యులవుతారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఎప్పటికపుడు అప్‌డేషన్ శిక్షణ కార్యక్రమాలను తమ శిక్షణ సంస్థ ద్వారా అంది స్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ఎస్కి ఆవిర్భావం నుండి ప్రస్తుతం పనిచేస్తున్న వివిధ డివిజన్లకు సంబంధించి ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కె.గణేష్ బాబు, డాక్టర్ వెంకట్ దిలీప్, సిటి విభాగం హెడ్ డాక్టర్ ఆర్. వెంకట్ రెడ్డి, సి.హెచ్. తిలక్, సునీతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పాకిస్థాన్‌కి అనుకూలమే

## బిజెపి ఎంపి రఘునందర్‌రావు

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పాకిస్తాన్‌కి అనుకూలంగానే మాట్లాడుతుందని బిజెపి ఎంపి రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే సంస్కృతి కాంగ్రెస్‌ది మాత్రమే అన్నారు. ఉగ్ర దాడి మోడీకి ముందే తెలుసు అని మల్లికార్జున ఖర్గే దౌర్భాగ్యపు మాటలు మాట్లాడారన్నారు. దాడి జరిగిన విషయం తెలిసిన వెంటనే మోడీ సౌదీ అరేబియా పర్యటనను విరమించుకుని తిరిగి వచ్చేసారన్నారు. అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వానికి మద్దతుంటారు బయటకు వచ్చి మోడీనీ తప్పుని మాట్లాడుతారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతగాని ప్రభుత్వం అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి 1,50,000 కోట్లు అప్పు చేశారని, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దేశ రక్షణ విషయంలో రాజీపడే మాటలు మాట్లాడుతుందని మండిపడ్డారు. కాగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను ఎంపి రఘునందన్‌రావు మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణలో వెంటనే సైనిక పాఠశాలలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సైనిక పాఠశాలలు ప్రారంభం అయ్యే వరకు ఆంధ్రప్రదేశ్‌లో సైనిక్ స్కూల్స్‌లో 67 శాతం లోకల్ కోటా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

# 'గాలి'ని వెంటాడిన ఓబుళాపురం మైనింగ్ కేసు

## ఎమ్మెల్యేగా గెలిచినా ఫలించని ఎత్తులు
## కెఆర్‌సిపిని బిజెపిలో విలీనం చేసిన జనార్ధన్ రెడ్డి

**అనంతపురం, మే6 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా డిహీరేహాల్ మండలంలో ఓబుళాపురం మైనింగ్ గనులను దోచుకున్నాడన్న కారణంతో ఓబుళాపురం మైనింగ్ అధినేత, గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్ధన్‌రెడ్డికి ఏడేళ్లపాటు నాంపల్లి సిబిఐ స్పెషల్ కోర్టు శిక్ష విధించడం చర్చనీయాంశంగా మారింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో డివి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్ధన్‌రెడ్డి, మైనింగ్ శాఖ రిటైర్డ్ అధికారి రాజగోపాల్, పిఏ ఆలీ, లింగారెడ్డి (చనిపోయాడు) లపై సిబిఐ కోర్టు ఏడేళ్లపాటు శిక్ష విధిస్తూ తెలంగాణ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్ అధికారి కృపానందన్‌లను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ విషయం అనంతపురం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2011 సెప్టెంబర్ 5వ తేదిన ఓబుళాపురం మైనింగ్ కేసులో సిబిఐ అధికారులు గాలి జనార్ధన్‌రెడ్డిని బళ్లారిలో అరెస్టు చేశారు. ఈ కేసులో మూడున్నరేళ్లు పాటు హైద రాబాద్‌లోని చెర్లపల్లి జైలులో గాలి జనార్ధన్‌రెడ్డి శిక్ష అనుభవించారు. 2015 జనవరిలో సుప్రీం కోర్టు గాలి జనార్ధన్‌రెడ్డికి బెయిల్ ఇచ్చింది. ఆ బెయిల్‌లో షరతులు విధించింది. బళ్లారి, అనంతపురం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు వెళ్లరాదని అప్పట్లో గాలి జనార్ధన్‌రెడ్డికి సుప్రీం కోర్టు ఆంక్షలు విధించింది. ఒక ఏడాది క్రితం ఆ మూడు జిల్లాలకు కూడా గాలి జనార్ధన్‌రెడ్డి వెళ్లేందుకు అనుమతిచ్చింది. దాదాపు 15 ఏళ్లుగా నాంపల్లిలోని సిబిఐ స్పెషల్ కోర్టు ఈ కేసును విచారించింది. ఎట్టకేలకు మంగళవారం సిబిఐ స్పెషల్ కోర్టు మాజీ మంత్రి ఓబుళాపురం గనుల అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి తదితరులపై శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది.

**ఫలించని గాలి రాజకీయ ఎత్తులు :** కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా చుట్టు పక్కల జిల్లాల్లో ఒక హావా కొనసాగించిన గాలి జనార్ధన్‌రెడ్డిని రాజకీయంగా ప్రయత్నాలు ముందుకు సాగలేదు. సుష్మస్వరాజ్ కేంద్ర మంత్రిగాఉన్నప్పుడు బళ్లారి చుట్టుపక్కల జిల్లాల్లో గాలి జనార్ధన్‌రెడ్డి హవా కొనసాగింది. ఓబుళాపురం గనులను అడ్డం పెట్టుకుని ఆర్థికంగా లబ్ది పొందడంతోపాటు రాజకీయంగా కూడా ముందుకు అడుగులు వేశారు. అప్పట్లో ఒకవైపు కర్ణాటకలో బిజెపి అండదండలు కొనసాగాయి. అదే సమయంలో రాష్ట్రంలో దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నపుపడు ఆయన అండదండలు కూడా పుష్కలంగా గాలి జనార్ధన్‌రెడ్డికి లభించాయని బలంగా ఆరోపణలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఓబుళాపురం గనుల కేసు నడుస్తూ వచ్చింది. ఓబుళాపురం గనుల విషయంలో టిడిపి రాష్ట్ర నాయకులు కూడా గట్టి పోరాటాలే చేశారు. టిడిపి తరపున ఎమ్మెల్యేల బృందమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు ఓబుళాపురం గనులను పరిశీలించేందుకు వచ్చారంటే అప్పట్లో పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. బళ్లారి జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో గాలి జనార్ధన్‌రెడ్డి చక్రం తిప్పిన చరిత్ర ఉంది. బళ్లారి బిజెపి కీలక నేత శ్రీరాములు ఒకప్పుడు గాలి జనార్ధన్‌రెడ్డికి కొండంత అండగా నిలబడుతూ వచ్చారు. అయితే బళ్లారి జిల్లా రాజకీయాలు మారుతూ వచ్చాయి, మిత్రులు శత్రువులు అయ్యారు. గాలి జనార్ధన్‌రెడ్డి శ్రీరాములు మధ్య విభేదాలు రేగాయి, మూడేళ్ల క్రిందట ఓబుళాపురం గనులకేసులో బెయిల్ మీద ఉన్న జనార్ధన్‌రెడ్డి కళ్యాణ రాజ్య ప్రగతి ప్రకాశ (కెఆర్‌పిపి) అనే కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. ఆ పార్టీ తరపున 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి, కొప్పలు తదితర జిల్లాల్లో అభ్యర్థులను బరిలో దింపారు. బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి గాలిజనార్ధన్ నుంచి లక్ష్మి అరుణను బరిలో దింపగా, కొప్పల జిల్లా గంగావతి నుంచి గాలి జనార్ధన్‌రెడ్డి బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో గాలి జనార్ధన్‌రెడ్డి సోదరులు బిజెపి తరుపున పోటీ చేశారు. కొప్పల్ జిల్లా గం గావతి నుంచి కెఆర్‌పిపి తరుపున గాలి జనార్ధన్‌రెడ్డి ఒక్కరే గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ ఎన్నికల్లో గాలి తప్ప కెఆర్‌పిపి అభ్య ర్థులు ఎవ రూ గెలవలేదు.ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంఅధికారంలోకి రావడం, ఎన్నికలు జరిగిన ఆరు నెలలకే కెఆర్ పిపిని బిజెపిలోకి విలీనం చేయడం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఏదో ప్రయత్నం చేయాలని చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదని చెప్పవచ్చు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వాసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు

## ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు భరోసా కల్పించాలి: మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలను బలోపేతం చేయాలని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజలకు భరోసా కల్పించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం, విశ్వాసం పెరిగేలా మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ఉన్నత స్థాయి సమీక్షను నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, టిజిఎంఎస్ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డి, డిఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ విమల థామస్, టిజిఎంఎస్ఐడిసి సిఈ దేవేందర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్‌పై వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా పవర్ పాయింట్ ద్వారా డిపార్ట్‌మెంట్ చేపట్టిన అంశాలను వివరించారు. రాష్ట్రంలోని 202 ప్రభుత్వ ఆసుపత్రులలో (31 జిహెచ్ఎస్, 9 స్పెషాలిటీ ఆసుపత్రులు (హైద్రాబాద్), వరంగల్ లోని 4 ఆసుపత్రులు ), తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోనీ 100 పడకలపైన ఉన్న ఆస్పత్రుల(40)ను దశలవారీగా బ్రాండింగ్ చేయాలని మంత్రి వైద్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి, ఐపి, సర్జరీలను పెంచడంతోపాటు, సామాన్యు లకు ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందిస్తారని భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ బ్రాండింగ్ కార్యక్రమాన్ని రూపొం దిం చినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజల అవసరాలకు ఆనుగుణంగా బెడ్‌ల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, ఎక్విప్మెంట్ (సీటీ, ఎంఆర్ఐ)లను సమకూర్చడం, బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను కోరారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బ్రాండింగ్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసి) నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, డ్యూటీ రూమ్, సీసీటీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీ అవుట్ పోస్టుల ఏర్పాటు, రెడ్ అలారం సిస్టంలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పనలో భాగంగా ఐపి, ఓపి విభాగాలకు వచ్చే పేషెంట్లకు టాయిలెట్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

ఆస్పత్రిలో స్ట్రక్చరల్ రిపేర్లు, వివిధ విభాగాలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లు, సైనేజ్ బోర్డులు, అంతర్గత రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో క్యాంటీన్, మంచినీటి సౌకర్యం, పేషంటు వెంట వచ్చే అటెండర్ల సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. ఆసుపత్రులలో ప్రత్యేకంగా రిసెప్షను, కామన్ ఏరియా, బయో మెడికల్ వేస్టేజీ, ల్యాండ్ స్కేపింగ్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆస్పత్రులలో పరిపాలన విభాగాన్ని ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును పరిశీలించి వచ్చిన వైద్యశాఖ అధికారులు ఆయా రాష్ట్రాలలో ఆసుపత్రుల పనితీరు నివేదికను మంత్రి దామోదర్ రాజనర్సింహాకి వివరించారు. తెలం గాణలో వైద్య సేవలు దేశంలో వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఎక్విప్‌మెంట్‌లను ఆసుపత్రులకు సమకూర్చి వైద్య సేవల బలోపేతానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించి అమలు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. .

# సిఎం రేవంత్‌రెడ్డిది ముక్కుసూటి మనస్తత్వం

## గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నాం
## పెహాల్గాం వైఫల్యంకు కేంద్రం నుంచి బిజెపి దిగిపోవాలి
## ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కీలక వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే6:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిది ముక్కు సూటి మనస్తత్వమని గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నామని ఐటీ,పరిశ్రమలు,అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. బిజెపి వాళ్లు దిగిపోండీ అంటున్నారు. బిజెపి కేంద్రంలో పాలన చేతకాకపోతే దిగమను.పెహల్గామ్ వైఫల్యంకు మేము కూడా దిగిపో అనాలా?అని ప్రశ్నించారు. బిజెపి దేశాన్ని పాలించడం చేతగాకపోతే దిగిపోవాలి. దేశాన్ని కాపాడుకునే బాధ్యతను కాంగ్రెస్ తీసుకుంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. బిజెపి ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా? మోడీ విదేశాలకు పోతే లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయా? అని ప్రశ్నించారు. హెలికాప్టర్‌ను ప్రభుత్వం అద్దెకు తీసుకుందని, అది వాడినా, వాడకపోయినా అద్దె చెల్లించాల్సిందేనని చెప్పారు. అయినా మంత్రులు జిల్లాలు తిరిగేందుకు హెలికాప్టర్ వాడితే తప్పేంటని ప్రశ్నించారు. హెలికాప్టర్ వాడటం వల్ల పనుల్లో వేగం పెరుగుతుందని ఒకేసారి నాలుగైదు పనులు జరుగుతాయని అన్నారు. ఇప్పుడున్న హెలికాప్టర్ గత ప్రభుత్వ హయాంలోనే అద్దెకు తీసుకున్నారని. వాళ్లు తిరగకుండా రెంట్ కట్టారని చెప్పారు. తాము వాడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వాన్ని ఎలాగైనా బద్నాం చేయాలనే ఉద్దేశంతో బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలు చేస్తున్నారని సీరియస్ అయ్యారు.ప్రజలు పదేళ్ల అధికారం ఇస్తే బిఆర్ఎస్ నేతలు వెలగబెట్టింది ఏమీ లేదని అనానరు. కుటుంబం మొత్తం కలిసి రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నదని ఆరోపించారు. మరో వైపు కేంద్రం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి నేతలు విమర్శలు చేస్తున్నారని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. సిఎం ఆవేదనతో మాట్లాడటానికి గల కారణాన్ని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పుకొచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడారు. చిన్నాభిన్నం చేసిన ఆర్థిక విధానం చూసి ఆవేదనతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు చేయాలి. డబ్బులు లేవు అనే ఆవేదన సిఎంలో ఉంది. బిఆర్ఎస్ వాళ్లకు పేగు బంధం ఉంటే జీతాలు ఎందుకు సరిగా వేయలేదు. వాళ్లకు ప్రేమ ఉన్నట్టా? మేం రాగానే డిఏ ఇచ్చాం. వాళ్లలాగా మేము వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో గత ప్రభుత్వం తెచ్చిన అప్పులు కూడా మా ప్రభుత్వమే కడుతుందన్నారు. రాష్ట్రాన్ని దివాళా తీయించింది కెసిఆర్ అని, దాని నుంచి బయటపడేసే పని మేము చేస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు. ఉద్యోగస్తులు మా సోదరులు, మా మిత్రులే. ఆలస్యం అయినా అన్ని సమస్యలు పరిష్కారం చేస్తాం. తెలంగాణలోనే కాదు... దేశ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. అయినావనరులు పెంచి... నిధులు తెచ్చే పనిలో ఉన్నాం. లక్ష కోట్లు తెచ్చి కాళేశ్వరంలోనే కెసిఆర్ పెట్టారు. ప్రస్తుత పరిస్థితి గురించి ప్రజలకు తెలియాలని సిఎం చెప్పారు. అప్పుల విషయంప్రజలకు తెలియాలి కదా. రిటైర్మెం ట్ ఉద్యోగుల బెనిఫిట్ ఇవ్వలేక. కెసిఆర్ ఉద్యోగుల పదవి కాలాన్ని పెంచారు. కానీ మేము యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆలోచనతో ఉన్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. మావోయిస్టులతో మాకుటుంబానికి అన్యాయం జరిగింది.కానీ ఇంకో కుటుంబానికి అన్యాయం జరగొద్దని అనేది మా ఆలోచన పేర్కొన్నారు. శాంతి చర్చలు కోరడం తప్పుకాదు.మా ప్రభుత్వమే గతంలో మావోయిస్టులతో చర్చచేసిందని గుర్తు చేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే6:** రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ రాష్ట్రంలో ఏది స్థిరంగా లేదు.. ఆయన కుర్చీ కూడా స్థిరంగా లేదు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రం దివాళా తీసిందని చెబుతూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరింపులకు గురిచేసిందని ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఎలా అమలు చేస్తారని అడిగితే మాకు తెలివి ఉంది.. దేశంలోనే తెలంగాణ ధనిక రాష్ట్రం.. అందరికి అన్ని చేస్తాం అని సీఎం, డిప్యూటీ సీఎం అన్నారు. ఇప్పుడేమో మాకు చేత కాదు చేతులెత్తేస్తాం అని అంటున్నారు. ఇవాళ దివాళా తీసింది రాష్ట్రం కాదు సీఎం, మంత్రుల బుర్రలు. కాంగ్రెస్ పార్టీ దిమాక్ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బాధ్యతగల ప్రతిపక్షంగా ఆర్టీసీ, ఉద్యోగులు సమ్మె చేయాలని కోరుకోం, వాళ్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారి తరపున డిమాండ్ చేస్తామన్నారు. హామీలు ఉల్లంఘించినందుకు సమ్మెకు వెళ్లే అనివార్య పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం పరిష్కారించాలని కోరుతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి వచ్చినాక ఏది స్థిరంగా ఉంది.. ఆయన కుర్చీ కూడా స్థిరంగా లేదు నిజంగా చెప్పాలంటే. అందుకే 43 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా లేరు. పోనీ రేవంత్ రెడ్డి అయినా సంతోషంగా ఉన్నాడా..? అంటే నిన్న ఆయన ఫ్రస్టేషన్ చూస్తే మాకు కూడా డౌట్ వస్తుందన్నారు. నిజంగా ఆయనలో అపరిచితుడు ఉన్నాడు. 18 గంటలు పని చేస్తున్నా అంటున్నడు.. ఉద్యోగులు యుద్ధం ప్రకటించింది పేపర్ చదివే దాకా తెలియదట. ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె విషయం పేపర్ చదివితే కానీ తెలియని వ్యక్తికి సీఎంగా ఉండే అర్హత ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎంతో పాటు మంత్రులు హెలికాప్టర్‌ను షేర్ ఆటో వాడినట్టు వాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. 17 నెలల కాలంలో 43 సార్లు ఢిల్లీకి వెళ్లిండు రేవంత్ రెడ్డి.. ఉట్టిగనే గడ్డపారలాగా పోడు కదా..? ఆయన వెంట సిబ్బంది, చాలా మంది నేతలు, బ్రోకర్లు వెళ్తారు కదా..? అని వ్యాఖ్యలు చేశారు. ఎక్కే విమానం.. దిగే విమానం.. తెచ్చిందైతే ఏం లేదు అని అన్నారు. విమానానికి పెట్టిన ఖర్చు ఎంతనో శ్వేతపత్రం విడుదల చేయ్.. 17 నెలల్లో మీ మంత్రులు నల్లగొండకు అంటే 100 కిలోమీటర్లు పోయేందుకు కూడా హెలికాప్టర్‌ను షేర్ ఆటో వాడినట్లు వాడుతున్నరు. ఆ హెలికాప్టర్ కోసం కొట్టుకుంటున్నరు. ఎమ్మెల్యేల బర్త్‌డేలకు హెలికాప్టర్లలో పోతున్నారు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల మీద అక్కసు వెళ్లగక్కాడు. ఉద్యోగుల వల్ల దివాళా తీసిదని ప్రచారం చేస్తున్నవ్. అవమాన పరుస్తున్నవ్. అడ్డమైన మాటలు మాట్లాడుతున్నవ్ అని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను చులకన చేయడం దారుణం. దుర్మార్గపు సీఎం ఆలోచన విధానాన్ని ఉద్యోగస్తులు అర్థం చేసుకోవాలని చెప్పారు. ఉద్యోగులు జీతాలు అడగొద్దు, ఆర్టీసీ కార్మికులు అపాయింట్ డే అడగొద్దు.. ప్రజలు మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అడొగద్దు. ధరలు పెంచుడు కాదు బుర్ర పెంచుకో. హోదాకు తగ్గట్టు ప్రవర్తించే సంస్కారం, వ్యక్తిత్వం ఉండాలి. కేసీఆర్ చావును నిరంతరం కోరుకునే నువ్వు సీఎంవా..? ఇంతకంటే హీనమైనా మనిషి ఉంటాడా..? నీకు సంస్కారం ఉందా..? నీ కోసం నీ పార్టీ కోసం ఉద్యోగస్తులను మోసం చేయకు అని కేటీఆర్ సూచించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషిస్తే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్‌ను ఇప్పటి వరకు ఎన్ని మాటలన్నా పడ్డాం. ఇక నుంచి కేసీఆర్ గారిని వ్యక్తిగతంగా దూషిస్తే సహించేది లేదని పేరొన్నారు. ముమ్మాటికి మళ్లీ బీఆర్ఎస్ అధికరంలోకి వస్తుందని, రేవంత్ రెడ్డికి చేతకాకుంటే అడ్డమైన హామీలు ఇచ్చినందుకు క్షమాపణ చెప్పి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్, ఢిల్లీ పార్టీలను నమ్మవద్దని ప్రజలకు పదేపదే చెప్పారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ చేసిన ఈ హెచ్చరికలు నేడు అక్షర సత్యాలుగా నిలుస్తున్నాయని వ్యాఖ్యానించారు. అయితే, వేలాది మంది త్యాగాలు, దశాబ్దాల పోరాటాల ఫలితంగా, మేధావులు, ఉద్యోగులు,విద్యార్థులు, చివరకు కేసీఆర్ నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు శాపం చేలా సిఎం వ్యాఖ్యలు ఆవేదన కలిగించాయని తెలిపారు.

# విషతుల్యంగా మామిడి పండ్లు: కాల్షియం కార్బైడ్‌తో రంగు ఛేంజ్

## కృత్రిమ పక్వానికి ప్రజారోగ్యంతో ఆటలు పట్టించుకోని అధికారులు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** మార్కెట్లలో కనిపించేవి కమ్మని మామిడి పండ్లు కాదు. కాలకూట విషం! ఉదయం ఆకుపచ్చ రంగులో ఉన్న కాయ సాయంత్రానికే పసుపుపచ్చ కలర్ పులుముకుని ఆకర్షణీయమైన పండవుతుంది. క్యాల్షియం కార్బైడ్‌తో చూడ్డానికి రంగు వావ్ అనిపించేలా చేస్తుండగా, వీటిని తింటే మాత్రం రుచిపచీ ఉండదు. పైగా అదో విషతుల్యం. రాష్ట్రంలోని మార్కెట్లలో కాల్షియం కార్బైడ్‌తో మామిడి పండ్లను కృత్రిమంగా పక్వానికి తీసుకురావడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తెలంగాణ మామిడి మార్కెట్‌లు అంటే ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ అని పేరు పడింది. కానీ, అదే సమయంలో ఆ పండ్లు తింటే అద్భుతమైన రుచి, ఆస్వాదేనమోగానీ నయం కాని రోగాల బారిన పడటం ఖాయమనే పేరునూ మార్కెట్లు మూటగట్టుకుంటున్నాయి. రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సూర్యాపేట్, భువనగిరి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, హన్మకొండ, ములుగు, మెదక్, సిద్దిపేట్, సంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల్లో మామిడి పండుతోంది. రాష్ట్రంలో ఈ ఏడాది 3.24 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు సాగయ్యాయి. 2018 నుండి 2024 వరకూ సగటున 1,148.996 టన్నుల మామిడి దిగుబడి అవుతోంది. రాష్ట్రంలో ఈ ఏడాది 1,114 టన్నుల మామిడి దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా. అయితే రాష్ట్రంలో అత్యధికంగా మామిడి విక్రయాలు జరిగే హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల తదితర జిల్లాల్లోని మార్కెట్లతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ పలువురు వ్యాపారులు కృత్రిమ పక్వానికి కెమికల్స్‌ను వినియోగిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక్కడి నుంచి ఉత్తరాదికి ముఖ్యంగా ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాలకు మామిడిపండ్లను ఎగుమతి చేస్తారు. అయితే, ఆ మామిడి పళ్లల్లో కార్బైడ్ కలపడం వివాదాస్పదంగా మారుతోంది.

హైకోర్ట్ కూడా మామిడి పండ్లను మాగబెట్టే విషయంలో కార్బైడ్ వాడకంపైనా, పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంపైనా ప్రభుత్వంపై సీరియస్ అయింది. మామిడి మార్కెట్‌లో అక్కడక్కడా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అప్రూవల్ అయిన ఇథలీన్ రేపెనర్ కవర్స్ దర్శనమిస్తాయి. ఈ ప్యాకెట్స్ లో పౌడర్ ద్వారానో లేక, గ్యాస్ పద్ధతిలోనో మాగబెట్టడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

# ఎసిబివలలో సింగరేణి డ్రైవర్

## బాధితుల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎంవీ డ్రైవర్ రాజేశ్వరరావు

**కొత్తగూడెం, మే 6, ప్రభాతవార్త:** తనకు సింగరేణి ఉన్నతాధికారులు తెలుసు.. అందరి ఫోన్ నంబర్లు తన మొబైల్‌లో ఉన్నాయి. తనకు తెలియకుండా సింగరేణిలో ఎలాంటి నియామకాలు జరగవు... కొత్తగా ఉద్యోగాలు రావాలన్నా.. నోటిఫికేషన్ ప్రకారం ధరఖాస్తులు చేసుకొని పరీక్షలు రాసినా కానీ తాను చెప్పిన వారికే ఉద్యోగాలు వస్తాయని, అలాగే మెడికల్ అన్‌ఫిట్ కావాలన్నా, బదిలీలు, డిప్యుటేషన్లు కావాలన్నా తనకు డబ్బులిస్తే చాలు ఆ పనులు వెంటనే అయిపోతాయంటూ సింగరేణిలో ఓ ఎంవీ డ్రైవర్ తన చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. అతని మాయమాటలకు నమ్మిన వారంతా లక్షల్లో డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది... తీరా తాను చెప్పినట్లు జరగకపోవడంతో వారంతా సింగరేణి విజిలెన్స్ విభాగాన్ని ఆశ్రయించారు. వెరసీ పూర్తి నివేదిక తయారు చేసిన తర్వాత విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉన్న సమయంలో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు... ఇప్పుడు ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.

ఏసీబీ అదుపులో సింగరేణి మెయిన్ వర్క్ షాప్ డ్రైవర్ అన్న బోయిన రాజేశ్వరరావు. సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని, మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తానని, బదిలీలు చేయిస్తానని 50 లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. ఆయనతోపాటు మరో బృందంగా ఏర్పడి అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ ముఠాలో ప్రధానంగా గతంలో సంస్థ ఉద్యోగిగా ఉంటూ అనేక అవకతవకలకు పాల్పడి డిస్మిస్ కు గురైన ఓ ఉద్యోగి ప్రముఖ పాత్ర వహిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అవినీతి ఆరోపణలతో ఉద్యోగం పోగొట్టుకున్న ఆయన ప్రస్తుతానికి న్యాయవాదిగా అవతారం ఎత్తి మరిన్ని అక్రమ పనులకు పూనుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే సంస్థలోని కొందరి ఉద్యోగులను అనుచరులుగా పెట్టుకొని అక్రమాలకు తెర లేపినట్టు పలువురు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్కా ఆధారాలతో రాజేశ్వరరావు ను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో మరి కొంతమంది పేర్లు తెరపైకి వచ్చే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ రమేష్ వివరాలు వెల్లడించారు. సింగరేణి కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాప్‌లో ఎంవీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నింధితుడు అన్నబోయిన రాజేశ్వరరావు గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి అక్రమాలకు తెరలేపారని, సింగరేణి కార్మికులు మెడికల్ బోర్డుకు ధరకాస్తు చేసుకున్న వారిని, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రిక్వెస్ట్, ట్రాన్స్‌ఫర్‌లు, డిప్యుటేషన్ కోసం ధరఖాస్తులు చేసుకున్న వారికి, సింగరేణి నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాల కోసం ధరఖాస్తు చేసుకున్న వారిని టార్గెట్‌గా చేసుకొని ఈ దందాకు పాల్పడుతున్నాడని అన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

# రూ.1.20 లక్షల మద్యం పట్టివేత

**హైదరాబాద్ (ఎల్బినగర్), మే 6 ప్రభాతవార్త:** ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిల్లు తీసుకువచ్చి విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.20 లక్షల విలువైన 45 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన సరూర్ నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్ మనసురాబాద్‌లో నివాసముండే అక్షయ్‌కుమార్(30) తన ఇంట్లో నాన్‌డ్యూటి పెయిడ్ మద్యం బాటిల్లను విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు రంగారెడ్డి ఏఈఎస్ జీవన కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాల రాజు, ఎస్సై రవి సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అక్షయ్‌కుమార్ ఇంట్లో 45 నాన్‌డ్యూటి పెయిడ్ మద్యం బాటిల్లు లభ్యమయ్యాయి. గోవాకు చెందిన 23 మద్యం బాటిళ్లు, ఢిల్లీ, హర్యానాకు చెందిన 8 బాటిళ్లు, 9 డ్యూటి ఫ్రీ బాటిళ్లు, 5 తెలంగాణకు చెందిన బాటిళ్లు, ఒకటి పంజాబ్‌కు చెందిన బాటిళ్లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.1.20 లక్షల మేరకు ఉంటుందని ఏఈఎస్ జీవన్‌కిరణ్ తెలిపారు. ఏడాదిగా ఫోటోగ్రఫీ పేరుతో పలు ప్రాంతాలకు వెళ్లి వస్తూ మద్యం బాటిళ్లను తీసుకువచ్చి హైదరాబాద్‌లో అమ్మకాలు సాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. మద్యం ధరలు తక్కువ ఉన్న రాష్ట్రాల నుంచి మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా అక్షయ్‌కుమార్ కొనుగోలు చేసేవాడు. అదేవిధంగా స్థానికంగా డిఫెన్స్ బాటిళ్లను కూడా తక్కువ ధరలకు ఖరీదు చేస్తాడు. ఏ చిన్న అవకాశం లభించిన తక్కువ ధరలకు మద్యం బాటిళ్లను ఖరీదు చేసి మద్యం ప్రియులకు మాయ మాటలు చెప్పి ఎక్కువ ధరకు అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటాడన్నారు.

తన స్వంత ఇంట్లో అన్ని రాష్ట్రాలకు చెందిన మద్యం బాటిల్లతో చిన్నపాటి మద్యం దుకాణాన్ని తలపించే రీతిలో 24 గంటలు మద్యం అమ్మకాలు జరుపుతున్న రాకెట్‌ను రంగారెడ్డి ఎన్‌ఫో ర్స్‌మెంట్ టీమ్ గుట్టురట్టు చేసిందన్నారు. మద్యం బాటిళ్లను పట్టుకున్న రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అండ్ ఫోర్స్ మెంట్ ఉన్నతాధికారులు అభినందించారు.

# ములుగు జడ్పీ కార్యాలయంలో అవినీతి తిమింగలాలు

## తోటి ఉద్యోగి వద్దనే రూ. 60 వేలు లంచం డిమాండ్
## 25 వేల లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన జెడ్పీ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్

**ములుగు ,మే 6, ప్రభాతవార్త :** ములుగు జడ్పీ కార్యా లయంలో విధులు నిర్వర్తించే సూపరిండెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సౌమ్య తోటి ఉద్యోగి వద్దనే రూ. 25000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.., ములుగు జడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న నల్లబెల్లి వెంకటేశ్వర్లు అనా రోగ్యంతో బాధపడుతుండగా సిక్ లీవ్ తీసుకున్నారు. తిరిగి విధుల్లో చేరిన తర్వాత మెడికల్ బిల్లుల సెటిల్ చేసి ఎస్ టి ఓ కు పంపించేందుకు సూపరిండెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సౌమ్యలు రూపాయలు 60,000 డిమాండ్ చేశారు. మొదట రూ.25,000 ఇచ్చిబిల్లు క్లైయిమ్ అయిన తర్వాత రూ.35,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వారికి లంచం ఇవ్వడం ఇష్టం లేని వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారులను సంప్రదించారు. పథకం ప్రకారం జెడ్పి కార్యాలయం చేరుకున్న వెంకటేశ్వర్లు రూపాయలు 20,000 సూపరిండెంట్ కు రూపాయలు 5 వేలు జూనియర్ అసిస్టెంట్ సౌమ్యలకు ఇచ్చే క్రమంలో మొత్తం అమోంట్ సుధాకర్ కి ఇవ్వాలని సౌమ్య సూచించారని తెలిపారు. ఈ క్రమంలో రూపాయలు 25,000



సూపరిండెంట్ సుధాకర్ కు ఇస్తున్న క్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ ఇద్దరు అధికారులను అవినీతి నిరోధక శాఖ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు డిఎస్పీ సాంబయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ అధికారులు ఎవరైనా ప్రజలను లంచం కావాలని వేధిస్తే ఏసీబీ అధికారులను సంప్రదించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. తోటి ఉద్యోగి అని చూడకుండా మానవత్వం మరిచి, లంచం డిమాండ్ చేసిన ఇద్దరు అధికారులు తీరుపై ములుగు జిల్లాలో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# జమ్ముకాశ్మీర్‌లో శరవేగంగా బంకర్ల నిర్మాణం

**శ్రీనగర్, మే 6:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ మేఘాలు అలు ముకున్నాయి. త్వరలోనే పాకిస్థాన్‌పై భారత్ దాడి చేస్తుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దుకు ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో భూగర్భ బంకర్ల నిర్మాణాన్ని భారత ప్రభుత్వం వేగవంతం చేసింది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి జమ్ము కశ్మీర్ సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ సైన్యం ఎడతెరిపి లేకుండా కాల్పులు జరుపుతోంది. ఈ కాల్పుల నుంచి సరిహద్దు ప్రాంత ప్రజలను రక్షించడానికి భారత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బంకర్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు రక్షణ వర్గాలు చెబుతున్నాయి. సరిహద్దులోని సాంబా జిల్లా ప్రజలు హైఅలర్ట్ పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన జమ్ము కశ్మీర్‌లోని సాంబా జిల్లాలోనూ ప్రజలు అలర్ట్ అయ్యారు.

# 'మందాడి' నుంచి సుహాస్ ఫస్ట్ లుక్

ప్రముఖ నిర్మాణ సంస్థ ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ అధినేత ఎల్రెడ్ కుమార్ తన 16వ ప్రాజెక్ట్‌గా "మందాడి" అనే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాను ప్రకటించింది. "సెల్ఫీ" సినిమాతో తన ప్రతిభను నిరూపించుకున్న దర్శకుడు మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రధాన పాత్రలో నటుడు సూరి కనిపించనున్న ఈ చిత్రంలో తెలుగులో మంచి గుర్తింపు పొందిన సుహాస్ తన తమిళ అరంగేట్రం చేస్తున్నారు. కథానాయికగా మహిమా నంబియార్ నటిస్తున్నారు. అన్ని భాషల్లోను ఆకట్టుకునేలా చిత్రాన్ని మలుస్తున్నారు. ఇటీవల టైటిల్ మరియు సూరి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన నిర్మాతలు, తాజాగా సుహాస్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. లుంగీ ధరించి, నెరిసిన జుట్టుతో, జెర్సీ వేసుకుని "సునామీ రైడర్స్" బృందంతో సముద్రతీరంలో నిలిచిన సుహాస్ రూపం అభిమానులను ఆకట్టుకుంటోంది. మరో పోస్టర్‌లో సూరి, సుహాస్ ఇద్దరూ స్వయంగా పడవలు నడుపుతూ ఒకరికి ఒకరు వ్యతిరేకంగా కనిపించడం సినిమాలో వారి మధ్య జరిగే గట్టి పోరును సూచిస్తోంది. సుహాస్ ఈ చిత్రంలో బలమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ వంటి అద్భుత నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. క్రీడా నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని, బలమైన భావోద్వేగాలు, సంకర్షణలతో కూడిన ఈ సినిమా జీవన పోరాటం, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. కథను బలంగా ముందుకు నడిపించడంలో టాప్‌టియర్ సాంకేతిక బృందం కీలకపాత్ర పోషిస్తోంది: సంగీతం జి.వి. ప్రకాష్ కుమార్ సమకూరుస్తుండగా, సినిమాటోగ్రఫర్‌గా ఎస్.ఆర్. కతిర్ ఐ.ఎస్.సి. పని చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్ డి.ఆర్.కె. కిరణ్, ఎడిటర్ ప్రదీప్ ఇ.రాఘవ్. యాక్షన్ కొరియోగ్రఫీని లెజెండరీ పీటర్ హెయిన్, సౌండ్ డిజైన్‌ను ప్రతాప్ అందిస్తున్నారు. తారాగణం: సూరి, సుహాస్, మహిమ నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ తదితరులు. దర్శకత్వం: మతిమారన్ పుగళేంది.




# 'షష్టి పూర్తి' విడుదలకు రెడీ

ఏనాడూ ప్రెస్‌మీట్స్‌లో కనపడని సుప్రసిద్ధ కళా దర్శకుడు పద్మశ్రీ తోట తరణి ఈ సినిమా టీజర్ రిలీజ్ వేడుకలో పాల్గొని మాట్లాడటం. ఇలాంటి ఎన్నో విశేషాలతో షష్టి పూర్తి చిత్రం టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ద్వారా పవన్ ప్రభ దర్శకునిగా పరిచయ మవుతున్నారు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాతలు పవన్ ప్రభ, రూపేష్ మాట్లాడుతూ, ఈసినిమాకి ఎందరో హేమాహేమీలు పని చేశారు. అభినయంలో ఆరితేరిన రాజేంద్ర ప్రసాద్, అర్చన ఈ సినిమాకు మెయిన్ అస్సెట్. ఇక ఇళయరాజా స్వరాల వల్ల మా చిత్రానికి ప్రేక్షకుల్లో గొప్ప అటెన్షన్ వచ్చింది. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలు టాప్ లిస్ట్‌లో ఉన్నాయి. మళ్లీ విన్టేజ్ ఇళయరాజాను వింటున్నామని అందరూ ప్రశంసిస్తున్నా రు. ఏదో ఏ జన్మలోదో ..పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి సాహిత్యం అందించడం మా అదృష్టం. రెహమాన్ రచించిన ఇరు కనులు కనులు కలిసి మురిసె పాటను ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు. ఎక్కడ విన్నా ఈ పాటలే వినిపిస్తున్నాయి. ఈ పాటల కారణంగా ప్రేక్షకుల్లోనే కాకుండా, బిజినెస్ సర్కిల్స్‌లో కూడా మా సినిమాపై స్పెషల్ అటెన్షన్‌వచ్చింది. అలాగే ఇటీవల రిలీజ్ చేసిన టీజర్‌కి కూడా సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అవుట్ పుట్ కూడా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా ఈ సమ్మర్‌కి మంచి ఫీల్ గుడ్ మూవీతో వీడ్కోలు చెప్పవచ్చు. మిగిలిన 3 పాటలను, ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేస్తాం అని తెలిపారు. రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేష్, ఆకాంక్షా సింగ్, కాంతార ఫేమ్ అచ్యుత్ కుమార్, సంజయ్ స్వరూప్, తెనాలి శకుంతల, ఆనంద చక్రపాణి, రాజ్ తిరందాసు, మురళీధర్ గౌడ్, చలాకి చంటి, బలగం సంజయ్, అనుపమ.





ప్రణీత నయా లుక్

# 9న 'సిఎం పెళ్లాం'

ప్రముఖ నటుడు అజయ్, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం సిఎం పెళ్లాం. రమణారెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను బీఆర్‌కే నిర్మించారు. ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఈ సినిమా ప్రెస్‌మీట్‌ను నేడు చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే.. సీఎం అవుతాడు. ఎలక్షన్లు రాగానే ఎమ్మెల్యేగా కంటెస్ట్ చేసే వ్యక్తే కాకుండా ఆయన సతీమణి ఓట్లు అడగడం తెలిసిందే. కానీ గెలిచాక ఎంతమంది తమ ఇంటికి వచ్చిన ఓటర్లను కలుస్తున్నారు? సినిమా ద్వారా ఈ ప్రశ్నను నేను అడుగుతున్నా. కనీసం ఈ సినిమా తర్వాత అయినా అది ప్రారంభమవుతుందని నేను ఆశిస్తున్నా. ఎమ్మెల్యే కాస్త బిజీగా ఉండి బయట తిరుగుతున్న సమయంలో ఇంటికి పెద్ద సంఖ్యలో తమ సమస్యల పరిష్కారానికి వచ్చిన వ్యక్తులను ఎమ్మెల్యే పెళ్లాం ఒక రెండు లేదంటే మూడు గంటల పాటు కలిస్తే చాలా మార్పులొస్తాయని నమ్మాను. ఏదో చేయాల్సిన అవసరం లేదు కానీ కలిస్తే చాలు మార్పొస్తుందని ఈ సినిమాలో చూపించా. ఇక




యంగ్‌స్టర్స్ గురించి కూడా ఈ సినిమాలో చూపించాను. గత ప్రెస్‌మీట్‌లో నేను పాటలో హైడ్రాబాడ్ సిటీ అన్నానని కాంట్రవర్సీ చేశారు. నేను అన్నది హైదరాబాద్ బ్యాడ్ అని కాదు. సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా అనేది బయట పెట్టారు. అది సక్సెస్ అయితే వర్షాలొచ్చినప్పుడు సిటీ మునిగిపోకుండా ఉంటుంది. మొన్న వైరస్ టైంలో మాస్క్ చూశాం. ఇప్పుడు రాజకీయ వ్యవస్థలో వైరస్ వ్యాధి కన్నా మించింది బుతు. మీడియా ముందుకు వచ్చి రాజకీయ నాయకులు బుతులు మాట్లాడకూడదన్న పాయింట్‌ను ఈ సినిమా ద్వారా బయటపెడుతున్నా. గవర్నమెంట్ జీవోలను ఆపిన హైకోర్టు. ఈ క్రమంలోనే హైకోర్టుకు, గవర్నర్‌కు ఒక వినతి పత్రం అందించబోతున్నా. రాజకీయ నాయకులు మీడియా ముందుకు వచ్చి బూతులు మాట్లాడితే రాజకీయాల్లో పోటీ ఐదేళ్ల పాటు పోటీ చేయకుండా నిషేధం విధించాలనే రూల్ తీసుకురావాలని కోరబోతున్నా. అలాగే పదవిలో ఉన్నవారు బూతులు మాట్లాడితే.. పవర్ కోల్పోతారన్న రూల్ రావాలి. కాబట్టి ఇది రొటీన్ సినిమా కాదు. ఎంటర్‌టైన్‌మెంట్ యాంగిల్‌లో ఒక మెసేజ్ ఇవ్వబోతున్నా అన్నారు. అజయ్ మాట్లాడుతూ, రమణారెడ్డి యూఎస్ వెళ్లి 25 ఏళ్లవుతుంది. ఇంతకాలం తర్వాత ఒక బౌండ్ స్క్రిప్ట్‌తో నా దగ్గరకు వచ్చారు. ఈ మధ్య కాలంలో బౌండ్ స్క్రిప్ట్స్ పెద్దగా రావడం లేదు. నేను కన్విన్స్ అయింది ఏంటంటే.. ప్రి వర్క్ కానీ.. పోస్ట్ వర్క్ కానీ మొత్తం బౌండ్ స్క్రిప్ట్‌తో వచ్చారు. సినిమా చేయవచ్చనడానికి ఫస్ట్ గ్రీన్ ఫ్లాగ్ నాకు. కంటెంట్ ఉమన్ ఎంపవర్‌మెంట్ మీద ఉంది. పొలిటికల్‌గా ఏమేం మార్పులు చేస్తే బాగుంటుందనే దానిపై ఆయన సినిమా చేస్తున్నారు. కాబట్టి అదంతా నచ్చి సినిమా చేశారు. ఇక ప్రొడ్యూసర్ రామకృష్ణ ఎంత అవసరమో అంత స్పెండ్ చేశారు.

# ఓటిటికి 'అనగనగా'

సుమంత్ కుమార్ లీడ్ రోల్‌లో సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అనగనగా. కాజల్ చౌదరి కథానాయిక. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. మే 15 నుంచి ఈ సినిమా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. డైరెక్టర్ సన్నీ సంజయ్ అందరికీ కనెక్ట్ అయ్యే కథని హార్ట్ టచ్చింగ్‌గా ప్రజెంట్ చేశారని ప్రమోషనల్ కంటెంట్ హామీ ఇచ్చింది. ఈ థాట్ ప్రొవొకింగ్ అండ్ హార్ట్ వార్మింగ్ మూవీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. నటీనటులు: సుమంత్ కుమార్, కాజల్ చౌదరి, మాస్టర్ విహార్ష్, అవసరాల శ్రీనివాస్, అను హాసన్, రాకేష్ రాచకొండ, కౌముది నేమాని

టెక్నికల్ టీం:
రచన, దర్శకత్వం సన్నీ సంజయ్
నిర్మాతలు: రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి
కో డైరెక్టర్ గురు కిరణ్
సహ రచయిత దీప్తి
సినిమాటోగ్రాఫర్ పవన్ పప్పుల
సంగీతం చందు రవి
కాస్ట్యూమ్ డిజైనర్ ప్రియాంక వీరబోయిన
ప్రొడక్షన్ డిజైనర్ ఎల్లోల్ డిజైన్ స్టూడియో అరవింద్ మ్యూల్ చంద్రిక గొర్రెపాటి
సౌండ్ డిజైనర్ అశ్విన్ ఆర్
గ్రాఫిక్ డిజైనర్ రామ్ చరణ్, ఎడిటర్ వెంకటేష్ చుండూరు
పీఆర్వో: వంశీ శేఖర్.



# 'కాంత' నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ మూవీ కాంత అద్భుతమైన స్టార్ కాస్ట్, ఇంట్రస్టింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తూనే ఉంది. లీడ్ పెయిర్ దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే ల స్టన్నింగ్ ఫస్ట్ లుక్స్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. హీరోయిన్ భాగ్యశ్రీ బర్తే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ని రిలీజ్ చేశారు. భాగ్యశ్రీని క్లాసిక్ లుక్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తు తం సోషల్ మీడియాలో వైరల్ అవు తుంది. ఈ సినిమా షూటింగ్ పూర్త యింది. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ ప్రమోషన్స్ని కిక్ స్టార్ట్ చేస్తారు. కాంత గొప్ప కథ, నటీనటులు, టెక్నికల్ టీంతో మస్ట్ వాచ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. సినిమా విడుదల తేదీని త్వరలో అనౌన్స్ చేయనున్నారు. తారాగణం: దుల్కర్ సల్మాన్, సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే

సాంకేతిక సిబ్బంది:
దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్
బ్యానర్లు: స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికృష్ణ గద్వాల్, సుజయ్ జేమ్స్
లైన్ ప్రొడ్యూసర్: శ్రవణ్ పాలపర్తి
దీవీశి డాని శాంచెజ్ లోపెజ్
ఆర్ట్ డైరెక్టర్: రామలింగం
రచయిత: తమిళ్ ప్రభ
సంగీతం: ఝను చంతర్
ఎడిటర్: లెవెల్లిన్ ఆంథోనీ గోన్సాల్వేస్
కాస్ట్యూమ్ డిజైనింగ్: పూజిత తాడికొండ, అర్చనరావు, హర్మాన్ కౌర్
పీఆర్వో: వంశీ శేఖర్.



# హార్షాలీ మల్హోత్రాకు దేశ వ్యాప్త గుర్తింపు..

సోషల్ మీడియాను బాగా ఫాలో అయ్యేవారు అయితే ఇట్టే గుర్తుపట్టవచ్చు. మిగతా వారు అయితే అంత త్వరగా గుర్తుపట్టలేరు. ఈ అమ్మాయి మొన్నటివరకు ఒక చైల్డ్ ఆర్టిస్ట్. అలాగనీ పెద్దగా సినిమాలు చేయలేదు. నటించింది కేవలం ఒకే ఒక్క సినిమాలోనే. కానీ దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. తన అమాయకమైన నటన, క్యూట్ నెస్, ఎక్స్ ప్రెషన్స్‌తో సినిమా ఆడియెన్స్‌కు బాగా చేరువైంది. కొన్ని సన్నివేశాల్లో అయితే ఏం మాట్లాడకుండానే తన హావభావాలతో అందరితో కన్నీళ్లు పెట్టించింది. సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమా హిట్ అయిన తర్వాత కూడా ఈ క్యూటీ మరే మూవీలోనూ నటించలేదు. చదువుకు ప్రాధాన్యమిచ్చి ఇండస్ట్రీకి దూరంగా ఉండిపోయింది. సినిమాలకు దూరంగా ఉన్నఈ ముద్దుగుమ్మ ఇటీవల సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటోంది. ఎప్పటికప్పుడు తన బ్యూటిఫుల్ అండ్ గ్లామరస్ ఫొటోలు షేర్ చేస్తోంది. వీటికి నెటిజన్ల నుంచి కూడా మంచి రెస్పాన్స్ వస్తుంటుంది. అలా తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోలను చూసిన నెటిజన్లు అవాక్కవుతున్నారు. అప్పుడు సినిమాలో కనిపించిన ఆ చిన్నపాపేనా? ఈ అందాల ముద్దుగుమ్మా అంటూ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ బ్యూటీ ఎవరో మీరైనా గుర్తు పట్టారా? తను మరెవరో కాదు సల్మాన్ ఖాన్ భజరంగీ భాయ్ జాన్ సినిమాలో నటించిన హార్షాలీ మల్హోత్రా.. అదేనండి మున్నీ. భజరంగీ భాయ్ జాన్ సినిమాకు ముందు కొన్ని సీరియల్స్‌లో నటించింది హర్షాలీ. 2014లో కుబూల్ హై, లౌట్ ఆవో తృషా తదితర ధారావాహికల్లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించింది. ఇక ఏడేళ్ల ప్రాయంలో భజ్రంగీ భాయ్‌జాన్ మూవీలో యాక్ట్ చేసింది. ఆ సినిమాలో అమాయకంగా ఉన్న మున్నీ ఇప్పుడు టీనేజ్‌లో తన అందంతో కుర్రకారును కట్టిపడేస్తోంది. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉండే హర్షాలి మల్హోత్రాకు ఇన్ స్టాగ్రామ్‌లో సుమారు 3.7 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రస్తుతం చదువుకుంటోన్న ఈ ముద్దుగుమ్మ త్వరలోనే సినిమాల్లోకి వచ్చే అవకాశముందని తెలుస్తోంది.



# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సింగిల్'

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలు సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. సింగిల్ మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ కేతిక శర్మ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు? గీతా ఆర్ట్స్‌లో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

గీతా ఆర్ట్స్ సంస్థలో వర్క్ చేయాలని ఎప్పటినుంచో నా కోరిక. అల్లు అరవింద్ ఒక సినిమాని ప్రజెంట్ చేస్తుంటారంటే కచ్చితంగా ఆ సినిమాలో అద్భుతమైనటువంటి కంటెంట్ ఉంటుంది. ఈ సినిమా గురించి నాకు కాల్ వచ్చినప్పుడు ఫైనల్‌గా గీత ఆర్ట్స్‌లో వర్క్ చేస్తున్నాననే ఆనందం కలిగింది. కథ విన్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను.

**ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఈ సినిమాలో పూర్వా అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను వెరీ ఇండిపెండెంట్, ప్రాక్టికల్ గర్ల్.

**శ్రీ విష్ణుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

శ్రీ విష్ణు వండర్ఫుల్ పర్సన్ చాలా సింపుల్, చాలా హంబుల్‌గా ఉంటారు. యాక్టింగ్‌లో కూడా చాలా సపోర్ట్ చేశారు. శ్రీ విష్ణు కామెడీ టైమింగ్ చాలా యూనిక్‌గా ఉంటుంది. ఆయన స్పాట్లో డైలాగ్స్ ఇంప్రవైజ్ చేసేస్తుంటారు. ఆయన పర్ఫార్మెన్స్ చాలా స్పాంటేనియస్‌గా ఉంటుంది. ఆయనతో వర్క్ చేయడం రియల్లీ గ్రేట్ ఎక్స్పీరియన్స్.

**ఇవానాతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

ఇవానా వెరీ బ్యూటిఫుల్ అండ్ గర్ల్. ఆన్ స్క్రీన్‌లో మామధ్య ఒకటి రెండు సీన్స్ ఉన్నాయి. అయితే ఆఫ్‌స్క్రీన్‌లో మేము చాలా మంచి ఫ్రెండ్స్ అయ్యాం.



# 20 కోట్లు డిమాండ్ చేస్తోన్న హీరోయిన్

ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో దక్షణాది హీరోయిన్స్ హవా కొనసాగుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, హిందీలో వరుస సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న స్టార్స్.. ఇప్పుడు హిందీ సినీరంగంలోకి అడుగుపెడుతున్నారు. తాజాగా ఓ హీరోయిన్ మాత్రం వరుసగా పది ప్లాప్స్ అందుకున్నప్పటికీ భారీగా రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తుంది. భారతీయ సినీరంగంలోని టాప్ హీరోయిన్లలో ఆమె ఒకరు. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషలలో ఎంతో స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుని తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఆమె సినిమాల కంటే ఎక్కువగా వివాదాలతోనే ఫేమస్ అయ్యింది. కొన్నాళ్లుగా ఈ అమ్మడు జోరు తగ్గింది. కానీ రెమ్యునరేషన్ మాత్రం తగ్గేదేలే అంటోందట. దాదాపు ఆమె నటించిన పది సినిమాలు డిజాస్టర్స్ అయ్యాయి. అయినప్పటికీ రెమ్యునరేషన్ మాత్రం ఎక్కువే డిమాండ్ చేస్తుందట. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.20 కోట్ల పారితోషికం తీసుకోవాలనుకుంటుందట ఈ అమ్మడు. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ నయనతార. సౌత్ ఇండస్ట్రీలో లేడీ సూపర్ స్టార్‌గా క్రేజ్ సంపాదించుకుంది. ఇప్పుడు నయన్ వయసు 40 సంవత్సరాలు. అయినప్పటికీ కుర్రహీరోయిన్లకు గట్టిపోటీనిస్తుంది. దశాబ్దాలుగా సినీరంగంలో కొనసాగుతున్న నయన్.. ఇప్పుడు ఒక్కో సినిమాకు రూ.20 కోట్లు డిమాండ్ చేస్తుందని టాక్. ఇరవై ఏళ్లకు పైగా తెలుగు, తమిళం, కన్నడ సినిమాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న నయనతార.. అటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతుంది. ఇటీవలే జవాన్ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి విజయవంతంగా అడుగుపెట్టింది. దీంతో ఆమె క్రేజ్ పాన్ ఇండియాకు చేరింది.



# సెలవుల్లో టూర్ ప్లానింగ్..

సాధారణంగా ఏదైనా టూర్ ప్లాన్ చేయాలంటే సెలవుల కోసం చూస్తారు. పిల్లలు ఉన్న వాళ్లయితే వేసవి సెలవుల్లో వెళ్లేందుకు ఇష్టపడతారు. ఎందుకంటే పిల్లలకు ఎక్కువ రోజులు సెలవులు ఉంటాయి. కాబట్టి. ప్రయాణ బడలికతో వారి అనారోగ్యానికి గురైనా మళ్లీ కుదురుకోవడానికి సమయం ఉంటుంది. వెళ్లిన చోట ఎక్కువ సమయం గడిపేందుకు వీలుంటుంది. ఇక పెద్దవాళ్లయితే సెలవులు పెట్టుకోవాల్సి వస్తుంది. కొందరు టూర్ ప్లాన్ చేసుకునే ముందే ఎక్కువరోజులు సెలవుల కోసం ప్రయత్నిస్తారు. వారికి ఉన్న సెలవులను ఈ రకంగా వాడుకునేందుకు మధ్యలో మధ్యలో సెలవులు పెట్టకుండా ఉన్న సెలవులు కాపాడుకుంటారు. అటువంటప్పుడు ఈ సమయంలో సెలవులు ఉపయోగించుకునే వీలు కల్పించుకుంటారు. అయితే ఇలాంటి సౌకర్యం అన్ని సంస్థల్లో ఉండకపోవచ్చు.



వీలున్న చోట ఇటువంటి సౌకర్యం ఉంటే పిల్లలు, ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే ఏ పుణ్యక్షేత్రానికో, ఆ తరువాత ఏదైనా పిక్నిక్‌లాంటి ప్రదేశానికో ప్లాన్ చేసుకోవచ్చు. దగ్గర ప్రదేశాలకు వెళ్లేట్లయితే సొంత వాహనం ఉన్నవారికి ఇబ్బంది ఉండదు. లేదా ఏదైనా అద్దె వాహనంలో అయినా వెళ్లవచ్చు. లేదా విమానంలోనో, రైలులోనే ప్రయాణించాల్సి వస్తే ముందుగా ఆలోచించుకోవాల్సింది లగేజీ ఎక్కువగా ఉండకుండా చూసుకోవడం. ఎక్కువమంది ఉంటే ఎవరి లగేజీ వారు చూసుకున్నప్పటికీ పెద్దవాళ్ల లగేజీతో నడవడం, ప్రయాణించడం కష్టం కాబట్టి కావాల్సినవేమిటి, తీసుకెళ్లాల్సినవేమిటి చూసుకుని సర్దుకోవాల్సి ఉంటుంది. బ్యాగులు, సూట్‌కేసులు ఎక్కువైనా వాటిని జాగ్రత్తచేయడం కొంత కష్టమైన పనే. దుస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ వెంట ఉండాల్సిన వస్తువులు చాలానే ఉంటాయి. తక్కువ లగేజీ ఉంటే మంచిది అనుకున్నప్పటికీ ఎప్పుడేం అవసరమొస్తుందో అన్న సందేహం వచ్చినప్పుడు తప్పదు అనుకుని అదనంగా తీసుకెళ్లాల్సినవి ఉంటాయి. ఈ రోజుల్లో యూజ్ అండ్ త్రో వంటివి కొనుక్కోవడం చాలా మంది చేస్తున్నారు. పిల్లలకు వారికి కావల్సిన చిన్న చిన్న వస్తువులను వారు మోసే వీలున్న బ్యాగుల్లో వారికి సంబంధించిన పేస్టు, టూత్‌బ్రష్‌లు, కర్చీఫ్‌లు, క్యాప్‌లు, స్వెటర్‌లు వంటివి పెట్టవచ్చు. ఇక పెద్దవాళ్లయితే స్వెటర్‌లు, మఫ్లర్‌లు, క్యాప్‌లు ప్రయాణంలో ధరించే ఉంటారు కాబట్టి, వారికి కావల్సి దుస్తులు, మందులు, తప్పనిసరిగా అవసరమైన వస్తువులు ఎలాగూ వెంట ఉండాల్సి వస్తుంది. ◆

# టెన్షన్ పడితే జబ్బులు ఖాయం..

టెన్షన్ ఇప్పుడు చాలా మంది జీవితాల్లో దీనిని తగ్గించడం కష్టంగా మారిపోయింది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన పని ఒత్తిడి టెన్షన్ అందరి జీవితాల్లోనూ భాగంగా మారింది. ఇక బాగా టెన్షన్ పడితే అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ టెన్షన్‌ను తగ్గించుకోవాలని ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలని అంటున్నారు. టెన్షన్‌తో చేయాల్సిన పనులు సరిగ్గా చేయకపోగా, అనవసరమైన రిస్కులు పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. బాగా టెన్షన్ పడితే హైబిపి వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. హైబిపి మన శరీరంలోని ధమనుల గోడలపైన ఒత్తిడిని పెంచి మనకు గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులు రావడానికి కారణమవుతుందని అందుకే టెన్షన్‌ను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. టెన్షన్ ఎక్కువగా ఉన్నవారిలో గుండె పనితీరు దెబ్బతింటుంది. ఇది గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. బాగా టెన్షన్ పడే వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. విపరీతమైన ఒత్తిడి ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి, రక్తంలోని గ్లూకోస్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతుంది. దీనివల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. టెన్షన్ జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది. దీంతో అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. విపరీతమైన టెన్షన్ తలనొప్పికి కూడా కారణమవుతుంది. టెన్షన్ కారణంగా నిద్రస్థాయి కూడా తగ్గుతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇక ఎక్కువ కాలంపాటు టెన్షన్ పడుతూ ఉండడం ఒక రకమైన ఆందోళనకు, డిప్రెషన్‌కు కారణమవుతుంది. మానసిక రుగ్మతలకు కారణంగా మారుతుంది. ఎన్నో అనర్థాలు కలిగించే టెన్షన్‌ను పక్కనపెట్టి ప్రశాంతంగా జీవించడం ఉత్తమం. ప్రశాంతగా ఉన్నవారికి ఎటువంటి రోగాలు వచ్చే అవకాశం లేదు. అందుకే టెన్షన్ తగ్గించుకోవటానికి యోగా, మెడిటేషన్ వంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ◆



**ఆధ్యాత్మికం**

# ప్రబోధకుల ప్రవర్తన

ప్రబోధకులు, ప్రవచనకారులు ప్రజలకు ఎన్నో విషయాలను, ధర్మాలను బోధిస్తారు. అయితే వారి బోధకంటే వారి ప్రవర్తనే ప్రజలకు ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. వారు సాధ్యమైనంత వరకు దోషరహితంగా జీవించాలి. ఏదైనా తప్పు చేస్తే పశ్చాత్తాప పడాలి, ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మహాభారతంలోని ఒక విషయాన్ని చెబుతారు. పారాయణం లక్ష్మీకాంత శర్మగారు. 'శంఖుడు, లిఖితుడు అనే విప్రులు ప్రాణస్నేహితులు. ఒకసారి శంఖుడు లిఖితునితో పనిపడి అతని ఆశ్రమానికి వెళ్లాడు. అప్పుడు లిఖితుడు ఆశ్రమంలో లేడు. అతని కోసం శంఖుడు చాలాసేపు ఎదురు చూశాడు. ఎంతకూ లిఖితుడు రాలేదు. ఆకలి ఎక్కువై నందున ఆశ్రమంలోని ఒక మామిడి చెట్టు నుండి ఒక పండుకోసం, తిని విశ్రమించాడు. కొంతసేపటికి లిఖితుడు వచ్చాడు. కుశల ప్రశ్నలు వేశాడు. శంఖుడు పండుతిన్న సంగతిని లిఖితునితో చెప్పాడు. అప్పుడు లిఖితుడు 'మిత్రమా! నీవు నన్ను అడక్కుండా పండు తిన్నావు. కాన ఇది దొంగతనం. మనం ధర్మ బోధకులం, శాస్త్రాన్ని అనుసరించాలి కదా? అపుడే మనం ఇతరులకు బోధింపగలం. దొంగతనం చేసినందుకు శాస్త్రంలో దొంగయొక్క హస్తాన్ని ఛేధించాలని ఉంది కదా! కావున నీవు ఈ దేశం రాజు వదనదకు వెళ్లి నీ చేతిని నరికించుకో, ఇది నీ ధర్మం' అని అన్నాడు. అంత శంఖుడు తన తప్పును ఒప్పుకొని రాజు వద్దకు వెళ్లి తన చేతిని నరికించుకున్నాడు.

ఈ విధంగా పూర్వం మహనీయులు తమ ప్రవృత్తిలో అధర్మం కనబడితే వెంటనే తమకు తామే శిక్ష అనుభవించేవారు. సామాన్య ప్రజలకే కాక సాధుపుంగవులకు, పండితులకు ప్రవచన కారులకు దిశా నిర్దేశం చేసే విషయాలెన్నో మహాభారతంలో కనపడతాయి.

**- రాచమడుగు శ్రీనివాసులు**

# మాట్లాడితే మంచిదే!

ఆడవాళ్లు సుభాషిణులు.. అందంగా, వినసొంపుగా మాట్లాడతారనే అభిప్రాయంతోపాటూ, ఎక్కువ మాట్లాడతారనే భావనా ఉంది. ఇందులో ఎంతవరకూ నిజం ఉందనే విషయంపైన ఆరిజోనా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధన చేశారు. ఆడవాళ్లైనా, మగవాళ్లైయినా సుమారుగా పాతికేళ్లు వచ్చేంతవరకూ ఒక రోజులో దాదాపుగా సమానమైన పదాలనే ఉపయోగిస్తారట. ఆ తర్వాత.. అంటే పాతిక నుంచి అరవై నాలుగేళ్లు వచ్చేంత వరకూ ఆడ వాళ్ల రోజు వారీ సంభాషణ ల్లో మగ వాళ్లతో పోలిస్తే మూడు వేల పదాలు ఎక్కువ ఉంటాయట. ఇలా ఉండటా నికి ప్రధాన కారణం.. పిల్లలట. వాళ్లకి జాగ్రత్తలు చెబుతూ, తీర్చిదిద్దేక్రమంలో ఈ పదాల సంఖ్య పెరుగుతూ వస్తుందని ఈ అధ్యయనం తేల్చింది. ఆ బాధ్యతలన్నీ తీరిపోయే సమయానికి అంటే, అరవైఏళ్లు దాటేసరికి ఆడవాళ్లూ, మగవాళ్లూ వాడే తిరిగి సమానంగా ఉంటున్నాయి తేలింది. నాలుగు దేశాలకు చెందిన స్త్రీ పురుషులని ఎకువ్కని వారు మాట్లాడిన ఆరున్నర లక్షల రికార్డులని పరిశీలించాక వెల్లడించిన విషయాలివి. అలాగే, వ్యాయామం చేయడంలానే చక్కగా మాట్లాడటం కూడా ఆరోగ్య లక్షణమే అంటున్నారు శాస్త్రవేత్తలు. ◆



# శరీరానికి ఇంధనం మంచినీరు

రోజువారీ పనులన్నీ చక్క పెట్టాలన్నా నీళ్లు అనే ఇంధనాన్ని శరీరానికి తరచూ అందించాల్సిందే. మిగిలిన కాలాలతో పోలిస్తే ఎండలు నిప్పులు చెరిగే సమయంలో దాహం వేసినా వేయకపోయినా, అప్పు డప్పుడు ఓ గ్లాసు నీళ్లు తాగుతుంటే అతి వేడి, ఎండనుంచి మనల్ని మనం కాపాడు కోగలుగుతాం. చాలామంది ఇది తెలిసి కూడా నీళ్లు సరిగ్గా తాగక అనారోగ్యాల్ని తెచ్చుకుంటున్నారు. నీళ్లు సరిగ్గా తాగకపోతే డీ హైడ్రేషన్ బారిన మాత్రమే పడామనుకుంటే పొరపాటు నీళ్లు అందనప్పుడు ఎలక్ట్రోలైట్లు బ్యాలెన్స్ తప్పుతాయి. దాంతో శరీరంలో శక్తి కూడా సన్నగిల్లి, తరచూ పనిమీద ఏకాగ్రత కుదరదు. తలనొప్పి, చిరాకు, చిన్నచిన్న విషయాలను మర్చిపోవడం, నిస్సత్తువ, ఫలితంగా కోపం.. చాలినన్నీ నీళ్లు తాగక పోవడం చర్మంలోని కొలాజెన్ పైనా ప్రభావం పడుతుంది. దాంతో చర్మంలో తేమ తగ్గిపొడి బారుతుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు, గుండె సంబంధ సమస్యలున్నవారు నీళ్లు సరిగ్గా తాగని పక్షంలో రక్తం చిక్కబడి బ్రెయిన్ లేదా హార్ట్ స్ట్రోక్ రావొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, జుట్టు ఎండు గడ్డిలా మారడం వంటివీ నెమ్మదిగా మొదలవుతాయి. నీళ్లు తాగితే పోషకాలు అందుతాయి.. శరీరంలోనూ యాభై నుంచి డెబ్భై అయిదు శాతం వరకూ నీరే ఉంటుంది. శరీరానికి సరిపడా నీరు అందించడం వల్ల కీళ్ల నొప్పులు త్వరగా రావు, నీళ్లు శరీరంలోని టిష్యూలనూ వెన్నె ముకనూ ఆరోగ్యంగా ఉంచి తరచూ ఒళ్లు నొప్పుల బారిన పడకుండా చేస్తాయి మరి. మనలో పేరుకున్న వ్యర్థాలు లేదా ఫ్రీ రాడికల్స్ బయటకుపోయి శరీరమూ అంతర్గతంగా శుభ్రపడుతుంది. జీర్ణ వ్యవస్థపనితీరు మెరగవుతుంది. అధిక రక్తపోటు సమస్యా నియంత్రణలోకి వస్తుంది. మూత్రపిండాలూ మెరుగ్గా పనిచేస్తాయి. జుట్టు, చర్మం గోళ్లు ఆరోగ్యంగా కనిపిస్తాయి. చప్పగా రుచీ, పచీ లేని నీటిని అదే పనిగా ఏం తాగుతామని అనేకునే వారు నీటిలోనే నిమ్మరసం, నాలుగైదు పుదీనా ఆకులు, రెండు కీరా ముక్కలు.. వంటి సహజ ఫేవర్లను జత చేసుకోవచ్చు. నీళ్లకు బదులుగా కొబ్బరి నీళ్లూ, పల్చటి మజ్జిగా, నీటిశాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, కీరా, తర్బూజా, ద్రాక్ష, కమలా ఫలం వంటివి తీసుకున్నా మంచిదే. మామి డి, స్ట్రాబెర్రీ, నిమ్మ, ఆపిల్ వంటి పండ్ల సుగుణాలు ఉంటాయి. గ్లాసు నీటిలో ఒక క్యూబ్ లేదా డ్రాప్ వేసుకుంటే నీళ్లకు మెగ్నీషియం, పొటాషియం, వంటి ఎలక్ట్రో లైట్లూ.. సి,బి, ఇ లాంటి విటమిన్లూ అందు తాయి. ఇవి పొడి, లిక్విడ్ రూపంలోనూ దొరుకుతున్నాయి. ◆



# పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

## ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అందించేలా ఏపీ ప్రభుత్వ పదవి విరమణ చేసిన ఉద్యోగుల సంఘం అధ్యక్షలు, కార్యదర్శులు డి. వెంకటేశ్వర్లు. జి. ప్రభుదాస్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. 2019వ సంవత్సరంలో మంజూరు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటమ్ ను పునరుద్ధరించాలని, పదవీరమణ అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పెన్షనర్లకు చెల్లించాల్సిన మెడికల్ రిఎంబర్స్ మెంట్ బిల్లులను చెల్లించడంతో పాటు హెల్త్ కార్డులపై మెరుగైన వైద్యం సేవలు అందించాలని కోరారు.

ఏపి పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం సమావేశం సోమవరం జిల్లా అధ్యక్షులు కె. దాలినాయుడు అధ్యక్షతన గాంధీనగర్‌లోని పెన్షనర్ల సంఘం భవనంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇటీవల ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్‌కు జిల్లా కార్యవర్గానికి నూతనంగా అధ్యక్షులు, సహాఅధ్యక్షలు, కార్యదర్శులుగా ఎన్నికైన డి. సత్యనారాయణ రెడ్డి, వి.వి. ప్రసాద్, పి. రమేష్‌లను పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రామానికి ముఖ్య అతిధిగా హాజరైన పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షలు డి. వెంకటేశ్వర్లు మట్లాడుతూ సుధీర్గ కాలం పాటు రాష్ట్ర ప్రభుత్వంలో సేవలందించి పదవీవిరమణ చేసి వయోభారంతో బాధపడుతున్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టావలసిన అవసరం ఉందన్నారు. 2019వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు పెన్షనర్ల పై ఉన్న మమకారంతో అడిషనల్ కోంటమ్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 7075 సంవత్సరాల వయస్సుగల పెన్షనర్లకు మంజూరైన 10 శాతం అడిషనల్ కోంటమ్‌ను 7 శాతానికి, 75 80 సంవత్సరాల వయస్సుగల పెన్షనర్లకు మంజూరైన 15 శాతం అడిషనల్ కోంటమ్‌ను 12 శాతానికి తగ్గించి పెన్షనర్లను తీవ్ర మానసిక క్షోభకు గురి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తిరిగి అడిషనల్ కోంటమ్‌ను పునరుద్ధరిస్తుందని సంవత్సరం కాలంగా పెన్షన్‌దారులు ఎదురు చూస్తున్నారన్నారు. అడిషనల్ కోంటమ్‌ను పునరుద్ధరించి పెన్షనర్లను అదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు.

రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభుదాస్ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం వయోభారంతో పెన్షనర్లు అనారోగ్యానికి గురై మెరుగైన చికిత్సను పొందడంలో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. మెడికల్ రిఎంబ్రస్‌మెంట్ బిల్లులు ప్రభుత్వం వద్ద పెడిరగ్‌లో ఉన్నాయని వాటిని చెల్లింకచపోవడంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు.

తక్షణమే పెండిరగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాని కోరారు. హెల్త్ కార్డులకు సంబంధించి పెన్షనర్లు తమ వాటాగా నెలకు 225 రూపాయలు, 300 రూపాయలను చెల్లించిన్నప్పటికి మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారన్నారు. హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపిఎన్జిజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఏపిఎన్జిజీవో రాష్ట్ర సంఘం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.

# చర్లపల్లి-ఇటానగర్ రైలు నెలాఖరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 6,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని నహర్లగాన్(ఇటానగర్) మధ్య నడుపుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నెలాఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి నహర ్లగాన్(ఇటానగర్) వెళ్లే నెంబర్ 07046 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10నుంచి 31వరకు పొడిగించారు. ఈ రైై ప్రతి శనివారం ఉదయం 8.40కి చర్లపల్లి నుంచి బయలుదేరి, సోమవారం సాయంత్రం 4గంటలకు నహర్లగాన్ (ఇటానగర్) చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నహర్లగాన్ (ఇటానగర్) నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07047ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ఈ నెల 13నుంచి జూన్ 3వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1గంటకు నహర్లగాన్ నుంచి బయలుదేరి గురువారం రాత్రి 8.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. మార్గమద్యలో ఈ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం, పలసలతో పాటు ఒరిస్సా, పశ్చిమబెంగాళ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.



పాటిగడ్డలో సన్న బియ్యం భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎఐసిసిసభ్యురాలు కోట నీలిమ.విశాల్‌సుధామ్‌లు

# పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమే

## పాటిగడ్డలో సన్నబియ్యం భోజనం చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త** పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, సన్నబియ్యం పంపిణీతో లబ్దిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి , గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియూ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనుసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని పాటిగడ్డలో ఏఐసీసీ సభ్యురాలు డా. కోట నీలిమ, సనత్‌నగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు విశాల్‌సుధామ్‌లతో కల్సి సీతక్క పాటిగడ్డలోని సాలేహాబేగం నివాసంలో సన్నబియ్యం భోజనం చేసారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలులోకి తీసుకు వస్తుందన్నారు. పేదలు సన్న బియ్యం పంపిణీతో ఎంతో సంతోషంతో ఉన్నారన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం తెలంగాణా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆమె ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్‌సుధామ్, బబ్లూ , చిరంజీవి, హనీఫ్‌ఖాన్, కృష్ణ, మనోజ్, నసీరుద్దీన్(అడ్డూ), తస్లీమ్, మాధవి, అల్తమాష్, జగదీష్, పర్వేజ్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి

**- ఇబిసి,కాపులకు రూ.15 లక్షలు అందించేలా ప్రతిపాదనలు**

**విజయవాడ,మే 6,ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం త్వరలో అంబేద్కర్ ఓవర్సీస్‌ను అమలులోకి తీసుకుని రానున్నది. ఇందుకు సంబంధించి కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చింది. విదేశీ విద్యాపథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబిసి, కాపు వర్గాల్లోని ప్రతిభావంతులైన పేదల పిల్లలకు విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనే కలను నెరవేర్చేలా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ విద్య పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారులు పథకం అమలుకు కసరత్తు ప్రారంభించారు. ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షలు, బీసీ, మైనార్టీలకు రూ.20 లక్షలు, ఈబీసీ, కాపు విద్యార్థులకు రూ.15 లక్షల చొప్పున అదించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

# మచిలీపట్టణం ప్రజలకు నీటి సమస్య రానివ్వం

**- నీటిని శుద్ధి చేసేందుకు రూ.16 కోట్ల వ్యయంతో ప్లాంట్ ఏర్పాటు : మంత్రి కొల్లు రవీంద్ర**



నూతనంగా నిర్మించిన ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయరును జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ కలిసి ప్రారంభించిన మంత్రి కొల్లురవీంద్ర

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** బందరు(మచిలీపట్టణం) నగర ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆయన నగర పరిధిలోని మాచవరం రెండవ డివిజన్లో దాదాపు రూ.2.68 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 500 కిలో లీటర్ల సామర్థం గల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయరును జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా దాదాపు ఐదు లక్షల లీటర్లను నిల్వ చేసి నగర ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు.

ఈ రిజర్వాయరును నిర్మించడానికి 2014లో అమృత్ పథకం కింద కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి పనులు చేపట్టినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో మాచవరంతో పాటు గిలకలదిండిలోని రెండు ట్యాంకులు నిరుపయోగంగా ఉండిపోయాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను పూర్తి చేసి నగర ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చా మన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 14 ప్రాంతాలలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకున్నామని, భవిష్యత్తులో అవసరం మేరకు మరిన్ని రిజర్వాయర్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కూడా 200 ఎకరాలలో తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను అప్పటి టిడిపి ప్రభుత్వ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలోనే ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. తర్వాత 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో తరకటూరు పైపులైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టామన్నారను. నీటిని శుద్ధి చేయడానికి రూ.16 కోట్ల వ్యయంతో నగరంలో ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. వేసవి దృష్ట్యా ఎక్కడా కూడా నీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఇటీవల దాదాపు వెయ్యి హార్స్ పవర్ సామర్థం గల మోటార్లను పెట్టి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపామని, బందరు పట్టణంతోపాటు బందరు మండలం, పెడనకు రాబోయే రెండు నెలలకు ఎలాంటి ఇబ్బందులు రావన్నారు.

# 12న కాకినాడలో 'మాలల మహారణభేరి' భారీ బహిరంగ సభ

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** ఎపి రాష్ట్ర మాల సంఘాల జెఏసి ఆధ్వర్యంలో స్వర్గీయ పి.వి.రావు 73వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన కాకినాడ పట్టణంలో 'మాలల మహారణభేరి' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పి.వి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ నగరంలో ఈ రణభేరికి సంబంధించిన కరపత్రాలను తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు వివేక్‌వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 12వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు మాలలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల సంఘాల జెఏసి ఛైర్మన్ జి.చెన్నయ్య, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మాల సంఘాల నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, బుంగ సతీష్‌కుమార్, మాలే నాగరాజు, సూరిబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వివేక్‌వెంకటస్వామి. చిత్రంలో జి.చెన్నయ్య, పండు అశోక్‌కుమార్ తదితరులు

# గ్రాండ్‌ప్రి రేస్ విజేతగా పియాస్ట్రి

## వరల్డ్ ఛాంపియన్ వెర్‌స్టాపెన్ ఎదురీత



**న్యూఢిల్లీ:** ఫార్ములా వన్-2025 సీజనులో భాగంగా జరిగిన ఆరో రేసు మయామి గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి విజేతగా నిలిచాడు. గత నాలుగేళ్ల ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ సాధించిన రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్‌వెర్‌స్టాపెన్‌కు ఈ సీజన్‌లో తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. క్వాలిఫయింగ్ సెషన్‌లో అదరగొట్టిన వెర్‌స్టాపెన్‌ను ప్రధాన రేసులో మాత్రం మెక్‌లారెన్ డ్రైవర్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇక ఫ్లోరిడాలో జరిగిన ఆరో రేసులో నిర్ణీత 57 ల్యాప్‌ల రేసును పియాస్ట్రి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 28 నిముషాల 51.587 సెకన్ల వ్యవధిలో పూర్తి చేసి ఈ సీజన్‌లో నాలుగో గెలుపును, వరుసగా మూడో విజయాన్ని అందుకున్నాడు. అలాగే మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత ఏడాది ఈ రేసులో విజేతగా నిలిచిన నోరిస్ ఈసారి 1 గంట 28 నిముషాల 56.217 సెకన్లలో రేసును పూర్తి చేశాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానాన్ని పొందగా, పోల్ పొజిషన్ తో రేసును ఆరంభించిన ప్రపంచ ఛాంపియన్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నలుగురు డ్రైవర్లు వీసా క్యాష్ రేసింగ్ బుల్స్‌కు చెందిన లియామ్ లాసన్, స్టేక్ టీమ్ కిక్ సాబెర్‌కు చెందిన గాబ్రియెల్ బోర్టొలెటో, మనీగ్రామ్ హాస్‌కు చెందిన ఒలివెర్ బియర్మన్, అల్పైన్ టీమ్‌కు చెందిన జాక్ దూహాన్‌లు రేసు మధ్యలోనే నిష్క్రమించారు. లాసన్ 36వ ల్యాప్‌లో, బొర్టొలెటో 30వ ల్యాప్‌లో, బియర్మన్ 27వ ల్యాప్‌లో, దూహాన్ తొలి ల్యాప్‌లో వైదొలగారు.

# బిలియర్డ్స్ క్లాసిక్ విజేత పంకజ్




**న్యూఢిల్లీ:** భారత దిగ్గజ క్యూయిస్టు పంకజ్ అద్వానీ ఖాతాలో మరో టైటిల్ చేరింది. సీసీఐ బిలియర్డ్స్ క్లాసిక్ టోర్నీలో పంకజ్ వరుసగా మూడోసారి విజేతగా నిలిచాడు. ఏస్ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ తన మూడవ సిసిఐ బిలియర్డ్స్ క్లాసిక్ టైటిల్‌ను గెలుచుకున్నాడు, ఇక్కడ జరిగిన ఫైనల్‌లో ధ్రువ్ సిత్వాలాను 5-2 తేడాతో ఓడించాడు. ముంబైలో ఆలస్యంగా ఇక్కడ జరిగిన ఫైనల్‌లో మొదటి మూడు ఫ్రేమ్‌లలో అద్వానీ తన అత్యుత్తమ ప్రదర్శనకు దూరంగా ఉన్నాడు, కానీ తన ప్రత్యర్థి సిత్వాలా అందించిన అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకున్నాడు, తుది పోరులో ఆదిలో తడబడ్డ అద్వానీ ఆ తర్వాత పుంజుకుని పోటీలోకి వచ్చాడు. అతను 94 పరుగుల బలమైన బ్రేక్‌లో ఉన్నప్పుడు తడబడ్డాడు. అద్వానీ నాలుగో ఫ్రేమ్‌ను గెలిచి 2-2తో సమం చేశాడు. తన లయను కనుగొని ఆటను తన ఆధీనంలోకి తీసుకున్నాడు. నాల్గవ ఫ్రేమ్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను సమం చేయడానికి అద్వానీ 145 పాయింట్ల సందర్శనతో సద్వినియోగం చేసుకున్నాడు. తరువాతి మూడు ఫ్రేమ్‌లను గెలిచి విజయాన్ని నమోదు చేశాడు. దీంతో 2.5 లక్షల రూపాయల మేర ప్రైజ్ మనీని అద్వానీ గెలుచుకున్నాడు. ఇక సిత్వాలా రన్నరప్‌గా 1.5 లక్షల రూపాయలను గెలుచుకున్నాడు. 2023 మరియు 2024లో విజయాలతో సహా వరుసగా మూడవ సంవత్సరం పోటీని గెలుచుకున్న తర్వాత అద్వానీ మాట్లాడుతూ, "ఈ విజయం నాకు ప్రత్యేకమైనది" అని అన్నారు.

### ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో సిరీస్‌కు..

# వెస్టిండీస్ జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లకు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తమ జట్టును ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం తమ జట్టును ప్రకటించింది. దక్షిణాఫ్రికాలో జరగబోయే 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని విండీస్ క్రికెట్ బోర్డు పటిష్టమైన జట్టును సిద్ధం చేసింది. ఈ స్క్వాడ్ లో భాగంగా ఎక్కువగా యువకులకే అవకాశం కల్పించింది. షాయ్ హోప్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. 18 ఏళ్ల జ్యువెల్ ఆండ్రూ తిరిగి విండీస్ జట్టులో స్థాన సంపాదించాడు. వన్డే అరంగేట్రంలోనే సెంచరీ చేసిన అమీర్ జాంగూ కూడా జట్టులోకి వచ్చాడు. ఈ స్క్వాడ్ లో ఆశ్చర్యకరంగా విండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్మైర్ పేరు లేదు. బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్ ఓపెనర్లుగా రావడం ఖాయంగా మారింది.



కీసీ కార్టీ మూడో స్థానంలో ఆడే అవకాశం ఉంది. హోప్, రోస్టన్ చేజ్, జస్టిన్ గ్రీవ్స్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్ మిడిల్, లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ భారాన్ని మోయనున్నారు. అల్జారి జోసెఫ్ పేస్ అటాక్కు నాయకత్వం వహిస్తారు. షమర్ జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్ ఫాస్ట్ బౌలర్లుగా ఎంపికయ్యారు. గుడకేష్ మోటీ విండీస్ స్క్వాడ్ లో ఏకైక ఫ్రంట్లైన్ స్పిన్నర్‌గా ఉన్నాడు. ఇక ఐర్లాండ్ పర్యటన ఈ నెల 21న ప్రారంభమవుతుంది. 23, 25 తేదీల్లో వరుసగా రెండు, మూడు వన్డేలు జరగనున్నాయి. 29 నుండి జూన్ 2 వరకు ఇంగ్లాండ్‌లో మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డేలు ముగిసిన తర్వాత ఇంగ్లాండ్‌తో వెస్టిండీస్ ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతున్న రూథర్‌ఫోర్డ్, షెపర్డ్ త్వరలోనే విండీస్ జట్టులో చేరనున్నారు. కెప్టెన్ హోప్, జోసెఫ్ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడుతున్నారు. ఈ లీగ్ మే 18 నాటికి పూర్తవుతుంది. కాగా వెస్టిండీస్ వన్డే జట్టులో షాయ్ హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, కీసీ కార్టీ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, జస్టిన్ గ్రీవ్స్, అమీర్ జాంగూ, అల్జారి జోసెఫ్, షమర్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్, గుడకేష్ మోటీ, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, జేడెన్ సీల్స్, రొమారియో షెపర్డ్ ఉన్నారు.



### ప్లేఆఫ్‌కు నో ఎంట్రీ

### ఏడు జట్ల మధ్యనే ప్లేఆఫ్ రేస్ నుండి 3 టీమ్‌లు ఔట్

# ఐపిఎల్‌లో అదిరే ట్విస్ట్

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18లో ఇప్పటి వరకూ 55 మ్యాచ్‌లు పూర్తయినప్పటికీ, ఏ జట్టు ప్లేఆఫ్‌లోకి ప్రవేశించలేక పోవడం గమనార్హం. మూడు జట్లు ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించగా, ప్లేఆఫ్ రేసు 7 జట్ల మధ్య కొనసాగుతోంది. అందువల్ల, ఈ వారం జరిగే మ్యాచ్ ప్లేఆఫ్స్‌లో ఆడబోయే జట్ల విషయంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. ఈ 18వ సీజన్‌లో అద్భుతంగా రాణించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రస్తుతం 11 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 16 పాయింట్లు సాధించినప్పటికీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మాత్రం అధికారికంగా ప్లేఆఫ్‌లోకి ప్రవేశించలేదు. దీనికి ప్రధాన కారణం మరో 7 జట్లు ప్లేఆఫ్ రేసులో ఉండటమే. ముఖ్యంగా, 4 జట్లు బెంగుళూరును అధిగమించి ప్లేఆఫ్స్‌కు చేరుకునే ఛాన్స్ ఉంది. అందుకే, రాబోయే మూడు మ్యాచ్‌లు ఆర్‌సీబీకి కీలకం కానున్నాయి. ముంబై ఇండియన్స్ తమ తదుపరి మూడు మ్యాచ్‌ల్లో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడిస్తే, ఆ జట్టు మొత్తం 20 పాయింట్లతో ప్లేఆఫ్‌కు చేరుకుంటుంది. పంజాబ్ కింగ్స్ తమ తదుపరి 3 మ్యాచ్‌ల్లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్‌ను ఓడిస్తే 19 పాయింట్లతో ప్లేఆఫ్‌లో తమ స్థానాన్ని పదిలం చేసుకుంటుంది. అదేవిధంగా, గుజరాత్ టైటాన్స్‌కు సంబంధించి లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించినట్లయితే మొత్తం 18 పాయింట్లతో ప్లేఆఫ్‌కు అర్హత సాధిస్తుంది. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్ తమ తదుపరి మూడు మ్యాచ్‌ల్లో గెలిస్తే, అంటే, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులను ఓడించినట్లయితే, ఆ జట్టు మొత్తం 17 పాయింట్లతో ప్లేఆఫ్‌కు అర్హత సాధిస్తారు. ఇదిలా ఉండగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడిపోతే 16 పాయింట్లతో కొనసాగుతుంది. ఇదే జరిగితే, ఐపీఎల్ ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది. పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తదుపరి దశకు చేరుకుంటాయి. అందుకే, తదుపరి మ్యాచ్‌లు ఆర్సీబీ జట్టుకు కీలకం.



### వరల్డ్ టెస్ట్ ఛాంపియన్..


# ఫైనల్‌కు కౌంట్ డౌన్

### ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య బిగ్‌ఫైట్

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25 ఫైనల్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఇంగ్లండ్‌లోని లార్డ్స్ వేదికగా జూన్ 11 నుండి 15 వరకూ జరుగనున్న తుది పోరులో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి రెండో సారి టైటిల్‌ను సొంతం చేసుకోవాలని ఆస్ట్రేలియా భావిస్తుంటే, దక్షిణాఫ్రికా సైతం తొలిసారి ట్రోఫీని ముద్దాడాలని పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫైనల్‌కు ముందు జింబాబ్వేతో దక్షిణాఫ్రికా నాలుగు రోజుల టెస్టు ఆడేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెలాఖరి వారంతో ఈ మ్యాచ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సన్నహాకాల్లో భాగంగా ప్రొటీస్ జట్టు జూన్ 3న కూడా తలపడనుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ప్లేయర్లు భారత్‌లో జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఐపీఎల్‌లో గ్రూప్ స్టేజి ముగిసిన తర్వాత కొంత మంది సఫారీ ఆటగాళ్లు నేరుగా ఇంగ్లండ్ పయనం కానున్నారు. మిగిలిన ప్లేయర్లు ఈ నెల 25న ఐపీఎల్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికా జట్టులో చేరనున్నారు. కాగా దక్షిణాఫ్రికా జుట్టు స్టార్ పేసర్ కగిసో రబాడ ప్రపంచ డోపింగ్ వ్యతిరేక సంస్థ (వాడా) తాత్కాలికంగా విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. అతడు తిరిగి మళ్లీ మైదానంలో అడుగుడుపెట్టనున్నాడు. తొలుత వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లకు రబాడ దూరం కానున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నిషేధం ఎత్తి వేయడంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఊపిరిపీల్చుకుంది.

# ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**న్యూఢిల్లీ, మే 6:** ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా ప్రపంచ ఆర్థిక నివేదిక ఏప్రిల్ 2025 ప్రకారం, భారత్ ఈ ఏడాది (2025) జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఈ కీలక పరిణామం భారత ఆర్థిక ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలవనుంది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరానికి భారత నామమాత్ర జీడీపీ 4,187.017 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 348 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా. ఇదే కాలంలో జపాన్ జీడీపీ 4,186.431 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 347.9 లక్షల కోట్లు) ఉండొచ్చని పేర్కొంది. ఈ స్వల్ప తేడాతో భారత్, జపాన్‌ను అధిగ మించి నాలుగో స్థానానికి ఎగబాకనుంది. ప్రస్తుతం (2024 వరకు) భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. భారత్ ప్రస్థానం ఇక్కడితో ఆగదని, రానున్న సంవత్సరాల్లో జర్మనీని కూడా అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2028 నాటికి భారత జీడీపీ 5,584.476 బిలియన్ డాలర్లకు చేరుతుందని, అదే సమయంలో జర్మనీ జీడీపీ 5,251.928 బిలియన్ డాలర్లుగా ఉంటుందని లెక్కగట్టింది. అంతకు ముందే, అంటే 2027 నాటికి, భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు 5,069.47 బిలియన్ డాలర్లు) మార్కును దాటుతుందని నివేదిక స్పష్టం చేసింది. ఇక ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థల విషయానికొస్తే, 2025లో కూడా అమెరికా (30.5 ట్రిలియన్ డాలర్లు), చైనాలే (19.2 ట్రిలియన్ డాలర్లు) తొలి రెండు స్థానాల్లో కొనసాగు తాయని ఐఎంఎఫ్ పేర్కొంది. ఈ దశాబ్దం చివరివరకు ఈస్థానాల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని అంచనా.



# నిరాశపర్చిన ఏథర్ ఎనర్జీ..

**ముంబై, మే 6:** దలాల్ స్ట్రీట్‌లో మంగళవారం కొత్త కంపెనీ లిస్టయ్యింది. ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఇష్యూ ధరతో పోలిస్తే కేవలం రెండు శాతం ప్రీమియంతో సంస్థ షేర్లు లిస్ట్ అయ్యాయి. ఏథర్ ఎనర్జీ షేర్ ఇష్యూ ధర రూ.321 కాగా, నిఫ్టీలో రూ.328, బీఎస్ఈలో రూ.326తో నమోదైంది. మదుపర్ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాక పోవడంతో లిస్టింగ్‌లో అదరగొట్టలేక పోయింది. అనంతరం ట్రేడింగ్ ప్రారంభించిన కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 5శాతానికి పైగా నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించు కోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ నిధులను మహారాష్ట్ర లోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించు కునేందుకు కంపెనీ వినియోగిం చుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించ బోతోంది. ఐపీఓకు సంబంధించి ఏప్రిల్ 28 నుంచి 30 వరకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంది. ఈ పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కంపెనీ కేటాయించింది. 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం షేర్లను రిటైల్‌ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. విద్యుత్ వాహన విభాగంలో ఐపీఓకు వచ్చిన రెండో సంస్థగా ఏథర్ ఎనర్జీ నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చిన తొలి ఐపీఓ ఇదే. బెంగళూరు కేంద్రంగా 2013లో ఈ సంస్థ ప్రారంభమైంది. తరుణ్‌మెహతా, స్వప్నిల్ జైన్ వ్యవస్థాపకులు. ఈవీ బ్రాండ్స్ లో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది.




# జొమాటో నుంచి 19వేల రెస్టారెట్లు తొలగింపు!

**ముంబై, మే 6:** ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో పలు రెస్టారెంట్లకు షాకిచ్చింది. వినియోగదారుల ఫిర్యాదు ఆధారంగా ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటించని రెస్టారెంట్లు, ఇతర బ్రాండ్‌లను కాపీ చేసి కస్టమర్లను తప్పుదారి పట్టించిన దాదాపు 19వేల రెస్టారెంట్లను యాప్ నుంచి తొలగించింది. ఈ విషయాన్ని స్వయంగా సంస్థ సిఇఒ దీపిందర్ గోయల్ తెలిపారు. ఈ యేడాది జొమాటో ఫుడ్ డెలివరీ విభాగంలో ఊహించిన దాని కంటే చాలా తక్కువ వృద్ధి నమోదు చేసింది. గతేడాది నవంబర్‌లో కంపెనీ వార్షిక వృద్ధి 20 శాతంగా ఉండాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కానీ వాస్తవానికి జొమాటో వృద్ధి చాలా తక్కువగా ఉందని గోయల్ పేర్కొన్నారు. వినియోగ దారులు ముఖ్యంగా రెస్టారెంట్లకు వెళ్లడం, అక్కడ నుంచి ఆహారాన్ని తెప్పించుకోవడం బాగా తగ్గించారని చెప్పారు. అలాగే ఫుడ్ డెలివరీ విభాగంలో పోటీ పెరుగుతుందని, డెలివరీ సిబ్బందికి కూడా డిమాండ్ బాగా పెరుగడంతో జొమాటో తాత్కాలి కంగా డెలివరీ పార్టనర్స్ కొరతను ఎదుర్కొంటోందన్నారు. కాగా తాజాగా జొమాటో క్విక్ డెలివరీ సేవలను మళ్లీ నిలిపేసింది. ఫలితంగా ప్రారంభించిన నాలుగు నెలలకే క్విక్ డెలివరీ సేవలు క్లోజ్ అయ్యాయి. 2022లో జొమాటో ఇన్‌స్టంట్ పేరుతో 10 నిమిషాల డెలివరీ సర్వీస్‌ను ప్రారంభించి, యేడాదిలోనే నిలిపివేసింది. తాజాగా మరోసారి క్విక్ సేవను కూడా ఆపేయడం వెనుక నిర్వహణలో ఏర్పడిన సవాళ్లు, పోటీ సంస్థల ఒత్తిడి వంటి అంశాలే ప్రధాన కారణాలుగా పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# రెండ్రోజుల లాభాలకు బ్రేక్

**ముంబై, మే 6:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. మాక్‌డ్రిల్స్ నిర్వహించా లంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తొచ్చన్న అంచనాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీనికి తోడు తమ దేశంలో ఔషధాల ఉత్పత్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రభావం మన ఫార్మా స్టాక్స్‌పై పడింది. వడ్డీ రేట్లపై బుధవారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ నుంచి నిర్ణయం వెలువడనుండడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 80,907.24 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 80,481.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81.55 పాయింట్ల నష్టంతో 24,379.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.43గా ఉంది. ఎటర్నల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, మహీంద్రా మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.88 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు మళ్లీ 3,400 డాలర్లకు చేరువవుతోంది. ప్రస్తుతం 3,391 డాలర్ల వద్ద ట్రేడయింది.



# వాణిజ్యం

# మేడ్ ఇన్ ఇండియా కార్లు అమ్మకాల్లో రికార్డ్

**ముంబై, మే 6:** భారతదేశ కార్ల మార్కెట్ ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద వాటిలో ఒకటి. దేశంలో తమ వాహనాలను తయారు చేసి విక్రయించడానికి అనేక అగ్రబ్రాండ్‌లను ఆకర్షిస్తోంది. భారతదేశంలో ఉత్పత్తి చేసిన ఆరు కార్ మోడళ్లు ఇప్పుడు దేశీయంగా అమ్ముడవుతున్న దానికంటే ఎక్కువ సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయి. ఈ మోడళ్లలో హోండా సిటీ, ఎలివేట్, నిస్సాన్‌సన్నీ, మాగ్నైట్,హ్యుందాయ్ వెర్నా, జీప్ మెరిడియన్ ఉన్నాయి. మొదట భారతీయ వినియోగదారుల కోసం రూపొందించబడిన ఈ వాహనాలు ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి ఆదరణ పొందుతున్నాయి. 2025ఆర్థిక సంవ త్సరానికి సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటో మొబైల్ తయారీదారులు (ఎస్ఐఎఎం) ఇచ్చిన డేటా ప్రకారం.. ఎగుమతుల వైపు ఈ మార్పు తరచుగా దేశీయ డిమాండ్ లేకపోవ డం, ప్రపంచ మార్కెట్లకు అనుగుణంగా కార్ల తయారీదారుల సామర్థ్యం కారణంగా ఉంటుంది. దీనికి ప్రధాన ఉదాహరణ హోండా ఎలివేట్. ఇది భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న మార్కెట్ నుండి అధిక అంచనాలతో సెప్టెంబర్ 2023లో ప్రారంభించింది. ఉత్పత్తి ప్రారంభంలో పెరుగుదల ఉన్నప్పటికీ, దేశీయ అమ్మకాలు తగ్గాయి. దీనితో హోండా జపాన్ వంటి అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంది. 2025లో హోండా భారతదేశంలో 22,321 యూనిట్ల ఎలివేట్‌ను విక్రయించింది. కానీ 45,167 యూనిట్లను ఎగుమతి చేసింది. గత సంవత్సరం స్థానిక అమ్మకాలు 33,642 యూనిట్లు, ఎగుమతి చేయబడిన 10,273 యూనిట్లతో పోలిస్తే 2025లో ఎలివేట్ ఉత్పత్తి 54% పెరిగి 67,488 యూనిట్లకు చేరుకుంది. ఉత్పత్తి స్థాయిలు, సరఫరాదారు నిబద్ధతలను నిర్వహించడానికి ఎగుమతులు కీలకంగా మారాయి. హ్యుందాయ్ వెర్నా విషయంలో కూడా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంది.




2023 పునఃప్రారంభం భారతదేశంలో ఎస్‌యూవీల కారణంగా నష్టపోతున్న సెడాన్‌లపై ఆసక్తిని తిరిగి రేకెత్తించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే దేశీయ డిమాండ్ అంచనాలను అందుకోలేకపోయింది. దీనితో హ్యుందాయ్ దాని స్థాపించబడిన ఎగుమతి నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంది. వెర్నామధ్యప్రాచ్యం,ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి మార్కెట్లలో గణనీయమైన విజయాన్ని సాధించింది.

# ఉద్యోగులకు టిసిఎస్ 100% వేరియబుల్ పే

**న్యూఢిల్లీ, మే 6:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) జనవరి మార్చి త్రైమాసికానికి వేరియబుల్ పే అలవెన్స్‌ను చెల్లించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేసినట్లు టీసీఎస్ తెలిపింది. తమ తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు వేరియబుల్ పే చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. ప్రతి త్రైమాసికంలోనూ టీసీఎస్ ఇదే విధానాన్ని అవలంబిస్తోందని ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఇటీవల మార్చి నెల త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన టీసీఎస్, రూ.12,224 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్జిన్లు తగ్గడంతో నికర లాభం 1.7 శాతం మేర క్షీణించింది. ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. అయితే, త్రైమాసిక ఫలితాల సందర్భంగా 6.07 లక్షల మంది ఉద్యోగులకు వార్షిక వేతన పెంపును వాయిదా వేసినట్లు ప్రకటించింది. సుంకాల కారణంగా నెలకొన్న అనిశ్చితిని ఇందుకు కారణంగా చూపింది. సాధారణంగా ఏప్రిల్ నెలలో వేతన పెంపు ఉంటుంది. ఈసారి ఎప్పుడు చెల్లించేదీ మాత్రం టీసీఎస్ వెల్లడించలేదు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.